# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 3 - సంచిక 12 | సెప్టెంబరు 2025 | వెల : రూ.15

ప్రతిపక్ష ముక్త్ భారత్ కోసమే.. 130వ రాజ్యాంగ సవరణ

130వ సవరణతో రాజ్యాంగ సూత్రాలకు సమాధి

ప్రతీకార చర్యకు రాజ్యాంగ బద్ధతా?

'ఓటు చోరీ'.. రాష్ట్రాల వివరాలు

అమృతకాలంలో మర్యాదలన్నీ బలాదూర్ !

నాకు తెలిసిన సురవరం సుధాకరరెడ్డి

నికార్సయిన కమ్యూనిజానికి నిలువుటద్దం

ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు నిర్మాణ స్వరూపాలు

హిందూత్వ వాదం - సైన్సుకు ప్రమాదం

'మార్వాడీ గోబ్యాక్' జాతి సమస్య కాదు, దోపిడీ సమస్య !

లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతి-సాహిత్యం

తెలుగు జాతి సారస్వత మహాయాత్ర ! కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర!!

భౌతికవాదుల చేతిలో బ్రహ్మాస్త్రం 'భారతీయ నాస్తికవాదం'

ఆదర్శ కమ్యూనిస్టు డా.చెలికాని రామారావు

సెప్టెంబరు - 2025 పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 12


డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) ప్రతిపక్ష ముక్త్ భారత్ కోసమే.. 130వ రాజ్యాంగ సవరణ - సంపాదకీయం 3
2) 130వ సవరణతో రాజ్యాంగ సూత్రాలకు సమాధి - పి.చిదంబరం 4
3) ప్రతీకార చర్యకు రాజ్యాంగ బద్ధతా? - 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం 6
4) 'ఓటు చోరీ'.. రాష్ట్రాల వివరాలు - ఎం.వి.ఎ.షరీఫ్ 8
5) అమృతకాలంలో మర్యాదలన్నీ బలాదూర్ ! - కె.శ్రీనివాస్ 11
6) నాకు తెలిసిన సురవరం సుధాకరరెడ్డి - ఆర్వీ రామారావ్ 13
7) నికార్సయిన కమ్యూనిజానికి నిలువుటద్దం - దేవులపల్లి అమర్ 15
8) ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు నిర్మాణ స్వరూపాలు - పి.బి.చారి 17
9) హిందూత్వ వాదం - సైన్సుకు ప్రమాదం - ఎస్.వెంకట్రావు 22
10) 'మార్వాడీ గోబ్యాక్' జాతి సమస్య కాదు, దోపిడీ సమస్య ! -ఎన్.వేణుగోపాల్ 26
11) లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతి-సాహిత్యం - కల్లూరి భాస్కరం 28
12) తెలుగు జాతి సారస్వత మహాయాత్ర ! కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర!! - గౌరవ్ 32
13) భౌతికవాదుల చేతిలో బ్రహ్మాస్త్రం 'భారతీయ నాస్తికవాదం' 35
14) ఆదర్శ కమ్యూనిస్టు డా.చెలికాని రామారావు - పి.యస్.ప్రకాశరావు 37
15) కార్టూన్స్ 43
16) కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# ప్రతిపక్ష ముక్త్ భారత్ కోసమే.. 130వ రాజ్యాంగ సవరణ

మోదీ మొదట ఇచ్చిన నినాదం 'కాంగ్రెస్ ముక్త్ భారత్'. అది ఫలితం ఇవ్వకపోగా ఎదురొచ్చింది. నాటి కంటే కాంగ్రెస్ బలపడింది. ప్రతిపక్షంగా ఎదిగింది. అంతేకాదు మోదీని సవాల్ చేసే 'ఇండియా కూటమి'ని ఏర్పాటు చేసింది. 2024 ఎన్నికల్లో మోదీ 400 సీట్ల లక్ష్యాన్ని గల్లంతు చేయడమే కాకుండా పూర్తి మెజారిటీ కూడా దక్కకుండా చేసింది. ఈ కూటమిలో కాంగ్రెస్ ప్రధాన పార్టీగా వున్నప్పటికీ ప్రాంతీయ ప్రతిపక్ష పార్టీలే ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ఇప్పుడు కొత్త నినాదం అవసరమైంది. 'ప్రతిపక్ష ముక్త్' భారత్ నినాదాన్ని పరోక్షంగా చేపట్టింది. రాబోయే 40-50 సంవత్సరాలు తామే అధికారంలో వుంటామని అమిత్ షా పదేపదే ప్రకటిస్తున్నారు. 40-50 సంవత్సరాలపాటు దేశం వుంటుంది. ప్రజలు వుంటారు. కాని, పాలక పార్టీ అధికారంలో వుంటుందో, వూడుతుందో తెలియదు. అయినా అమిత్ షా బీరాలు పలుకుతున్నారంటే దానికివారు కొత్తదారులు వెదుకుతున్నట్లు స్పష్టం అవుతున్నది. హిందూత్వ నినాదం ఎంతగా మారుమోగినా బీజేపీకి వచ్చిన ఓట్లు 35-37 శాతానికి మించడం లేదు. మోదీ పాలన అదనపు ఓట్లు తెచ్చేదిగా లేకపోగా ధరల పెరుగుదల, నిరుద్యోగం, వగైరాలు ప్రజల ఆగ్రహానికి కారణం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మోదీ బృందానికి కొత్తదారులు అవసరం అయ్యాయి. అందులో భాగంగానే గత ఎన్నికలలోనే ఓట్ చోరీకి గోప్యంగా తెరతీశారు. ఇప్పుడు బీహార్ ఓటర్ల జాబితా సవరణలో ఆ గుట్టు కాస్తా రట్టు అయ్యింది.

ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ ఇప్పుడు అమిత్ షా జేబు సంస్థ అయ్యింది. అమిత్ షా మంత్రిగా వున్న శాఖలకు ముఖ్య కార్యదర్శిగా పనిచేసి 'జీ హుజూర్'గా వ్యవహరించిన జ్ఞానేశ్వర్ కుమార్‌ను ఎన్నికల కమిషనర్‌గా నియమించి ఓట్ల చోరీకి నిస్సిగ్గుగా పాల్పడడం చూస్తున్నాం. సుప్రీంకోర్టు జోక్యంతో ఈ దొంగాటకు కొంత అడ్డుకట్ట పడినా రాబోయే ఎన్నికలు సజావుగా జరుగుతాయన్న నమ్మకం సడలిపోయింది. చివరి గంటలో జరిగినట్లు ప్రకటించిన ముమ్మర పోలింగ్, పోలైనన ఓట్లు వివరాలు వెల్లడించడంలో జాప్యం, పోలైన ఓట్లకంటే లెక్కించిన ఓట్లు అధికంగా వుండడం వగైరాలన్నీ ఫలితాలు తారుమారు కావడంలో పాత్ర పోషిస్తున్నాయి.

అలాగే మోదీ-షాల ప్రభుత్వం, ఈడీ, సీబీఐలను ప్రతిపక్ష పార్టీల నేతల మీద ప్రయోగించి వారిని లొంగదీసుకోవడం, ఆ పార్టీలను చీల్చడానికి వినియోగించుకోవడం ఒక నిరంతర ప్రక్రియగా సాగిపోతున్నది. ఇప్పుడు మోదీ ప్రభుత్వం దానికి చట్టబద్ధత కల్పించే పనిచేస్తుంది. 130వ రాజ్యాంగ సవరణ దాని కోసమే ఉద్దేశించింది. ఈ బిల్లు చట్టం అయితే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు ఎవరైనా ఐదేళ్ల శిక్ష పడే అవకాశం వున్న నేరారోపణల తో 30 రోజులు జైలులో వుంటే చాలు రుజువులు, శిక్షలు లేకపోయినా వారి పదవులు ఊడిపోతాయి. అన్ని రాష్ట్రాలలోను బీజేపీ గవర్నర్లే వున్నారు. ప్రతిపక్షాల ముఖ్యమంత్రుల మీద నేరారోపణ చేసే ఈడీ, సీబీఐ వగైరా సంస్థలు వారి చేతుల్లోనే వున్నాయి. 30 రోజులే కాదు అనేక నెలల తరబడి బెయిల్ దక్కకుండా చేసే పరిస్థితి వుంది. ఈ నేపథ్యంలో ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలలో ముఖ్యమంత్రులుగా కేసులు ఎదుర్కొంటున్న రేవంత్ రెడ్డి, ఎంకే స్టాలిన్, సిద్ధరామయ్యలు వున్నారు. ఈ రాష్ట్రాలను అస్థిరపరిస్తే అక్కడ రాజకీయం తమకు అనుకూలంగా మార్చుకునే నేర్పు అమిత్ షా బృందానికి వుంది. "ప్రతిపక్ష ముక్త భారత్" పేరుతో అధికారాన్ని శాశ్వతం చేసుకోడానికి మోదీ ప్రభుత్వం తొక్కుతున్న అడ్డదారుల్లో 130వ రాజ్యాంగ సవరణ మరో దుర్మార్గం. ❑

**- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

# 130వ సవరణతో రాజ్యాంగ సూత్రాలకు సమాధి



- పి.చిదంబరం

**రా**జ్యాంగానికి సవరణ చేసేందుకు పార్లమెంటుకు గల అధికారాలు, అందుకు అనుసరించవలసిన విధానాన్ని అధికరణ 368 విశదీకరించింది. ఆ అధికరణలోని నిబంధన 2, ఇతర విషయాలతోపాటు ఇలా ఉన్నది : 'రాజ్యాంగంలో ఏమి పేర్కొన్నప్పటికీ ఈ రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే, లేక మార్పు చేసే, లేక తొలగించే రాజ్యాంగబద్ధమైన అధికారం పార్లమెంటుకు ఉంటుంది. రాజ్యాంగ సవరణ విధానం ఈ క్రింద ఉదహరింపబడిన విధంగా ఉంటుంది. “రాజ్యాంగ సవరణకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభలో గాని, లేక రాజ్యసభలో గాని మాత్రమే ప్రవేశపెట్టవలెను. ఆ బిల్లును సభకు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆమోదించవలెను. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య సభ మొత్తం సభ్యుల సంఖ్యలో సగం కన్న ఎక్కువగా ఉండవలెను. లోక్‌సభలోను, రాజ్యసభలోను ఇదే విధంగా ఆమోదింపవలెను. ఆ విధంగా రెండు సభలు ఆమోదించిన తరువాత ఆ బిల్లును రాష్ట్రపతికి పంపవలెను. రాష్ట్రపతి ఆ బిల్లును తప్పనిసరిగా ఆమోదించవలెను. అప్పుడు బిల్లులో ఉదహరింపబడిన విధంగా రాజ్యాంగం సవరింపబడుతుంది”.




రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందగల సంఖ్యా బలం ఎన్డీఏ ప్రభుత్వానికి పార్లమెంటు ఉభయ సభలలోనూ లేదు. లోక్‌సభలో ఎన్డీఏ సభ్యులు 293(మొత్తం సభ్యుల సంఖ్య 543) మంది మాత్రమే కాగా రాజ్యసభలోనూ పాలక కూటమికి కేవలం 133 మంది సభ్యులే (మొత్తం సభ్యుల సంఖ్య 245) ఉన్నారు. ఏ సభలోనైనా ఒక బిల్లు ఆమోదం పొందాలంటే, సభ్యులు అందరూ సభకు హాజరై బిల్లుపై ఓటింగ్‌లో పాల్గొంటే మూడింట రెండు వంతుల మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేసినప్పుడు మాత్రమే అది చట్ట ప్రతిపత్తి పొందడానికి అర్హమవుతుంది. (ఓటింగ్‌కు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ సవరణ బిల్లును ఆమోదించాలి. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య మొత్తం సభలోని స్థానాలలో సగంకన్నా ఎక్కువగా ఉండాలి. ఉదాహరణకు ఒక సభలో మొత్తం సభ్యుల సంఖ్య 300 అనుకుందాం. సభకు 150 మంది హాజరయ్యారు. వారిలో 100 మంది ఆ సవరణను ఆమోదించారు. అయినా ఆమోదించినట్లు కాదు. ఎందుకంటే ఆ సవరణ మొత్తం సభ్యులలో మెజారిటీ ఆమోదం పొందలేదు కనుక. సభకు కనీసం 200 మంది హాజరై వారిలో 151 మంది ఆ సవరణను ఆమోదిస్తే సభ ఆమోదం పొందినట్లుగా పరిగణితమవుతుంది. ఉభయ సభలలోను ఇదే విధంగా ఆమోదం పొందాలి. ఇలా ఏ సభలోను ఆమోదం పొందలేకపోతే రాజ్యాంగ సవరణ వీగిపోయినట్లే). అయితే ప్రస్తుత రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు అవసరమైన మెజారిటీ పాలక ఎన్డీఏకు ఏ సభలోనూ లేదు.

**ప్రతిపక్షాలు అన్నిటికీ కలిపి లోక్‌సభలో 250 మంది సభ్యులు, రాజ్యసభలో 120 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. కనుక ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ఏ సభలోను ఆమోదం పొందలేదు. లోక్‌సభలో 182 మంది సభ్యులు, రాజ్యసభలో 82 మంది సభ్యులు ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే అది ఆమోదం పొందదు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ప్రతిపక్షాలు అన్నీ ఎన్డీఏకు వ్యతిరేకంగా లేవు. వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్, భారత రాష్ట్ర సమితి, బహుజన్ సమాజ్ పార్టీ, ఇంకా కొన్ని చిన్న పార్టీలు ఎన్డీఏ ప్రభుత్వానికే మద్దతును ఇస్తున్నాయి. ఏఐటీసీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్డీఏను వ్యతిరేకిస్తున్నాయి. అయితే ఇండియా కూటమికి వాటి మద్దతు అంశాల ప్రాతిపదికన ఉంటుంది.**

ఈ పరిస్థితులలో ఎన్డీఏ ప్రభుత్వం 'రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు-

2025'ని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. వెనువెంటనే ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనకు నివేదించారు. చాలా సరళంగా కన్పిస్తున్న ఈ బిల్లు లక్ష్యమేమిటి ? ఐదు సంవత్సరాలు, అంతకుమించి జైలు శిక్షకు అర్హమయ్యే నేరాభియోగాలతో అరెస్టయిన మంత్రులు (ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సైతం) జైలులో 30 రోజులు ఉంటే పదవీచ్యుతులు అవుతారు. ఆ ముప్పై రోజులలో దర్యాప్తు పూర్తికావడం అసాధ్యం. చార్జిషీటును దాఖలు చేయడమూ జరిగే పని కాదు. ఆరోపణలు ఉండవు, విచారణ జరగదు, శిక్ష నిర్ధారణ కాదు. అయినప్పటికీ 31వ రోజున 'నేరస్తుడు' అనే కళంకంతో పదవిని కోల్పోతాడు ! ఈ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ, రాజకీయ నైతికతకు పరాకాష్ఠ అని భారతీయ జనతా పార్టీ ఘోషిస్తోంది. ఏమిటి ఆ పార్టీ వాదన? 'అవినీతిపరుడు' అయిన ఒక మంత్రిని పదవి నుంచి తొలగించడంకంటే ఉన్నతా దర్శం మరేముంటుంది? ఒక మంత్రి (లేదా ముఖ్యమంత్రి) జైలు నుంచి పరిపాలన చేయ వచ్చా? చెప్పవచ్చిన దేమిటంటే బీజేపీ దృష్టిలో ఈ బిల్లును సమర్థించే వారు నిజమైన దేశభక్తులు, జాతీయవాదులు. వ్యతిరేకించే వారు జాతి వ్యతిరేకులు, అర్బన్ నక్సల్స్, పాకిస్థానీ ఏజెంట్లు.

ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నేర విచారణ చట్టం అమల వుతున్న తీరు తెన్నులు తీవ్ర భయాందోళనలకు గురి చేస్తు న్నాయి. న్యాయం సమకూరడమనేది సందేహాస్పదం అవుతోంది. ఎందుకో చూద్దాం : జీఎస్టీ చట్టాలతో సహా అన్ని చట్టాలను రాజకీయ ప్రత్యర్థులపై ఆయుధాలుగా ప్రయోగిస్తున్నారు. (కానిస్టేబుల్‌తో సహా) ఏ పోలీసు అధికారి అయినా వారంట్‌తోనో లేక వారంట్ లేకుండానో ఏ వ్యక్తినైనా అరెస్ట్ చేయవచ్చు.. కేసు పెట్టదగిన నేరానికి పాల్పడినట్టు ఎవరిపైన అయినా సహేతుకమైన అనుమానం ఉంటే సదరు వ్యక్తిని అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు ఉన్నది. 'బెయిల్ అనేది నియమం, జైలు అనేది మినహాయింపు' అని జస్టిస్ కృష్ణయ్యర్ ధర్మ ప్రవచనం చేసినప్పటికీ ట్రయల్ కోర్టులు బెయిల్ మంజూరు చేసేందుకు ఇష్టపడడం లేదు. ప్రథమ విచారణలో హైకోర్టులు బెయిల్ మంజూరు చేయవు. ఏదో ఒక సాకుతో బెయిల్ ఇవ్వకుండా విచారణ కొనసాగించి, 60–90 రోజుల అనంతరం బెయిల్ మంజూరు చేయడం పరిపాటిగా ఉన్నది. ఈ శోచనీయ వ్యవహారాల ఫలితంగా దేశ సర్వోన్నత న్యాయస్థానంలో రోజూ డజన్ల కొద్దీ బెయిల్ పిటిషన్లు దాఖలవుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే సుప్రీంకోర్టు సైతం ట్రయల్ కోర్టు విధులు నిర్వర్తించవలసి వస్తోంది.

130వ రాజ్యాంగ సవరణ బిల్లులో ప్రధానమంత్రిని కూడా చేర్చడం హాస్యాస్పదం. ఏ పోలీసు అధికారీ ప్రధానమంత్రిని అరెస్ట్ చేసేందుకు సాహసించడు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయేలా చేసేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని ఇండియా కూటమి, తృణమూల్ కాంగ్రెస్ సులువుగా కూడగట్టుకోగలుగుతాయి. అయినప్పటికీ ఈ బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడం ఖాయమనే ఆత్మ విశ్వాసంతో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నది. ఉభయ సభలలోను కొన్ని ప్రతిపక్షాల లేదా ఎంపీల మద్దతు పొందగల ఉపాయమేదో ప్రభుత్వానికి ఉన్నట్టుగా ఉంది. బహుశా, ఓటింగ్ రోజున కొంత మంది విపక్ష ఎంపీలు 'అదృశ్యమయ్యే' చాణక్యానికి ప్రభుత్వం పాల్పడవచ్చు. లేదూ, ఇంకేదైనా వ్యూహం ప్రభుత్వానికి ఉన్నదేమో గానీ అది నా అవగాహనకు మించినది. ఈ బిల్లు విషయమై ప్రధానమంత్రి, హోం మంత్రి ఇప్పటికే సమరనాదాలు చేశారు. అది తప్పక పార్లమెంటు ఆమోదం పొందుతుందని ఘంటాపథంగా చెబుతున్నారు. సరే, 'విధేయ' మీడియా వారి మాటలు, వాదనలు వల్లె వేస్తోంది.

**అసెంబ్లీ ఎన్నికలు బిహార్ (2025), అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ (2026) ముగిసేంత వరకు ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై జాయింట్ సెలెక్ట్ కమిటీ ఎటువంటి నిర్ణయం తీసుకోదు. మీడియా వార్తల ప్రకారం 2014 నుంచి ప్రతిపక్షాలకు చెందిన 12 మంది మంత్రులను అరెస్ట్ చేశారు. వారిలో చాలా మందికి నెలల తరబడి బెయిల్ మంజూరు కాలేదు. 2014 నుంచి తీవ్ర నేరాభియోగాలను ఎదుర్కొంటున్న 25 మంది రాజకీయ నాయకులు బీజేపీలో చేరారు. చేరిన వెంటనే వారందరూ నేరారోపణల నుంచి విముక్తులయ్యారు! నాకు గుర్తున్నంత వరకు 2014 నుంచి బీజేపీకి చెందిన ఏ మంత్రి కూడా అరెస్ట్ కాలేదు.**

రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు–2025 పార్లమెంటు ఆమోదం పొందితే, ప్రతిపక్ష నాయకులను పదే పదే అరెస్ట్ చేసి జైలు పాలు చేసే బెలారస్, బంగ్లాదేశ్, కంబోడియా, కెమెరూన్, కాంగో (డిఆర్‌సి), మయన్మార్, నికరాగువా, పాకిస్థాన్, రష్యా, రువాండా, ఉగాండా, వెనిజులా, జాంబియా, జింబాబ్వేల సరసన చేరుతుంది. ఇది ప్రతిష్ఠాకరమేనా ? సమాధానం స్పష్టమే. రాజకీయ పార్టీలు గట్టిగా వ్యతిరేకిస్తే ఆ బిల్లు పార్ల మెంటు ఆమోదం పొందడంలో విఫలమవుతుంది. ❑


**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# ప్రతీకార చర్యకు రాజ్యాంగ బద్ధతా ?

- 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

పార్లమెంటు వర్షాకాల సమావేశాల చివరి రోజు ప్రజలను, వారి ప్రతినిధులను తీవ్ర షాక్‌కు గురిచేసింది. ప్రజల ప్రాథమిక ఓటు హక్కును పెద్దయెత్తున తారుమారు చేశారన్న ఆరోపణలు తీవ్ర ప్రకంపనలు సృష్టించిన ఈ సెషన్‌లో ఆఖరి రోజు సాయంత్రం కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఒక రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం నివ్వెరపరచింది.

రాజ్యాంగ సవరణ (130వ సవరణ) బిల్లు-2025 కొన్ని సాధారణ సూత్రీకరణలను, అలాగే కేంద్ర పాలిత ప్రాంతాల్లోని నిర్దిష్ట పరిస్థితిని కలిగి వుంది. ఈ రాజ్యాంగ సవరణ బిల్లు వల్ల ఉత్పన్నమయ్యే రాజ్యాంగ, చట్టపరమైన ప్రశ్నలు ఈ సంచికలోనే మరోచోట సవివరంగా విశ్లేషించారు. అయితే, ఈ రాజ్యాంగ సవరణ బిల్లు రూపకల్పనలో రాజకీయ అంశాన్ని పరిశీలించడం ముఖ్యం. ఎందుకంటే, ఈ రాజ్యాంగ సవరణను ఆమోదించే ప్రక్రియ గురించి కనీస పరిజ్ఞానం ఉన్న ఏ పౌరునికైనా ఇది అత్యంత దారుణమైన చర్య అని ఇట్టే అర్థమవుతుంది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడం కోసం పాలక పక్షానికి పార్లమెంటు ఉభయసభల్లో ఒక్కొక్క దానిలో మూడింట రెండొంతుల మెజార్టీ అంటే హాజరైన సభ్యుల్లో సగానికి మించి సభ్యుల మద్దతు కావాలి. ఉభయసభల్లో ఉన్న ప్రస్తుత బలా బలాల పొందిక, సంఖ్యా బలం గురించి ఏ మాత్రం అవగాహన ఉన్నా ఈ బిల్లు ఆమోదం పొందడం అసాధ్యమని ఇట్టే చెప్పేయ వచ్చు. ఎప్పటికీ ఆమోదించబడని ఈ బిల్లును ఎందుకింత హడావుడిగా ప్రవేశపెట్టారు ? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. దీనికి ప్రభుత్వం తనదైన శైలిలో సమాధానం ఇస్తూ, ఇది 'ప్రజల ప్రయోజనాలు, సంక్షేమం, సుపరిపాలన'ను మెరుగ్గా పరిరక్షించేందుకేనని చెప్పింది. 'రాజ్యాంగ నైతికత'ను మరింత మెరుగైన స్థితికి తిరిగి తీసుకెళ్తానని వారు చెప్పినప్పుడు నిజంగానే అది చాలా విడ్డూరంగా అనిపించింది. వారు చేసిన గంభీరమైన ప్రకటనలు ఈ అంశాల్లో ప్రభుత్వ గత రికార్డును పరిశీలించక తప్పని స్థితికి నెట్టాయి. గతంలో ఈ ప్రభుత్వమే మనీ లాండరింగ్ యాక్ట్(పి.ఎం.ఎల్.ఎ)కి ఒక సవరణ చేసింది. ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇ.డి)ను ఒక కర్కశమైన ఆయుధంగా మార్చింది. ఈ కొత్త సవరణ కింద అభియోగం మోపబడిన వారికి బెయిలు నిరాకరించడం ఇ.డికి ఒక రివాజు అయిపోయింది. పి.ఎం.ఎల్.ఎ ఈ కొత్త రూపం ఆమోదం తరువాత దేశం చాలా వికృతాలను చూసింది. ముఖ్యమంత్రులతో సహా




ముఖ్యమైన ప్రతిపక్ష నాయకులపై దీనిని అనేకసార్లు ప్రయోగించారు. పి.ఎం.ఎల్.ఎలోని కొత్త నిబంధనల కింద ఆరు నెలలకుపైగా వారిని కటకటాల వెనక ఉంచారు. ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), హేమంత్ సోరెన్ (జార్ఖండ్)లకు సంబంధిత హైకోర్టులు ఈ అభియోగాల నుంచి తరువాత విముక్తిని ప్రసాదించాయి. ఈ ప్రతిపాదిత 130వ రాజ్యాంగ సవరణ గనుక అమలులో ఉంటే ఈ ఇద్దరు వ్యక్తులు కచ్చితంగా పదవిని కోల్పోయేవారు. తన మాట వినని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను అదేపనిగా కేంద్ర ప్రభుత్వం వెంటాడే సంగతి అలా ఉంచితే, ప్రతిపక్ష ఎంపీలను, ఎమ్మెల్యేలను ప్రభుత్వం కంటిచూపుతో బెదిరించి లొంగ దీసుకుని, వారిని బీజేపీలోకి ఫిరాయించేలా చేసేందుకు తనదైన మార్గాన్ని అనుసరించింది. ఈ పద్ధతికి సంబంధించి సవివరమైన నివేదికను 2024 ఏప్రిల్‌లో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఫ్రంట్ పేజీలో ప్రచురించింది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మాజీ మంత్రి సువేందు అధికారి (ఇప్పుడు ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష బీజేపీ నేతగా ఉన్నారు) మొదలుకుని (కాంగ్రెస్‌కు చెందిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, బీజేపీ అగ్ర నాయకత్వానికి అత్యంత ప్రీతిపాత్రుడిగా మారిన ప్రస్తుత అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వరకు) రెండు డజన్లకు పైగా మాజీ ప్రతిపక్ష సభ్యుల జాబితాను అది వెల్లడించింది. పాలక పార్టీ పచ్చిక బయళ్ల కోసం వీరు పార్టీ ఫిరాయించారు. వారందరిపై ఇ.డి కేసులు ఉన్నాయి. బీజేపీలోకి ఒక్కసారిగా ఫిరాయించగానే ఈ కేసుల నుంచి వారికి క్లీన్‌చిట్ లభించింది.

మహారాష్ట్రలో సాగిన ఫిరాయింపులు ఈ అసహ్యకరమైన పద్ధతి తాలూకు వికృత రూపానికి ఒక తిరుగులేని ఉదాహరణ. అక్కడ శివసేన, నేషనల్ కాంగ్రెస్ పార్టీలను చీల్చడం ద్వారా

ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ (ఎం.వి.ఎ) ప్రభుత్వాన్ని పడగొట్టారు. శివసేన నుంచి ఫిరాయించిన ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని కొత్త ప్రభుత్వంలో తొమ్మిది మంది కేబినెట్ మంత్రులు ఇ.డిచేత అభియోగాలు మోపబడినవారే. ఆ తరువాత వీరంతా ఆటోమెటిక్‌గా పరిశుద్ధులైపోయారు. నిస్సిగ్గుగా సాగిన ఈ చర్య బీజేపీకి 'వాషింగ్ మెషిన్' అనే అసహ్యకరమైన విశేషణాన్ని సంపాదించి పెట్టిందనే విషయం ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు.

ఇప్పుడు అమిత్ షా ఓ సాధు పుంగవునిలా స్వరం మార్చి ప్రతిపాదిత సవరణ రాజకీయాలు లేదా ఎన్నికల కోసం కాదని చెప్పినప్పుడు, ఆ అసంబద్ధమైన వాదనను విని సొంత పార్టీ వారే చాటుగా నవ్వుకునే పరిస్థితి ఏర్పడింది. ఎలక్టొరల్ బాండ్ స్కీమ్ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడంతో అవినీతి విషయంలో బీజేపీ అతి పెద్ద మోసకారితనం మరింత స్పష్టంగా రికార్డయింది. ఎలక్టొరల్ బాండ్ స్కీమ్ అనేది బీజేపీకి, ఒక సెక్షన్ కార్పొరేట్లకు మధ్య 'క్విడ్ ప్రోకో'కు సంబంధించిన అత్యంత బరితెగింపు చర్య. వాస్తవానికి ఈ స్కీము కింద బీజేపీకి లభించిన విరాళాల వివరాలను చూస్తే, ఆ పార్టీ బొక్కసంలో చేరిన రూ.5,000 కోట్లు అక్రమ లావాదేవీలేనని స్పష్టమవుతుంది.

బీజేపీ ఇంత భారీగా 'నిధులు' రాబట్టుకోడానికి ఇ.డి, సి.బి.ఐ ఫెసిలిటేటర్లుగా వ్యవహరించాయని మీడియా తదుపరి విచారణలో తేలింది. ఎలక్టొరల్ బాండ్ స్కీమ్ స్వచ్ఛంద విరాళాల కోసం ఉద్దేశించినది కాదని, బలవంతపు వసూళ్లే దీని అసలు లక్ష్యమని ఈ నిర్వాకంతో స్పష్టమైంది. ప్రజలకు జ్ఞాపక శక్తి తక్కువని అనుకుంటే పొరపాటు అని అమిత్‌షాకు ఎవరు గుర్తుచేస్తారు ? రాజ్యాంగ నైతికత గురించి ఆయన ప్రస్తావనను ఎప్పటికీ జీర్ణించుకోలేమని ఎవరు గుర్తు చేయగలరు ?

మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్‌కు వారు ఏమి చేసినప్పటికీ, ఆ కారణంగా ముందుకొచ్చిన ఉప రాష్ట్రపతి ఎన్నికలో గెలవడం కోసం జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోం మంత్రి చేసిన ఆరోపణలు సుప్రీంకోర్టు ఉత్తర్వులను అవమానించడంలో ఆయన ఎంత దూరమైనా వెళ్తారని స్పష్టమవుతుంది. అవినీతిపై పోరాడడంలో ముఖ్యమైన సాధనం పాలనలో పారదర్శకత పాటించడం. దీనికి భిన్నంగా బీజేపీ వ్యవహరిస్తోంది. ప్రధాన మంత్రి చదువుకు సంబంధించిన రికార్డులను ఇవ్వడానికి నిరాకరించడంపై సాగుతున్న చట్టపరమైన వాదనలు బహుశా పారదర్శకతకు పాతరేయడంపై ప్రభుత్వానికి ఎంతటి మక్కువో తెలియజేస్తున్నాయి. ఆయన అకడమిక్ రికార్డు వివరాలను ఎలాంటి దాపరికం లేకుండా వెల్లడిస్తే ఆ చర్య స్వయంగా ప్రధాని లేదా ఆయన ప్రభుత్వ నైతిక ప్రమాణం ప్రజల దృష్టిలో పెంచదా? ప్రభుత్వ భయంకరమైన ఈ రికార్డును చూశాక రాజ్యాంగ బిల్లు-2025 (130వ సవరణ)కు సంబంధించి పేర్కొన్న లక్ష్యాలను ఎవరూ స్వీకరించే స్థితి లేదు. ఈ అసహ్యకరమైన సవరణను ముందుకు నెట్టేందుకు ఎందుకింత ఆతృత పడుతున్నారన్న ప్రశ్న వెంటాడుతూనే వుంటుంది. బీజేపీ ఎన్నికల ప్రయోజనాల కోసం రాజ్యాంగ బద్ధమైన సంస్థ - భారత ఎన్నికల కమిషన్ (ఇ.సి.ఐ)ని, ప్రజల ప్రాథమిక ఓటు హక్కును, రాజ్యాంగాన్ని, నాశనం చేసే పన్నాగానికి సంబంధించి పెద్దయెత్తున ఆధారాలు లభించడంతో దాని నుంచి దృష్టిని పక్కదారి పట్టించే యత్నంలో భాగమే ఈ సవరణ అనే భావన వివిధ సెక్షన్ల ప్రజానీకంలో అంతకంతకూ పెరుగుతున్నది. ❑

## కేవలం రెండు రోజుల్లోనే 96 శాతం పెరిగిన కొత్త ఓటర్ల దరఖాస్తులు

పాట్నా : కేవలం రెండు రోజుల్లోనే కొత్త ఓటర్ల దరఖాస్తులు 96.6 శాతం మేర పెరిగాయి. ఎస్‌ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు 29వ రోజుకి చేరుకుంది. సెప్టెంబర్ 1తో గడువు ముగియనుండడంతో కొత్త ఓటర్ల దరఖాస్తుల సంఖ్య అమాంతం పెరిగింది. ఇసి అధికారిక సమాచారం ప్రకారం.. కొత్త ఓటర్లను చేర్చుకోవడానికి 8,51,788 మంది ఫారం 6 సమర్పించారని తెలిపింది. ఆగస్టు 26-28 కేవలం ఈ రెండు రోజుల్లోనే 4.18 లక్షలకుపైగా ఫారం 6 అందాయి. అంటే 48 గంటల్లోనే కొత్త ఓటర్ల సంఖ్య 96.6 శాతం పెరిగింది. కాగా, ఆగస్టు 21 నాటికి ఎస్‌ఐఆర్‌పై ఓటర్ల నుంచి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. అదే ఆగస్టు 22 నాటికి ట్రెండ్ మారింది. ఇసికి 84,305 క్లెయిమ్‌లు అందాయి. ఇక ఆగస్టు 23కి 99,656, ఆగస్టు 24కి 1,21,143, ఆగస్టు 25: 1,40,931, ఆగస్టు 26: 1,62,453, ఆగస్టు27: 1,78,948, ఆగస్టు 28: 1,95,802కి పెరిగింది.

### 8.5 లక్షలు దాటిన కొత్త ఓటర్ల ఫారాలు

ఎస్‌ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటర్లు చేరిక రోజురోజుకీ పెరిగింది. రోజులవారీగా పరిశీలిస్తే.. ఆగస్టు 22 నాటికి 2,63,257 ఇసి 6 ఫారంలు అందుకుంది. ఇక ఆగస్టు 23 నాటికి 2,83,042కి పెరిగింది. ఆగస్టు 24కి 3,28,847, ఆగస్టు 25కి 3,79,692, ఆగస్టు 26కి 4,33,214కి పెరిగింది. ఇక 27, 28 తేదీల్లో వీటి సంఖ్య రెండింతలు పెరిగింది. ఆగస్టు 27వ తేదీ 6,35,124, ఆగస్టు 28వ తేదీ 8,51,788 కి చేరింది. ఈ ఫారాలు 18 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు గల వ్యక్తుల నుంచే వచ్చాయి. బూత్ లెవల్ ఏజెంట్ల ద్వారా స్వీకరించిన ఫారాలు తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి. మొత్తం 8,51,788 ఫారాలలో ఆగస్టు 28 నాటికి 37,050 మాత్రమే ప్రాసెస్ అయ్యాయి.

# 'ఓటు చోరీ'.. రాష్ట్రాల వివరాలు



- ఎం.వి.ఎ.షరీఫ్

**"ఓటు చోరీ" (ఓటు దొంగతనం) సమస్య భారత దేశంలో ఒక ముఖ్యమైన రాజకీయ వివాదం, ఇది ప్రధానంగా భారత జాతీయ కాంగ్రెస్ (INC) మరియు దాని నాయకులు, రాహుల్ గాంధీ వంటి వారు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మరియు ఎన్నికల సంఘం(ఈసీఐ)పై ఓటరు జాబితాలను మార్పు చేసి ఎన్నికలను రిగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలు 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రముఖంగా ఉద్భవిం చాయి. మరియు కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి అనేక రాష్ట్రాలకు విస్తరించాయి. ఈ సమస్య గురించి రాష్ట్రాల వారీగా వివరణాత్మక సమాచారం ఇక్కడ ఉంది.**

### 1.కర్ణాటక

**ఆరోపణలు :** 'ఓటు చోరీ' వివాదం రాహుల్‌గాంధీ బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 2024 ఎన్నికల సందర్భంగా లక్షకు పైగా ఓట్లు 'దొంగిలించబడ్డాయి' అని ఆరోపించడంతో ఊపందుకుంది. ఈ మార్పిడి ఐదు రకాలుగా జరిగిందని ఆయన ఆరోపించారు.

- 11,965 డూప్లికేట్ ఓటర్లు.
- 40,009 ఓటర్లు నకిలీ లేదా చెల్లని చిరునామాలతో (ఉదాహరణకు, 10 అడుగుల ఎత్తైన భవనంలో 80 మంది ఓటర్లు నమోదు).
- 10,452 బల్క్ ఓటర్లు ఒకే చిరునామా వద్ద.
- 4,132 ఓటర్లు చెల్లని ఫోటోలతో.
- 33,692 ఓటర్లు ఫారం 6ని దుర్వినియోగం చేస్తూ కొత్త ఓటరు నమోదు కోసం, 90 ఏళ్లు పైబడిన వారిని చేర్చారు.
- ఈ మార్పిడి వల్ల కాంగ్రెస్ బెంగళూరు సెంట్రల్ సీటును 1,14,000 ఓట్ల తేడాతో బీజేపీకి కోల్పోయిందని, ఆరు ఇతర సెగ్మెంట్లలో గెలిచినప్పటికీ అని గాంధీ ఆరోపించారు. పోలింగ్ బూత్‌ల నుంచి CCTV ఫుటేజ్ తొలగించబడిందని, పారదర్శకతను దెబ్బ తీసిందని ఆరోపించారు.
- కర్ణాటక డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్ బెంగళూరులో ర్యాలీ తర్వాత ఓటరు మోసం ఫిర్యాదు దాఖలు చేశారు.

**ఈసీఐ స్పందన :** ఈ ఆరోపణలను "ఆధారరహితం" అని ECI తిరస్కరించింది, రాహుల్‌గాంధీని తన ఆరోపణలను రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 యొక్క రూల్ 20(3)(ఎ) కింద సంతకం చేసిన అఫిడవిట్ సమర్పించమని లేదా పబ్లిక్ క్షమాపణ జారీ చేయమని డిమాండ్ చేసింది. ఈ ఆరోపణలను "తప్పుడు మరియు తప్పుదారి" అని పేర్కొన్నారు మరియు ఓటరు జాబితాలు పీడీఎఫ్ ఫార్మాట్‌లో అందుబాటులో ఉన్నాయని, కానీ గోప్యతా ఆందోళనల కారణంగా మెషిన్-రీడబుల్ ఫార్మ్‌లో ఆపివేయబడ్డాయని తెలిపారు.

షకునిదేవి(70 ఏళ్ల మహిళ రెండుసార్లు నమోదైనట్లు ఆరోపణ) వంటి నిర్దిష్ట కేసులను ఈసీఐ విచారించి, ఆమె ఒక్కసారి మాత్రమే ఓటు వేసినట్లు స్పష్టం చేసింది.

**కాంగ్రెస్ ప్రచారం :** కాంగ్రెస్ ఆగస్టు 10, 2025న "ఓటు చోరీ" ప్రచారాన్ని ప్రారంభించింది, డిజిటల్ ఓటరు జాబితాలు మరియు ఈసీఐ జవాబుదారీతనం కోసం పబ్లిక్ సపోర్ట్ సేకరించడానికి votechori.in వెబ్‌సైట్‌ను లాంచ్ చేసింది. కర్ణాటకలో లక్షకు పైగా నకిలీ ఓటర్లు బీజేపీకి సీటు గెలవడానికి సహాయపడ్డారని పేర్కొంది. ఆగస్టు 8, 2025న బెంగళూరులో మల్లికార్జున్ ఖర్గే, సిద్ధరామయ్య, రణదీప్ సింగ్ సుర్జేవాలా నేతృత్వంలో "ఓటు అధికార్ ర్యాలీ" నిర్వహించారు.

**BJP కౌంటర్ :** BJP నాయకులు, అమిత్ మాల్వియా సహా, కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు 2024లో 35 ఏళ్లలో అత్యధిక ఓటు షేర్ (41% vs 1989లో 39%) సాధించాయని, ఓటు చోరీ జరిగి ఉంటే కాంగ్రెస్ ఎలా బాగా ప్రదర్శన చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఈసీఐ విశ్వసనీయత ను దెబ్బ తీసేందుకు నకిలీ ఆరోపణలు చేస్తోందని ఆరోపించారు.

### 2. బీహార్

**ఆరోపణలు :** కాంగ్రెస్ మరియు దాని INDIA బ్లాక్ మిత్ర పక్షాలు, రాష్ట్రీయ జనతాదళ్(RJD)తో సహా, 2025

**అసెంబ్లీ ఎన్నికల ముందు బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(SIR) సమయంలో ఓటరు జాబితా మోసం జరిగిందని ఆరోపించాయి. బీజేపీ, ఈసీఐ సహకారంతో, అర్హత ఉన్న ఓటర్లను(ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు, మైనారిటీ లు, పేదలు) తొలగించి, నకిలీ ఓటర్లను చేర్చిందని ఆరోపించారు.**

- **నిర్దిష్ట కేసులు :** అరారియాలో, 28 ఏళ్ల చందన్ పాస్వాన్‌ను ఓటరు జాబితాలో "మరణించిన వారు"గా పేర్కొన్నారు.
- ముజఫర్‌పూర్‌లో ఒకే చిరునామా వద్ద 269 ఓటర్లు, జమయిలో 247 ఓటర్లు నమోదైనట్లు ఆరోపణ.
- రాహుల్‌గాంధీ ఆగస్టు 13, 2025న బీహార్‌లో ఏడుగురు ఓటర్లను కలిశారు. ఓటరు జాబితాలో వారిని మరణించిన వారిగా పేర్కొన్నారు.
- RJD నాయకులు లాలూప్రసాద్ మరియు తేజస్వి యాదవ్ బీజేపీ ఓటింగ్ హక్కులను దొంగిలించడం ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తోందని ఆరోపించారు.
- కాంగ్రెస్ ఆగస్టు 17, 2025 నుంచి ససారామ్ నుంచి 16 రోజుల "ఓటర్ అధికార్ యాత్ర"ను ప్రారంభించింది, 20 జిల్లాలలో 1,300 కిలోమీటర్లు కవర్ చేసి, సెప్టెంబరు 1న పాట్నాలో భారీ ర్యాలీతో ముగిసింది.

**ECI స్పందన :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఈ ఆరోపణలను "ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ప్రచారం" అని పిలిచారు. ఈసీఐ బీహార్ యొక్క డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్ నుంచి 65 లక్షల తొలగించిన ఓటర్ల జాబితాను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లా మేజిస్ట్రేట్ వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేసింది.

SIR ప్రక్రియ 2003లో ఇంటింటి సర్వేను కలిగి ఉంది. కానీ 2025లో ఓటర్లు బూత్ లెవల్ ఆఫీసర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించాల్సి ఉంది. ఇది ఓటర్లను తొలగించడానికి దారి తీసిందని విపక్షాలు ఆరోపించాయి.

**కాంగ్రెస్ మరియు INDIA బ్లాక్ చర్యలు :** ఆగస్టు 11, 2025న, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్‌తో సహా దాదాపు 300 విపక్ష ఎంపీలు SIR అక్రమాలు మరియు ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో పార్లమెంట్ నుంచి ECI కార్యాలయానికి మార్చ్ చేశారు. వారిని పోలీసులు అడ్డుకుని, కొద్దిసేపు నిర్బంధించారు. కాంగ్రెస్ సెప్టెంబర్ 1, 2025 నుంచి బీహార్‌లో "మతదాత అధికార్ యాత్ర"ను ప్లాన్ చేసింది.

**BJP కౌంటర్ :** "అక్రమ చొరబాటుదారులను" కాపాడుతున్నారని విపక్ష నాయకులపై బీజేపీ ఆరోపణలు చేసింది. SIR ఓటరు జాబితాలను శుభ్రపరచడానికి అవసరమని పేర్కొంది.

### 3. మహారాష్ట్ర

**ఆరోపణలు : కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికలకు నాలుగు నెలల ముందు మహారాష్ట్రలో కోటి ఓటర్ల "మాయమైన" పెరుగుదల జరిగిందని ఆరోపించింది, ఇది బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమికి అధికారం సాధించడానికి సహాయపడిందని పేర్కొంది. ఆగస్టు 23, 2025న, కాంగ్రెస్ మహారాష్ట్రలో 85,000 నకిలీ ఓట్లను బయటపెట్టినట్లు పేర్కొంది. ECI మరియు బీజేపీ కర్ణాటక మాదిరిగానే మహారాష్ట్రలో ఎన్నికలను రిగ్ చేశాయని రాహుల్‌గాంధీ ఆరోపించారు.**

**ECI స్పందన :** మహారాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ రాహుల్ గాంధీకి నోటీసు జారీ చేసి, ఓటరు చేర్పు/తొలగింపు మోసం ఆరోపణలకు మద్దతుగా 10 రోజుల్లో ఫార్మల్ డిక్లరేషన్ సమర్పించమని డిమాండ్ చేసింది. ECI ఓటరు జాబితాలు పారదర్శకంగా ఉన్నాయని, PDF వెర్షన్లు అందుబాటులో ఉన్నాయని, పెద్ద ఎత్తున మార్పిడి జరిగిందని నిరాకరించింది.

**BJP కౌంటర్ :** బీజేపీ విపక్ష ఆరోపణలను ఆధారరహితంగా పేర్కొంది, 2024లో కాంగ్రెస్ ఓటు షేర్ మెరుగైనందున ఓటు చోరీ జరగలేదని వాదించింది. కాంగ్రెస్ ECI విశ్వసనీయతను దెబ్బ తీసేందుకు తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించింది.

### 4. తెలంగాణ

**ఆరోపణలు :**

తెలంగాణ సీఎం ఎ.రేవంత్‌రెడ్డి మరియు TPCC అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ బీజేపీ 2024 లోక్‌సభ ఎన్నికలలో 17 సీట్లలో 8 సీట్లను గెలవడానికి ఓటరు జాబితాలను మార్పు చేసిందని ఆరోపించారు. చొప్పదండి నియోజకవర్గంలో ఒకే టిన్-షెడ్ ఇంటి వద్ద 40 నకిలీ ఓటర్లు నమోదైనట్లు ఉదహరించారు. తెలంగాణ బీహార్, మహారాష్ట్రల మాదిరిగానే ఈ కుట్రకు బాధితమైందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బీజేపీ నాయకురాలు మాధవిలత కాంగ్రెస్, BRS, AIMIM లు పాకిస్తానీ పౌరులను నకిలీ పత్రాలతో ఓటు వేయడానికి అనుమతించాయని ఆరోపించి, CBI విచారణ డిమాండ్ చేశారు.

ECI స్పందన : ECI ఈ ఆరోపణలను తిరస్కరించింది, ఓటరు జాబితాల సమగ్రత మరియు ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను నొక్కిచెప్పింది.

**కాంగ్రెస్ చర్యలు:** తెలంగాణలో కాంగ్రెస్ రాష్ట్ర-స్థాయి ఆందోళనను ప్రకటించింది. ఇందులో "జనహిత పాదయాత్ర" ఉంది. ఓటు చోరీ మరియు ఢిల్లీలో INDIA బ్లాక్ నాయకుల

అరెస్టులను నిరసిస్తూ ఈ ప్రచారం ఓటు చోరీని 42% BC కోటా అమలులో ఆలస్యంతో లింక్ చేసింది. G.కిషన్‌రెడ్డి వంటి బీజేపీ నాయకులు అడ్డుకున్నారని ఆరోపించింది.

**BJP మరియు BRS కౌంటర్ :** బీజేపీ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల (కాంగ్రెస్ 65 సీట్లు గెలిచింది) మరియు 2024 లోక్‌సభ ఎన్నికల మధ్య ఓటరు జాబితాలలో స్వల్ప మార్పులను హైలైట్ చేసింది. కాంగ్రెస్ ఆరోపణలను ప్రశ్నించింది. బీఆర్ఎస్ నాయకుడు కె.టి.రామారావు కాంగ్రెస్ 2023 ఎన్నికలను తప్పుడు హామీల ద్వారా గెలిచిందని, దానిని 'ఓటు చోరీ'గా అభివర్ణించారు.

### 5. కేరళ :

ది న్యూస్ మినిట్ (ఆగస్టు 15, 2025) దర్యాప్తులు త్రిస్సూర్ లో డూప్లికేట్ EPIC IDలు మరియు నకిలీ ఓటర్ల సమస్యలను బయటపెట్టాయి. ఉదాహరణకు, బైరప్ప లే అవుట్‌లో రిలయన్స్ ఫ్రెష్ వంటి వాణిజ్య భవనంలో ముగ్గురు "సయ్యద్ సలాహుద్దీన్" ఓటర్లు నమోదైనట్లు, అక్కడ నివాసితులు లేరని మేనేజర్ ధృవీకరించారు. ఈ ఆధారాలు కాంగ్రెస్ యొక్క ఓటరు జాబితా అసాధారణతల ఆరోపణలను సమర్థించాయి.

### 6. ఉత్తరప్రదేశ్ :

ది రిపోర్టర్స్ కలెక్టివ్ ఉత్తరప్రదేశ్‌లో నమోదైన కనీసం 5,000 ఓటర్లు బీహార్‌లో కూడా నమోదైనట్లు కనుగొంది. రాష్ట్రాల మధ్య డూప్లికేషన్‌ను సూచిస్తుంది. విస్తృత సందర్భం మరియు రాజకీయ స్పందనలు

**కాంగ్రెస్ జాతీయ ప్రచారం :** కాంగ్రెస్ ఓటు చోరీకి వ్యతిరేకంగా బహుముఖ ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో వెబ్‌సైట్ (votechori.in ) ఆగస్టు 10, 2025న లాంచ్ చేయబడింది, ఓటర్లు "ఓటు చోరీ ఆధారాలు" డౌన్‌లోడ్ చేయడానికి, మోసాన్ని రిపోర్ట్ చేయడానికి, మల్లికార్జున్ ఖర్గే, కె.సి. వేణుగోపాల్, అజయ్ మాకెన్ సంతకం చేసిన డిజిటల్ సర్టిఫికేట్లను పొందడానికి అనుమతిస్తుంది.

**సోషల్ మీడియా ప్రచారం :** ఆగస్టు 15, 2025న "ఓటు చోరీ సే ఆజాదీ" ప్రచారం, సోషల్ మీడియా డిస్‌ప్లే పిక్చర్‌లను మార్చమని ప్రజలను కోరింది.

**నిరసనలు :** ఆగస్టు 14, 2025న జాతీయ "లోక్‌తంత్ర బచావో మశాల్ మార్చ్‌లు", ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7 వరకు రాష్ట్ర-స్థాయి "ఓటు చోర్, గద్దీ చోర్" ర్యాలీలు, సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు ఐదు కోట్ల సంతకాలను సేకరించే సంతకం ప్రచారం. కాంగ్రెస్ కనీసం 48-70 లోక్‌సభ సీట్లను ఈ అక్రమాల వల్ల కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**ECI రక్షణ :** ECI ఆరోపణలను ఆధారరహితంగా పిలిచింది, ఫారం 17C, VVPAT స్లిప్‌లు, ఓపెన్ కౌంటింగ్ వంటి రక్షణలను నొక్కిచెప్పింది. "ఓటు చోరీ" అనే పదాన్ని భారతీయ ఓటర్లు మరియు ఎన్నికల సిబ్బందిని అవమానించే "మురికి పదం"గా పేర్కొంది. ఓటరు జాబితాలు నియమితంగా అప్‌డేట్ అవుతాయని, బీహార్‌లో SIR పాత ఎంట్రీలను శుభ్రపరచడానికి ఉద్దేశించినదని, ఓటర్లను తొలగించడానికి కాదని ECI పేర్కొంది.

**బీజేపీ కౌంటర్-నరేటివ్ :** బీజేపీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, అఖిలేష్ యాదవ్, అభిషేక్ బెనర్జీ వంటి విపక్ష నాయకులు రాయ్ బరేలీ, వాయనాడ్, కన్నౌజ్, డైమండ్ హార్బర్ సీట్లను అక్రమ ఓటరు నమోదుల ద్వారా గెలిచారని ఆరోపించి, వారి రాజీనామాలను డిమాండ్ చేసింది. అనురాగ్ ఠాకూర్ వంటి నాయకులు విపక్ష నిరసనలు "అక్రమ చొరబాటుదారులను" కాపాడే వ్యూహమని, జాతీయ భద్రతను దెబ్బ తీస్తున్నాయని ఆరోపించారు.

**పబ్లిక్ మరియు మీడియా సెంటిమెంట్ :** Xలో పోస్ట్‌లు ధ్రువీకరణ దృక్పథాలను ప్రతిబింబిస్తాయి. @ECISVEEP వంటి కొందరు ECI యొక్క ఫ్యాక్ట్-చెకింగ్ ప్రయత్నాలను సమర్థించారు. INCIndia వంటి ఇతరులు బీహార్‌లో చందన్ పాస్వాన్ కేసు వంటి మోసం ఆరోపణలను ఊపందుకు న్నారు. ది న్యూస్ మినిట్ వంటి మీడియా నివేదికలు ఓటరు జాబితా సమస్యలు కొత్తవి కాదని, కానీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే విస్తృత మోసానికి ఆధారాలు లేవని సూచిస్తున్నాయి.

### ప్రభావం మరియు ఫలితాలు

**రాజకీయ వ్యూహం :** కాంగ్రెస్ మరియు INDIA బ్లాక్ 2025లో బీహార్ ఎన్నికల వంటి ముఖ్య రాష్ట్ర ఎన్నికల ముందు ఓటర్లను, ముఖ్యంగా ఫ్లోటింగ్ ఓటర్లను (దళితులు, OBCలు, పట్టణ పేదలు) సమీకరించడానికి ఓటు చోరీ నరేటివ్‌ను ఉపయోగిస్తున్నాయి. బీజేపీ యొక్క కోర్‌బేస్ స్థిరంగా ఉన్నప్పటికీ, స్వింగ్ ఓటర్లలో స్వల్ప మార్పులు గట్టి పోటీ సీట్లను ప్రభావితం చేయవచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు.

**చారిత్రక సందర్భం :** 2019లో EVM తారుమారు వంటి ఇలాంటి ఆరోపణలు ఆధారాలు లేకపోవడం వల్ల బీజేపీ యొక్క ఆధిపత్యాన్ని గణనీయంగా దెబ్బ తీయలేదు. ప్రస్తుత ప్రచారం విజయం కచ్చితమైన ఆధారాలపై ఆధారపడి ఉంటుంది. దీనిని ECI సవాలు చేసింది.

**ECI విశ్వసనీయత :** ఈ వివాదం ECIని స్క్రూటినీ కింద ఉంచింది. విపక్ష పార్టీలు దాని స్వాతంత్ర్యాన్ని ప్రశ్నిస్తున్నాయి, అయితే బీజేపీ మరియు ECI దాని విశ్వసనీయతను భారత ఎన్నికల వ్యవస్థ యొక్క మూలస్తంభంగా రక్షిస్తున్నాయి. ❑

# అమృతకాలంలో మర్యాదలన్నీ బలాదూర్ !



- కె.శ్రీనివాస్

**భేషజాలు అనుకోండి, పద్ధతులు అనుకోండి, లేదా నాగరికత అనుకోండి. లోకంలో కొన్ని మర్యాదలు వుంటాయి. ఆంతరంగిక వ్యవహారానికి, బాహ్య వ్యవహారానికి నడుమ మేలిమి తెర ఉంటుంది. జైత్రయాత్రలు చేసి జగజ్జెట్టీ అయిన చక్రవర్తులు కూడా రాచగుంపులో ఉన్నప్పుడు, వినయ గంభీరంగా ఉండడమే రీవి అవుతుంది. కానీ, ఒక్కొక్కప్పుడు, జనాన్ని మూకగా మార్చి, ఉద్వేగాలను ఆవేశాలుగా మలచి, ద్వేషాగ్ని మీద సవారీ చేసుకుంటూ సింహాసనాలను ఎక్కేవారు, అన్ని మర్యాదలనూ రద్దు చేసి, కేవలం కార్పణ్యపు భాషే మాట్లాడతారు.**

డొనాల్డ్ ట్రంప్‌ను చూడండి. అతను మృదువుగా మాట్లాడినా అందులో మదమాత్సర్యాలే ధ్వనిస్తాయి. ఇక కఠినంగా మాట్లాడినప్పుడు, అచ్చుపోసి వదిలిన మహా వృషభపు వీరంగం లాగా ఉంటుంది. మొన్నటి దాకా ట్రంప్‌తో ప్రయాణించిన మద్దతుదారుడు, సుంకాల యుద్ధం విషయంలో మరోమాట చెప్పేసరికి, అతని ఇంటి మీద ఎఫ్‌బీఐ దాడి జరిగింది. నరేంద్రమోదీని చూసి, ట్రంప్ నేర్చుకుంటున్నారా? అయితే గనుక, ఇండియాకు అతనే రాయల్టీ కట్టాలి.

చెప్పినట్టు విను, లేకపోతే, సుంకాలు డబుల్ చేస్తాను. వాడి దగ్గర కొను, వీడి దగ్గర కొనవద్దు, ఆ కూటమి నుంచి వచ్చేయ్ - అని ట్రంప్ ప్రపంచవేదిక మీద అందరినీ గదమాయిస్తున్నారు. గతంలో అగ్రరాజ్యాల ఒత్తిడులు లేవా అంటే చాలా ఉన్నాయి. క్రూరంగా ఘోరంగా ఉన్నాయి. కానీ, అప్పుడు, ఈ బెదిరింపులు మెత్తగా, నర్మగర్భంగా తెరవెనుక జరిగేవి. బక్కదేశాలు అర్థం చేసుకుని, చాలా ఒప్పుకుని, కొన్ని ఒప్పుకోకుండా, ఎట్లాగో దౌత్యం నడిపేవారు. ఆ దేశాన్ని కలిపేసుకుంటా, గాజాను ఖాళీ చేయించి రిసార్టులు కట్టిస్తా వంటి 'ట్రంపరి' మాటలు గత అగ్రరాజ్యాధినేతల అహంకారపు స్థాయికి మించినవి. నెతన్యాహూ ఇప్పుడిలా మాట్లాడుతున్నాడంటే, తన వెనుక అమెరికా ఉన్నదన్న ధీమా మాత్రమే కాదు. సిగ్గులన్నిటినీ వదిలేసిన బలాదూర్‌తనం కూడా అందుకు కారణం. లోకంలో కుడివాదపు విజృంభణ సాగుతున్నప్పుడు, పాత మర్యాదలన్నిటినీ తొక్కివేయడమే వారి విప్లవం మరి !

భారత రాజ్యాంగానికి 130వ సవరణగా ప్రవేశపెట్టిన బిల్లు, మొరటు బేఖాతరుతనం నుంచి మాత్రమే రూపుదిద్దుకుంది. జైల్లో నెల రోజులు ఉండి కూడా పదవిలో ఉంటే, నైతికత ఏమి కావాలి ? రాజ్యాంగ నైతికత ఏమి కావాలి? - అని ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి ఆవేదన చెందుతున్నారు. వాళ్లు అట్లా క్షోభ పడడం విడ్డూరంగా అనిపిస్తే అది మన తప్పు కాదు. ఏ ముఖ్యమంత్రిని అయినా, రాష్ట్ర మంత్రులనయినా నెల రోజులు జైలులో ఉంచగల శక్తి కేంద్ర ప్రభుత్వానికి, దాని ఆధ్వర్యంలోని దర్యాప్తు సంస్థలకు ఉన్నదని గత పదేళ్ల చరిత్ర చెబుతున్నది. అట్లా జైలులో ఉండవలసి వచ్చిన వారంతా ప్రతి పక్షీయులేనన్నది చరిత్రే. ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను వేధించడానికే ఈ సవరణ అని ఆగ్రహంగా ప్రశ్నిస్తే, ప్రధానమంత్రిని దీని పరిధిలోకి తెచ్చాము కదా అని అమాయకంగా, అతివినయంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు సమాధానమిస్తున్నారు. అయ్యో పనేనా? ఏ ప్రధానమంత్రినైనా నెల రోజులు జైలులో పెట్టగలిగే ప్రాసిక్యూషన్ సంస్థ దేశంలో ఏదైనా ఉన్నదా? అందులోనూ బీజేపీ ప్రధానిని ఆమడదూరం నుంచి అయినా స్పృశించగలిగే అవకాశం, ఆస్కారం ఏ దర్యాప్తు సంస్థకైనా ఉన్నదా?

అది అంతా ఉట్టి మాట. ప్రధానిని బిల్లులో చేర్చడం ఒక ప్రహసనం అయితే, మొత్తంగా బిల్లే ఒక మహానాటకం. ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల సమ్మతి కావలసి వచ్చే ఇటువంటి సవరణ బిల్లు ఆమోదం పొందేదెట్లా? చంద్రబాబు, నితీశ్‌కుమార్‌లు ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేంతగా దిగజారారా? ఒకవేళ దిగజారితే మాత్రం ఆ బలం ఏ మూలకు ? మేం సత్యకాలం తిరిగి తెద్దామని అనుకుంటే, ఈ కలికాలం ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయని చెప్పుకోవడానికి తప్ప, ఈ ఉదంతం ఎందుకూ ఉపయోగపడదు.

పొరపాటు. ఎంతో కొంత ఉపయోగపడుతుంది. పడుతోంది కూడా. ఓటు చోరీ గురించి రాహుల్ గాంధీ చెప్తున్న మాటలను వినే వారు, చేస్తున్న యాగీని అభినందిస్తున్న వారూ పెరిగిపోతున్న సమయంలో, జనాన్ని ఏ మార్చడానికి ఒక మారీచ పాత్ర అవసరం. 'హా రాజ్యాంగ నీతీ, హా రాజ్యాంగ విలువలూ!' అన్న హాహాకారాలు విని ప్రజలు, ఓటు దొంగతనం


మీది నుంచి మనసు మళ్లించుకోవాలన్నది ఎత్తుగడ. ఏలిన వారి మనసులో మాటను గ్రహించి, పతాక శీర్షికల్లో అలంకరించ దానికి, అదే పనిగా డిబేట్లు నడపడానికి గోదీ మీడియా ఉండనే ఉంది.

ఆశ్చర్యమేమిటంటే, సామాన్యులకు ఇదంతా అర్థమవుతోంది. అర్థమయ్యేంత నిస్సిగ్గుగా పరిణామాలు నడుస్తున్నాయి. ఈ బరితెగింపు కేవలం దౌర్జన్య ప్రదర్శన మాత్రమే కాదు. సభ్యతలకు తమ దగ్గర పాటింపు, చెల్లుబాటు లేదన్న ధూర్త ప్రకటన కూడా. రాహుల్ గాంధీ విసిరిన సవాళ్లకు కేంద్ర ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన స్పందనలు కానీ, తానూ ఆ తానులోని ముక్కనే అన్నట్టుగా ఎన్నికల సంఘం విసిరిన నోటీసులు, బెదిరింపులు కానీ, తెలివి తక్కువ తనాన్ని, అంతకు మించిన అధికార అహంకారాన్ని సూచిస్తున్నాయి.

> **ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ బి. సుదర్శనరెడ్డిని సమర్థిస్తున్నట్టు ఇండియా కూటమి ప్రకటించింది. రాజ్యాంగ విలువలకు ప్రమాదం ఏర్పడిన స్థితిలో సుదర్శనరెడ్డి అభ్యర్థిత్వం ఒక సంకేతాత్మక ప్రతిఘటనగా ఉంటుందని, సైద్ధాంతిక పోరాటానికి ఆస్కారం ఇస్తుందని ఇండియా కూటమి భావించింది. న్యాయవ్యవస్థలో ఆయన సుదీర్ఘంగా నిర్వర్తించిన కర్తవ్యాలు ఎన్నిక వాతావరణాన్ని గంభీరంగా మార్చాయి. ఒక విషయం గంభీరంగా, గౌరవంగా ఉంటే మనకు నచ్చదు కదా. దాన్ని వెంటనే తమ స్థాయికి తెచ్చి అప్పుడు పోటీ పడాలి కదా. గౌరవనీయ హోం మంత్రి అమిత్ షా అదే చేశారు. సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఇచ్చిన ఒక తీర్పును ప్రస్తావించి ఆయనను నక్సల్ సమర్థకుడిగా చిత్రించారు.**

హమీద్ అన్సారీ కాలం నుంచి ఉప రాష్ట్రపతి పదవిని ప్రభుత్వ పెద్దలు కించపరచడం మొదలయింది. వెంకయ్యనాయుడికి గౌరవంగానే పదవి అందించారు కానీ, దాని వెనుక ఉద్దేశ్యాలు ఏమిటో అందరూ మాట్లాడుకున్నవే. ధన్‌కడ్‌ను ఎంత అగౌరవంగా, అన్యాయంగా సాగనంపారో మొన్న చూశాము. ఇప్పుడు ఎన్నిక స్థాయిలోనే ఆ పదవికి ఉండవలసిన గౌరవాన్ని మలినపరచాలని ప్రయత్నిస్తున్నారు. ఇంత వరకు, ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా చరిత్రలో ఇంతటి దిగజారుడు ఆరోపణ వినపడలేదు. ఇందులో కొత్త మైలురాళ్లు స్థాపిస్తున్నారు !

తీర్పును విమర్శించవచ్చును కానీ, న్యాయమూర్తులకు




ఉద్దేశ్యాలు ఆపాదించకూడదని అంటారు. ఆ లెక్కన అమిత్ షా వ్యాఖ్య కోర్టు ధిక్కార వివాదానికి తగినది. న్యాయమూర్తులను వారు ఇచ్చే తీర్పుల ఆధారంగా అంచనా వేస్తారా ? ముద్దాయిలను నిర్దోషులుగా తీర్పు చెబుతున్న ప్రతి న్యాయమూర్తీ, ఆ ముద్దాయి మీద మోపిన నేరానికి సమర్థకుడే కావాలి. జవాబుదారీతనం లేని 'సల్వాజుడుం' అన్న ప్రైవేటు సైన్యాన్ని ప్రభుత్వమే నడపడం రాజ్యాంగ విరుద్ధం కాబట్టి సుదర్శనరెడ్డి ఆ తీర్పు ఇచ్చారు. అత్యున్నతస్థాయి కోర్టు న్యాయమూర్తి తన విధిని నెరవేర్చినందుకు, హోం మంత్రివై ఉండీ ఒక నేరారోపణ చేస్తావా? అత్యంత అధిక అక్షరాస్యత, రాజకీయ పాఠకత్వం కలిగిన కేరళలో, అదీ, ఒక పత్రికా సంస్థ వేదిక మీద అటువంటి మాటలు ఎట్లా నిస్సంకోచంగా అనగలుగుతారు? ఎదుట కూర్చున్న పత్రికా రచయితలు, టీవీలలో, మొబైళ్లలో చూస్తున్న వీక్షకులు, ప్రపంచవ్యాప్తంగా పాఠకులు, తన గురించి ఏమనుకుంటారోనన్న సంఘ భీతి ఎందుకు లేకపోయింది ? ఏ మాదక అధికారం అటువంటి మైమరపును ఇస్తుంది ? వినయం వల్ల గౌరవం లభిస్తుందని 'సనాతన' ధర్మం చెబుతుంది. గౌరవా గౌరవాల మధ్య తేడా తెలియని వారు ఏదో స్థాయిలో సమతూకం కోల్పోయే వారే అయి ఉంటారు. వాచాలత్వం దానంతట అది ఒక జబ్బు కాదు. వేరే పెద్ద జబ్బుకు అది వ్యాధి లక్షణం మాత్రమే. ❑

**(ప్రజాతంత్ర సౌజన్యంతో)**

# నాకు తెలిసిన సురవరం సుధాకరరెడ్డి



- ఆర్వీ రామారావ్



తేదీలు, సంవత్సరాలు సరిగ్గా గుర్తు లేదు కానీ అది 1970ల తొలి సంవత్సరాలు కావొచ్చు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో అభ్యుదయ రచయితల సంఘం, యువజన సమాఖ్య కార్యాలయాలు పక్కపక్కనే ఉండేవి. ప్రసిద్ధ రచయితలతోపాటు అనేకమంది వర్ధమాన రచయితలు సాయంత్రానికి అక్కడ పోగయ్యే వారు. అలాంటి ఒకరోజు యువజన సమాఖ్య కార్యాలయంలో కూర్చుని ఉండగా ఒక మోస్తరు పొడవు, దానికి తగ్గ లావు, లేత పసుపురంగు చొక్కా వేసుకున్న ఓ వ్యక్తి ఆ గదిలోకి వచ్చారు. ఆయన సురవరం సుధాకరరెడ్డి అని చెప్పారు. ఆయన అప్పుడే సోవియట్ యూనియన్ నుంచి తిరిగి వచ్చారట. ఆ రూపం నా మనసులో ఇప్పటికీ అలాగే ఉంది. తెలియకుండానే ఆయన మీద గౌరవభావం ఏర్పడింది.

సుధాకర్‌రెడ్డి ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. ఆయన ఉగ్ర రూపంలో ఉన్న సందర్భాలు ఉన్నాయి కాని ఆయన మొహం మీద చెదరని చిరునవ్వు ఉండడమే ఎక్కువగా కనిపించేది. ఆ సమయంలోనే దిల్లీ నుంచి ఎన్.కె.కృష్ణన్ మొదలుకొని అనేక మంది సీపీఐ కేంద్ర నాయకులు హైదరాబాద్ వచ్చే వారు. వారు ఇంగ్లీషులో మాట్లాడేవారు. ఆ ప్రసంగాలను సుధాకరరెడ్డి తెలుగులోకి అనువదించేవారు. అదేదో అద్వితీయమైన కళ అనిపించేది. అలాంటి ఒకానొక సమావేశంలో సుధాకరరెడ్డి అనువాదం విన్న తరవాత నేను, కాచినేని రామారావు మీ సంస్కృత అనువాదం బాగుంది అన్నాం. ఆయన నవ్వుతూ అర్థం కాలేదా అన్నారు. అర్థమైంది అని మేం చెప్పాం. ఆయన తెలుగులోకి అనువదించేటప్పుడు "అప్రతిహతమైన పోరాటం" లాంటి మాటలు వాడేవారు. ఆ మాటలను పట్టుకునే మేం సంస్కృత అనువాదం అన్నామేమో! ఉపన్యాసలను అనువదించడంలో ఆయన దిట్ట.

ఆయన అనువాదసామర్థ్యం విచిత్రమైంది. ఇంగ్లీషులో మాట్లాడే వక్త ఏకబిగిన పది నిముషాలు మాట్లాడితే సుధాకర రెడ్డి అనువాదం సరిగ్గా పది నిముషాలూ సాగేది. ఒకసారి ఖమ్మంలో జరిగిన యువజన సమాఖ్య సమావేశానికి వెళ్లాం. ఆ సభకు కేరళ సీపీఐ నాయకుడు సి.కె.చంద్రప్పన్ రావాల్సింది. సమావేశం ముగిసే దశకు వస్తున్నా చంద్రప్పన్ జాడలేదు. చిరరకు వందన సమర్పణ చేస్తున్న దశలో తల సవరించు కుంటూ అంతగా పొడగరి కాని చంద్రప్పన్ రావడాన్ని గమనించిన వ్యక్తి వందన సమర్పణ చేస్తున్న వ్యక్తి నుంచి మైక్ లాక్కుని కామ్రేడ్ చంద్రప్పన్ జిందాబాద్ అని నినదించారు. చంద్రప్పన్ వస్తున్నారని అర్థం అయిపోయింది. ఆయన నేరుగా వేదిక మీదకు వచ్చారు. ప్రసంగం మొదలు పెట్టారు. ఆయన పది నిముషాల చొప్పున రెండు విడతలు మాట్లాడారు. సుధాకర రెడ్డి సరిగ్గా పదేసి నిముషాలపాటు ఆ ప్రసంగాన్ని అనువదించారు.

కమ్యూనిస్టు నాయకులకు అధ్యయన అలవాటు ఎక్కువ. సుధాకరరెడ్డిలో ఆ లక్షణం కొట్టొచ్చినట్టు కనిపించేది. క్రియా శీల రాజకీయాలలో నుంచి తప్పుకున్న తరవాత ఆయన అధ్యయనంలోనే ఎక్కువ గడిపారు. విశాలాంధ్ర దినపత్రిక నియతంగా చదివేవారు. వారానికో పది రోజులకో నాకు ఫోన్ చేసి మంచి చెడ్డలు చెప్పేవారు. ఇక ఆ నిశిత పాఠకుడు కనిపించరు.

సుధాకరరెడ్డి, విజయలక్ష్మి 50వ పెళ్లి రోజున ఓ పాతిక ముప్పై మందిని పిలిచారు. అందులో నేనూ ఒకడిని. నేను విశాఖపట్నంలో పనిచేస్తున్న రోజులలో ఎప్పుడు ఆ ఊరొచ్చినా తప్పనిసరిగా ఫోన్ చేసేవారు. ఏదో ఓ సమయంలో కలుసుకునే వాళ్లం. అలాంటి ఓ సందర్భంలో హైదరాబాద్ తిరిగొచ్చిన తరవాత విజయతో విశాఖపట్నంలో ఆర్వీ రామారావును కలిశాను అని చెప్పారట. ఆమె వెంటనే వాళ్ల ఇంటికెళ్లావా, శారదను(మా ఆవిడ), పిల్లలను పలకరించావా అని అడిగారట. లేదు అంటే మరి నువ్వు విశాఖపట్నం ఎందుకు వెళ్లినట్టు అని ఆమె నిలదీశారు. ఆయన ఎంపీ అయిన తరవాత తరచుగా కలుసుకోవడం తగ్గింది. ఒకటి రెండుసార్లు ఒక్క సారి ఆర్వీ రామారావ్‌ను ఫోన్ చెయ్యమని చెప్పండి అని కబురుపెట్టారు. నేను చేసేవాడిని. కానీ ఆయన భద్రత కోసం వచ్చిన పోలీసులు ఫోన్ ఎత్తి ఆయన ఫలానా పనిలో ఉన్నారు. మరో పనిలో





హైదరాబాద్‌లో జరిగిన సురవరం సుధాకర్‌రెడ్డి గారి సంస్మరణ సభ.. హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి,

ఉన్నారు అని చెప్పే వారు. అదే సమయంలో ఒకసారి మఖ్దూం భవన్లో కనిపించారు. "ఏం దొరా! ఎన్నాళ్లయింది మాట్లాడి" అన్నారు. తరచుగా నన్ను దొర అనే సంబోధించేవారు. మీ ఫోన్ ఎప్పుడూ మీ దగ్గర ఉండదు. మీ భద్రతా సిబ్బంది మాట్లాడతారు. నేను నా పేరు, ఇతర వివరాలు చెప్పినా అవి మీదాకా చేరుతున్నట్టు లేవు. అయినా మీరు ఈ మధ్య మనుషుల్లో ఉంటేగా అని సహజ ధోరణిలో దెప్పిపొడిచే వాడిని. చిరునవ్వే ఆయన సమాధానం.

మరోసారి నేను వనస్థలిపురంలో ఇల్లు కడుతున్న సమయంలో అటు వేపు వచ్చారు. అప్పటికి ఇల్లు పూర్తి కాలేదు. ఏదీ మీ ఇల్లు చూద్దాం పదండి అన్నారు. అప్పటికే చీకటి పడింది. అయినా వెళ్లి చూపించి వచ్చాను. చూడకపోతే విజయ కోపగిస్తుంది అన్నారు. ఆయనతో, ఆయన భార్యతో ఎన్నాళ్లకు ఒకసారి ఒక సారి కలుస్తున్నాం అన్నదానికన్నా కలిసినప్పుడు మాత్రం అన్యోన్యంగా ఉండేవాళ్లం.

శుక్రవారం రాత్రి ఆయన మరణ వార్త తెల్సింది. నేను వార్త రాసే పని మొదలెడ్దాం అనుకుంటే విజయ ఫోన్ చేసి తెలిసింది గా అన్నారు. తెలిసిన వాళ్లను, సన్నిహితులను ఆప్యాయంగా పలకరించడం వారిద్దరికీ సోకిన అంటువ్యాధి కాబోలు.

ఆయన మొదటిసారి లోకసభ సభ్యుడైనప్పుడు ఎన్నికైన వారి చేత ప్రమాణం చేయించే బాధ్యత ఇంద్రజిత్‌గుప్తా మీద పడింది. పార్లమెంట్ సభ్యుల్లో అప్పటికి ఆయనే సీనియర్. అందువల్ల ప్రోటెం స్పీకర్‌గా ఉన్నారు. సుధాకర్‌రెడ్డి ప్రమాణం చేసి వెళ్లిపోతుంటే ఇంద్రజిత్‌గుప్తా ఆయనను వెనక్కు పిలిచి "ఎన్నికైతే సరిపోదు. మంచి పార్లమెంటేరియన్‌గా నిరూపించు కో" అన్నారు. సుధాకరరెడ్డి ఆ మాటను సుగ్రీవాజ్ఞలా భావించారు. 2022 అక్టోబరులో విజయవాడలో కమ్యూనిస్టు పార్టీ 24వ మహాసభ జరిగింది. ఆయనను విశాలాంధ్ర ఆఫీసుకు తీసుకొచ్చి సుదీర్ఘమైన ఇంటర్వ్యూ చేశాను. అంతకు ముందు కూడా ఓ సారి ఇంటర్వ్యూ చేసినట్టు గుర్తు. కాని సందర్భం ఏమిటో గుర్తుకు రావడం లేదు. ప్రసంగించినా, ముఖాముఖి మాట్లాడినా నింపాదిగా, స్వరం పెంచకుండా మాట్లాడడం సుధాకరరెడ్డి అలవాటు.

రాష్ట్ర విభజనకు ముందు ఓసారి ఇద్దరం సుదీర్ఘంగా చర్చించుకున్నాం. అప్పుడు సీపీఐ రాష్ట్ర విభజనకు అనుకూలం. నేను వ్యతిరేకం. చాలాసేపు మాట్లాడుకున్న తరవాత మీ అభిప్రాయం ఏమైనా కావొచ్చు ఇది పార్టీ వైఖరి అన్నారు. అయినా నేను విభజనను ఎప్పుడూ సమర్థించలేదు.

1992 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో సీపీఐ 15వ జాతీయ మహా సభ జరిగింది. నేను ఇంద్రజిత్‌గుప్తాను ఇంటర్వ్యూ చేయాలను కున్నా. ఆయన ససేమిరా అంగీకరించలేదు. చివరకు సుధాక రరెడ్డి సహాయం తీసుకుని ఇంటర్వ్యూ సంపాదించాను. అయితే ఆ ఇంటర్వ్యూ నేను ప్రచురించలేదు. అది వేరే కథ.

సుధాకరరెడ్డి మొదటిసారి సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనప్పుడు ఫోన్ చేసి అభినందించాను. అందులో విశేషం ఏమీ లేదు. కానీ అభినందించడంతో ఆగలేదు. "సుధాకర రెడ్డి గారూ ఒక్క మాట చెప్తా వినండి అన్నాను. ఆయన చెప్పండి అన్నారు. "మేం 1970ల ఆరంభంలో వామపక్ష రాజకీయాల వేపు వచ్చినప్పుడు మా జీవిత కాలంలో సోషలిజం వస్తుందనే ఆశ ఉండేది. కానీ అది పూర్తి భ్రమ అని తేలిపోయింది. మా తరవాతి తరం, ఆ తరవాతి తరంలో కూడా సోషలిజం వస్తుందన్న ఆశ లేదు. కానీ ఆ దీపం వెలిగేట్టు చూడండి" అన్నాను. రెండు నిముషాల సేపు మౌనం. ఆ తర్వాత తప్పకుండా ప్రయత్నిస్తా రామారావు గారు అన్నారు.


నిరుపేద కుటుంబంలో పుట్టారు లాంటి రొడ్డ కొట్టుడు పరిచయాలు ఆయనకు వర్తించవు. కానీ ఆస్తులు మాత్రం కరిగిపోయాయి. ఆయన పార్టీ కార్యకర్తలకు ఇచ్చే సలహాలు విశిష్టంగా ఉండేవి. "హోటళ్లలో చట్నీ ఎక్కువగా ఇచ్చేటట్టయితే అదే ఎక్కువగా తినండి" అనేవారు. కార్యకర్త ఖాళీ కడుపులను అంచనా వేసే సమర్థుడాయన. ❑

# నికార్సయిన కమ్యూనిజానికి నిలువుటద్దం



- దేవులపల్లి అమర్

1977లో దేశంలో ఎమర్జెన్సీ ఎత్తేసిన కొద్ది మాసాలకు ఒక తెలుగు దినపత్రికలో నిరవధిక సమ్మె జరిగింది. అది కార్మికుల హక్కులు, న్యాయమైన వేతనాలు, సరైన పని పరిస్థితులకు సంబంధించి జరిగిన సమ్మె. కమ్యూనిస్ట్ పార్టీలు ఆ సమ్మెను వ్యతిరేకించకపోయినా మద్దతుగా మాత్రం నిలబడలేదు. అప్పుడప్పుడే జర్నలిజం వృత్తిలోకి వచ్చి కమ్యూనిజం గురించి తెలుసుకుంటున్న నాలాంటి యువకులకు కమ్యూనిస్టుల వైఖరి బాధ కలిగించింది. మేము శిక్షణలో ఉండగా మాకు ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఒక ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు మాకు పదేపదే బోధిస్తూ ఉండేవాడు ఎట్టి పరిస్థితుల్లోనూ కార్మికులకు, మహిళలకు అన్యాయం జరిగే విధంగా మనం వ్యవహరించకూడదు అని. అట్లాంటి ఆయన ఈ సమ్మెలో యాజమాన్యం వైపు నిలబడి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన పనులన్నీ చేశారు. ఆ తరువాత చాలా ఏళ్ళకు ఆయన రాసుకున్న తన ఆత్మకథలో ఆ విషయం తానే రాసుకున్నారు కూడా. సమ్మె కాలంలో యజమాని ఇంటి నుంచి వచ్చిన భోజనం ఆరగించి అక్కడి నుంచి వచ్చిన పరుపులు వేసుకుని పడుకుని ఆఫీస్‌లోనే ఉంటూ పనిచేసి ఎట్లా సమ్మెను విచ్ఛిన్నం చెయ్యడానికి ప్రయత్నించిందీ. అప్పట్లో ఆయనకు భారత కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం కూడా ఉండేది.



సమ్మె చేస్తున్న వాళ్ళం హిమాయత్‌నగర్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫీస్ మక్దూం భవన్‌కు వెళ్లి అక్కడి నాయకులకు ఆయన కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్య పక్షం వహించిన విషయంపై ఫిర్యాదు కూడా చేశాం. కమ్యూనిస్టు భావాలు గల మరొక సంపాదకుడు కూడా సమ్మెకు వ్యతిరేకంగా యజమానిని సమర్థించడంతో ఆయనే అనువదించి ప్రచురించిన ప్రపంచ ప్రఖ్యాతిగా చెందిన కమ్యూనిస్టు నాయకుల కొటేషన్ల పుస్తకంలో నుంచి రోజు సమ్మె శిబిరం దగ్గర ఆ కొటేషన్లు లోపల సమ్మె విచ్ఛిన్నకారులందరికీ వినిపించే విధంగా గట్టిగా అరిచి చదువుతూ ఉండేవాళ్లం.

న్యాయమైన ఈ సమ్మెను కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తున్నారు అనే ఒక ప్రచారం మొదలైంది. కమ్యూనిస్టు నాయకులు ఎవరు శిబిరం దగ్గరికి రాకపోవడం సంఘీభావం తెలుపకపోవడం ఈ ప్రచారానికి మరింత బలాన్ని ఇచ్చింది. ఆ దినపత్రిక యజమాని పూర్వాశ్రమంలో కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యుడిగా ఉండటం కూడా కారణం అనే ప్రచారం కూడా జరిగింది.

అప్పుడు కమ్యూనిస్టు పార్టీ యువజన విభాగం నడుపుతున్న యువజన మాసపత్రిక సంపాదకవర్గంలో సభ్యుడైన మిత్రుడు ఎస్.నర్సింగ్‌రావు విజయవాడ నుంచి నాకు లేఖ రాశాడు. కమ్యూనిస్టు నాయకులు ఎవరు ఇంత చరిత్రాత్మకమయిన సమ్మెను సమర్థించకపోవడం ఏమిటి అని. దానికి నేను బయట నుంచి కమ్యూనిస్టుల మద్దతు లేకపోగా ఆ పత్రికలో పని చేస్తున్న కమ్యూనిస్టు నాయకులు ఎట్లా యాజమాన్యానికి కొమ్ము కాస్తున్నారో తెలియజేస్తూ వివరంగా జవాబు రాశాను. రోజులు గడుస్తున్నాయి. సమ్మె కొనసాగుతూనే ఉన్నది. అటు ప్రభుత్వం నుంచి, ప్రతిపక్ష రాజకీయ నాయకుల నుంచి కానీ ఎటువంటి మద్దతు కానీ.. కనీస స్పందన కానీ లేదు. పత్రిక ప్రచురణ ఆగిపోయింది.

మధ్యలో ఒకరోజు ఉదయమే మిత్రుడు నర్సింగ్ ఇద్దరు ముగ్గురు మిత్రులను తీసుకుని సమ్మె శిబిరం వద్దకు వచ్చారు. వారిలో ఒకాయన, వయసు 30 సంవత్సరాలు ఉండొచ్చు చాలా స్నేహంగా మాతో కలిసిపోయారు. మాతో కలిసి నినాదాలు చేశారు. శిబిరంలో చాలాసేపు కూర్చుని మాకందరికీ ధైర్యం చెప్పి, సంఘీభావం తెలిపి, కమ్యూనిస్టు పార్టీ మీతో ఉంటుంది. మీ సమ్మె వెనక నక్సలైట్లు ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. కార్మికుల డిమాండ్లు సహేతుకమైనప్పుడు ఆ సమ్మెను ఎవరు సమర్థించినా తప్పులేదు. మేము మీతో ఉన్నాం అని ఆర్థిక సహాయంగా యువజన సమాఖ్య పేరిట వెయ్యి రూపాయలు చెక్ అందజేసి చాలాసేపు మా శిబిరంలో గడిపి ఉత్సాహాన్ని నింపి వెళ్లారు. 70లలో వెయ్యి రూపాయల సహాయం చిన్నదేమీ కాదు. అప్పటి వరకు ఎందుకు మన న్యాయమైన పోరాటాన్ని ఎవరూ సమర్థించడం లేదు. మనం ఏమన్నా తప్పు చేస్తున్నామా అని మదనపడుతున్న మాలో ఆయన కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఆయనే ఆ తర్వాత కాలంలో

భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగిన సురవరం సుధాకర్‌రెడ్డి. జీవితమంతా కమ్యూనిస్ట్‌గానే గడిపిన సుధాకర్‌రెడ్డి తన సిద్ధాంతాలను వ్యతిరేకించే వారితో కూడా ఎంతో స్నేహంగా ఉండేవారు.

2021లో కరోనా మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన రోజుల్లో ఒకనాడు హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ గారి దగ్గరి నుంచి ఫోన్ వచ్చింది. సుధాకర్ రెడ్డి ఆరోగ్యం బాగాలేదట, నేను రేపు ఉదయం చండీఘడ్ నుంచి వస్తున్నా, నేరుగా ఆయన ఇంటికే వస్తా అక్కడ కలుసుకుందాం అని. రాజకీయంగా, సిద్ధాంతపరంగా వారిద్దరూ పూర్తి విరోధులు. దత్తాత్రేయ గారిది ఆర్ఎస్ఎస్ భావజాలం, సుధాకర్ రెడ్డి నిఖార్సయిన కమ్యూనిస్ట్. అయినా వారిద్దరూ మంచి మిత్రులు. ఒక్క దత్తాత్రేయ గారితోనే కాదు సుధాకర్‌రెడ్డి మనుషులందరినీ ప్రేమించారు. తను నమ్మిన సిద్ధాంతానికి ఎంత బలంగా కట్టుబడి ఉన్నారో, ఎంత దృఢంగా ఆచరించారో మానవ సంబంధాలను అంతే గౌరవించారు.

ఆ సమ్మె కాలం నుంచి దాదాపు ఈ 50 ఏళ్లలో సుధాకర్‌రెడ్డి నాలాంటి వారందరికీ ప్రేరణగా నిలిచారు. కమ్యూనిస్టులమని చెప్పుకునే కొందరు, ప్రభుత్వ బలగాల సాయంతో 24 రోజుల తరువాత సమ్మెను విచ్చిన్నం చేసి యాజమాన్యం తాత్కాలిక విజయం పొందినా న్యాయ పోరాటం జరిగి దాదాపు 20 ఏళ్ల తర్వాత సుప్రీంకోర్ట్ కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చి నప్పుడు సుధాకర్‌రెడ్డి ఫోన్ చేసి తన సంతోషాన్ని పంచుకు న్నారు. అప్పటికే ఆయన కమ్యూనిస్ట్ పార్టీలో పెద్ద నాయకుడి స్థాయికి ఎదిగి ఉన్నారు. ఆయన చూసిన, స్వయంగా పాల్గొన్న అనేక పోరాటాల ముందు మా విజయం చాలా చిన్నది.

సుధాకర్‌రెడ్డి చాలా సున్నితమయిన మనిషి. ఎవరినీ నొప్పించే వారు కాదు. ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కాలంలోనే అనుకుంటా మరో సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడు చెన్నమనేని రాజేశ్వర్‌రావు పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. నేను ఇదే డేట్ లైన్ హైదరాబాద్ కాలమ్‌లో ప్రజాతంత్ర వార పత్రికలో ఆ వారం రాసిన వ్యాసం కొంచెం పరుషంగా ముగి సింది. పొద్దున్నే సుధాకర్‌రెడ్డి గారి నుంచి ఫోన్ "రాజేశ్వర్‌రావు చాలా సీనియర్ నాయకుడు, ఆయనకేవో వ్యక్తిగత కారణాలు ఉండి వెళ్ళిపోయారు. మా పార్టీ కూడా ఆయన పట్ల అంత కఠినంగా వ్యవహరించలేదే. ఇంత పరుషంగా రాశావేమిటి" అని నొచ్చుకున్నారు.

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అన్న కుమారుడు సుధాకర్‌రెడ్డికి విద్యార్థి దశ నుండే జర్నలిజం పట్ల చాలా ఆసక్తి ఉండేది. డిగ్రీ పూర్తి చేయగానే పార్టీ పత్రిక విశాలాంధ్రలో సబ్ ఎడిటర్‌గా చేరడం కోసం పార్టీ నాయకుడు నీలం రాజశేఖర్‌రెడ్డి గారి సలహా మేరకు విజయవాడ వెళ్లి ఆనాటి సంపాదకులు ఏటుకూరి బలరామమూర్తి గారిని కలిశారు. మరునాడే అక్కడ సబ్ ఎడిటర్‌గా ఉద్యోగంలో చేరాల్సింది. ఈలోగా చక్రవర్తుల రాఘవాచారి ఆయనను న్యాయశాస్త్రం చదివేందుకు ఉస్మానియా యూనివర్సిటీలో చేరడానికి హైదరాబాదు రమ్మని పిలిపించారు. జర్నలిస్ట్ కావాలనుకున్న సుధాకర్‌రెడ్డి పూర్తికాలం కమ్యూనిస్ట్ రాజకీయాలకు అంకితం కావడం, ఆయనను జర్నలిజంలో నుంచి బయటకు తెచ్చిన రాఘవాచారి గారు దేశం గర్వించే సంపాదకుడి స్థాయికి చేరడం ఆసక్తి కలిగించే విషయం.

జర్నలిస్ట్ కావాలన్న కోరికకు తెరపడినా సుధాకర్‌రెడ్డికి జర్నలిజం పట్ల, సాహిత్యం పట్ల ఆసక్తి తగ్గలేదు. ఒకవైపు కమ్యూనిస్టు ఉద్యమంలో వివిధ స్థాయిల్లో క్రియాశీలకంగా పాల్గొంటూనే రాజకీయ కార్యకలాపాల్లో తలమునకలు అవుతూనే రచన వ్యాసంగాన్ని కొనసాగించారు. ఆయన కర్నూలు కళాశాలలో చదువుకున్న రోజుల్లోనే విద్యార్థులను చైతన్యవంతులను చేసేందుకు కోసం ఒక గోడ పత్రిక నడిపారు. ఆ తర్వాత పార్టీ ఆదేశాల మేరకు ఢిల్లీలో యువజన సమాఖ్య నడిపిన యూత్ లైఫ్ అనే ఆంగ్ల పక్ష పత్రికలో పనిచేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడిగా ఆ తర్వాత అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్షుడిగా పనిచేస్తున్న కాలంలో తెలుగు మాసపత్రిక యువజన సంపాదకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. యువజనలో పరోక్షంగానే అయినా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఒక ప్రత్యేకవ్యాసం రాసినందుకు పత్రిక నిషేధానికి కూడా గురైంది. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత ఆనాటి ప్రభుత్వం పార్లమెంట్‌కు సమర్పించిన ఒక శ్వేతపత్రంలో సుధాకర్‌రెడ్డి సంపాదకత్వం వహించిన యువజన కూడా నిషేధానికి గురైన ప్రస్తావన ఉంది. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్ట్ పార్టీ నిర్వహించిన కొత్త బాట వారపత్రికలో వారం వారం ఆయన రాజకీయ వ్యాఖ్యానాలు చేసేవారు. విశాలాంధ్ర దినపత్రికలో సుధాకర్‌రెడ్డి వివిధ అంశాల మీద రాసిన వ్యాసాల సంఖ్యకు లెక్కేలేదు.

బాగా సీనియర్ల చేతుల్లోనే ఉంటూ వచ్చిన కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వం యువత చేతుల్లోకి వచ్చింది సుధాకర్‌రెడ్డి కాలం నుండే. ఉమ్మడి రాష్ట్రంలో రాజమండ్రిలో జరిగిన పార్టీ మహా సభల్లో యూత్ లీడర్‌గా అప్పటికే చాలా మంచి పేరు తెచ్చుకున్న ఆయనను పక్కన పెట్టలేక కొత్తగా సహాయ కార్యదర్శి పదవి సృష్టించి ఆయనను నియమించారు. ప్రవచనాలకు పరిమితం కాకుండా ఆచరణయోధుడు కాబట్టే దేశంలో సురవరం తొక్కని జైలు గడపలేదు. విద్యార్థి, యువజన, పార్టీ నాయకుడిగా ఆయన ముందుండి నడిపిన ఉద్యమాలు అనేకం. వాటి ఫలితంగా గడిపిన జైలు జీవితం తక్కువేమీ కాదు. చిరస్మరణీయమయిన ఆయన జీవితం గ్రంథస్తం అయితే ఎంత బాగుండును. కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అమర్ హై. ❑

# ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు నిర్మాణ స్వరూపాలు



- పి.బి.చారి

**డాక్టర్ బి.ఎస్.మూంజి 1930-31లో ఇటలీ వెళ్లి వెనిటో ముస్సోలినితో కలిసి కొంతకాలం అక్కడ ఉండి ముస్సోలిని యొక్క ఫాసిస్ట్ పార్టీ నిర్మాణం ఎలా ఉంటుంది ? అందులోని వివిధ శాఖలు ఎలా పనిచేస్తాయి ? వాళ్ల శిక్షణ శిబిరాలు ఎలా నిర్వహిస్తారు ? ఫాసిస్టు భావాలు శాఖలలోని సభ్యుల మెదళ్ళలో ఎలా ఎక్కిస్తారు ? ఇలాంటి విషయాలన్నీ తెలుసుకొని వచ్చాడు.**



దాని ప్రాతిపదికగానే మన దేశంలోని ఆర్ఎస్ఎస్ శాఖల నిర్మాణంలో అమలు పరచడం జరిగింది. వీళ్లు 12, 14 ఏళ్ల లేత వయసులో వున్న పిల్లలను వ్యాయామం, ఆట పాటల పేరుతో ఆకర్షిస్తారు. శారీరక శిక్షణ పేరుతో చేసే ఈ వ్యాపకంలో ఆ పిల్లల మనసుల్లో కొన్ని భావాలను నాటుతారు. హిందూ మతాన్ని ఒక జాతిగా చిత్రీకరించి దాన్ని ఐక్యం చేయడానికి కృషి జరగాలని వారికి నూరిపోస్తారు. చిన్నప్పుడే కొన్ని భావాలను వాళ్లలో ప్రవేశపెడితే వాళ్లు పెరిగి పెద్దయిన తర్వాత దానికే అంకితం కావాలి అనే ఒక పథకం ప్రకారమే ఇదంతా నడుస్తుంది. వీటిని అమలుపరచడానికి 'కార్యనిర్వాహక్' అనే వ్యక్తి ఒకడుంటారు. గ్రామమైతే 'గ్రామ కార్యనిర్వాహక్', పట్టణమైతే 'శహర్ కార్యనిర్వాహక్' అని పిలుస్తారు. ఇతనితోపాటు ముఖ్య శిక్షక్, గణ ప్రముఖ్, ఘటనాయక్ అనే వారు ఉంటారు. ఈ పేర్లన్నీ సంస్కృతం హిందీ కలగలుపుగా ఉంటాయి. వీరితో నిర్మితమయ్యే దానినే 'శాఖ' అని పిలుస్తారు. ఈ శాఖలో 80 నుంచి 100 మంది వరకు సభ్యులు ఉంటారు. వీళ్లతో ఆటలాడిస్తారు. పాటలు పాడిస్తారు. కర్ర సాము, కత్తి సాము, సూర్య నమస్కారాలు, ప్రార్థనలు చేయిస్తారు. కొన్ని ప్రతిజ్ఞలు చేయిస్తారు. ఈ శాఖలలో ఏదో ఉదాత్తమమైన భావాలతో నింపుతారు అనుకుంటే అది పొరపాటు. సావర్కర్ ప్రవచించిన 'రాజకీయాలను హిందుత్వంతో నింపండి. హిందువులను సైనికీకరించండి' అన్న నినాదాన్ని మెల్లిమెల్లిగా లేత వయసులో ఉన్న పిల్లల మనసుల్లో జొప్పించే ప్రయత్నం చేస్తారు.

ఆర్ఎస్ఎస్ వాళ్లు శాఖలో పనిచేసే ముఖ్య శిక్షక్ ద్వారా కథల రూపంలో హిందువుల మీద ముస్లింలు ఘోరమైన అత్యాచారాలు చేశారని, హిందువులు ముస్లింల చేతుల్లో అనేక బాధలు పడ్డారనీ, హిందువులు ఎంతగానో నలిగిపోయారని కథలు కథలుగా నూరిపోస్తారు. విదేశాల నుంచి వచ్చిన ముస్లింలు చేతుల్లో హిందువులు పొందిన, ఇప్పుడు పొందుతున్న అవమానాలు అంటూ ఏకరువు పెడతారు. మన పూర్వీకులు పొందిన అవమానాలకు ఇప్పుడు మనం ప్రతీకారం తీర్చుకోవాలి అనే హింసా ప్రవృత్తిని రెచ్చగొడతారు. ఇదంతా ఆటలు, వ్యాయామం చేసే సందర్భంగా కొంత సమయాన్ని కేటాయించి చరిత్రను వక్రీకరించి పిల్లల మనసుల్లో ముస్లిం వ్యతిరేక భావనలను లేదా వేరే మతాల మీద వ్యతిరేకతను పిల్లల మనసులో నాటుతారు. ఇలాంటి ఉపన్యాసాలు 12, 13 ఏళ్ల పిల్లల మనసులపై చెరగని ముద్ర వేస్తాయి. ఆ పిల్లలు ఎదిగి యవ్వన దశకు చేరేటప్పటికీ కరడుగట్టిన స్వయం సేవకులుగా మారుతారు. ఆర్ఎస్ఎస్ శాఖలో చిన్న వయసులో ఉన్న పిల్లల మనసుల్లో భావోద్వేగ విష బీజాలను నాటటం వల్ల, పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు అవుతున్న క్రమంలో వాళ్ళు చెప్పేవన్నీ అబద్ధాలు అని తెలుసుకొనేలోపు ఒక మతోన్మాద విష వలయంలో చిక్కుకుపోయేలాగా చేస్తారు. ఒక ఉచ్చులో బిగించి వేసేస్తారు.

ఈ మొత్తం కార్యక్రమాన్ని ఎలా నడపాలి అనటానికి 'కార్యకార మండల్' ఒకటి ప్రతి పట్టణంలోనూ గ్రామంలోను ఉంటుంది. ఈ 'కార్యకార మండల్లో' ఉండే సభ్యులు వాళ్లు స్వయం సేవకులు కానక్కర్లేదు. శాఖా సభ్యులుగా కూడా ఉండవలసిన అవసరం లేదు. వాళ్లు ఆయా పట్టణాల్లో లేదా గ్రామాల్లో ఉన్న ప్రముఖులు వ్యాపారస్తులు, సంపన్నులు,

పెత్తందారీ కులాలు, ఆధిపత్య వర్గాలు, ఆ కార్యకార మండల్‌లో ఉండేట్లు చూస్తారు. ఈ రకమైన నిర్మాణం ఒక రకంగా ఆధిపత్య వర్గాలకు లేదా పెత్తందారి కులాల వాళ్లకు ఒక ప్రైవేటు సేనగా తయారు చేసే పథకం ఇందులో ఇమిడి ఉంది. ఈ కార్యకార మండల్‌ను నడపటానికి ఒక 'సంఘ సంచాలక్' అనేవాడు ఉంటాడు. ఆ సంఘ సంచాలక్ ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించిన పూర్తి కాలపు కార్యకర్త (హోల్ టైమర్). ఇతగాడే శాఖ ఎలా నడవాలి? ముఖ్య శిక్షక్ ఏ పనులు చేయాలి ? కార్యకార మండల్ యొక్క విధులు, బాధ్యతలు ఏమిటి ? ఇవన్నీ ఈ పూర్తి కాలపు కార్యకర్త సంఘ సంచాలక్ పర్యవేక్షిస్తూ ఉంటాడు. అంటే ఇదంతా ఒకళ్ల కనుసన్నలలో జరిగే మొత్తం కార్యక్రమం. చాలామంది పాల్గొన్నట్లు కనిపిస్తుంది కానీ ఒక భావజాలం ప్రకారంగా దీనిని ఒకడే కంట్రోల్ చేస్తూ ఉంటాడు. 'ఏక్ చాలక్ అనువర్తిత్' అని సూత్రం మీద పనిచేస్తాయి. అంటే నడిపేవాడు ఒకడే. ఇతని మాట ప్రకారమే సభ్యులందరూ ఎలా నడుచుకోవాలో నిర్దేశిస్తాడు.

శాఖలలో ప్రార్థనల అనంతరం ప్రతిజ్ఞలు చేయిస్తాడు. మాతృ దేవత కోసం, మాతృభూమి కోసం నేను ఏమైనా చేస్తాను. నా నాయకుడు ఏమి చెబితే అది చేస్తాను. నా నాయకుడు బాగా మండుతున్న మంట దగ్గరకు తీసుకెళ్లి ఆ మంటల్లో దూకమని చెప్తే వెంటనే నేను దూకేస్తాను. ఇలా ఉంటాయి వాళ్ల ప్రతిజ్ఞలు. అంటే నాయకుడి యొక్క నిరంకుశ భావానికి, అలాంటి తత్వానికి అనుగుణంగా శాఖ సభ్యులను మలిచే ప్రయత్నం అన్నమాట. అంటే నాయకుడు ఏమి చేయమని ఆదేశిస్తే ఆ ఆదేశాన్ని మారు మాట్లాడకుండా అమలు జరిపే ఒక నిరంకుశ తత్వాన్ని ఆమోదించే మనస్తత్వాన్ని తయారు చేయటం అన్న మాట. క్రమశిక్షణ పేరుతో ఇదంతా జరుగుతుంది.

ఇదే క్రమశిక్షణ గురించి ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడైన గోల్వాల్కర్ తాను రాసిన బంచ్ ఆఫ్ థాట్స్ (పాంచ జన్యం) లో ఏమంటాడో చూద్దాం. 'అక్కడ సమావేశమైన వ్యక్తులు ఒకే ఆజ్ఞను పాటించే శిక్షణ పొందుతారు. క్రమశిక్షణ వారి రక్తంలో రంగరించుకు పోతుంది. శారీరకమైన క్రమశిక్షణ కన్నా, మానసికమైన క్రమశిక్షణ మరింత ముఖ్యమైనది'. అంటే మానసికంగా పిల్లలను ఆ నాయకుడి యొక్క నిరంకుశత్వానికి అనుగుణంగా వాళ్ళని మార్చే క్రమశిక్షణ అన్నమాట. ఇదే శాఖలలో అమలుపరుస్తుంటారు.

అదే గ్రంథంలో ఒకచోట ఇలా అంటాడు 'నాయకుని ఈల గాని, ఆజ్ఞ గాని ఇంద్రజాలమే. క్షణంలో ఎక్కడి వారక్కడ గప్ చిప్. అంతా నిశ్శబ్దం. తర్వాత వివిధ వ్యాయామాలు, కర్ర సాము, సూర్య నమస్కారాలు కదం తొక్కటం జరుగుతాయి. తర్వాత చర్చా కార్యక్రమాలు ఉంటాయి. జాతీయ జీవనాన్ని ప్రభావితం చేసే సమస్యలను తరచి తరచి చూస్తారు. చివరలో వారంతా ధ్వజం ఎదుట వరుసలో నిలబడి ప్రార్థన చేస్తారు'.

వీటితోపాటు నెలకు ఒకసారి జరిగే 'బైటక్' అనేది ఒకటి ఉంటుంది. ఈ బైటక్ ప్రధానంగా చరిత్ర గురించిన ఉపన్యాసాలు మనసుల్లో భావోద్వేగాలు పెంచే విధంగా పాఠాలు చెబుతుంటారు. ఈ బైటక్ తర్వాత ఆరు నెలలకు ఒకసారి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ఇందులో వాస్తవ చరిత్రను వక్రీకరించి ఇతర జాతులు మన మీద దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నాయనే బూచి చూపించి వాటిని ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలని లేనిపోని ఉన్మాద విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తారు.

ఈనాడు దేశాన్ని పాలిస్తున్న మోడీ గాని, అమిత్ షా కానీ రాష్ట్రపతిగా పనిచేసిన రామనాథ కోవింద్ కానీ, ఉపరాష్ట్రపతిగా చేసిన వెంకయ్య నాయుడు కానీ వీరందరూ 40, 50 ఏళ్ల క్రితమే అంటే చిన్నప్పుడే ఇలాంటి విష బీజాలు నాటించుకున్న వాళ్లే. ఆ విష బీజాలు వీళ్లను ఎలాగ కలుషితం చేసాయో, ఆ విష వృక్షాలుగా పెరిగి పెద్దవై ఇవాళ మన సమాజానికి ఎలాంటి విషఫలాలను అందిస్తున్నదో మన కళ్ళ ముందు చూస్తున్నాం. ఈ శాఖలు గత 95 ఏళ్ల నుంచి ఇలా కొనసాగుతూనే ఉన్నాయి. 2016 నాటి లెక్కల ప్రకారం భారతదేశంలో 60 వేల శాఖలు పనిచేస్తున్నాయి అన్నది ఒక అంచనా. ఇప్పుడు అధికారంలో ఉన్నారు కాబట్టి ఈ శాఖల సంఖ్య ఇంకా పెరిగి ఉండవచ్చు. అయితే ఈ సమాచారం అంతా ఆర్‌ఎస్‌ఎస్ రహస్యంగా అట్టి పెడుతుంది. దేశంలోని పీడితులు అణగారిన వర్గాలు మైనారిటీలకు వ్యతిరేకంగా నిర్మించబడిన సైన్యం ఇది. మనుధర్మ శాస్త్రాన్ని అమలు పరచడం కోసం ఏర్పడిన సైన్యం.

యూరోప్‌లో ఒకనాడు ముస్సోలిని ఇలాంటి నిర్మాణమే 'బ్లాక్ షేడ్స్' అనే పేరుతో బృందాలను నియమించాడు. సరిగ్గా ఇలాంటి పనిని జర్మలో హిట్లర్ 'ఎస్‌ఎస్' అనే పేరుతో శాఖలను ఏర్పాటుచేశాడు. వాళ్ల నుంచి నేర్చుకొని ఆర్‌ఎస్‌ఎస్ మన దేశంలో ఇలాంటి విప్లవ ప్రతిఘాత సైన్యాన్ని తయారు చేస్తున్నది. 60 లక్షల మందికి తక్కువ కాకుండా సభ్యులు ఉన్నారని అంటే మన దేశంలోని సైన్యంకన్నా పోలీసులకన్నా పారామెలిటరీ కన్నా ఎక్కువ మంది ఉన్నారని అర్థం. వీళ్ల కార్యకలాపాలు సమాజానికి ఎంత ప్రమాదమో ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలి. వీరి కార్యకలాపాలు కేవలం జాతి పునర్నిర్మాణం చేయటానికి మాత్రమే కాదు. ఒక సైన్యంగా మారటానికి కళ్లు మూసుకుపోయిన ఇతర ఆలోచనలు ఏవి మనసులోనికి రానివ్వని ఒక గుడ్డి సైన్యం ఇది.

గురు పౌర్ణమి రోజున శాఖ సభ్యులందరూ తప్పనిసరిగా గురుదక్షిణ ఇవ్వాలి. ఈ విషయమై గోల్వాల్కర్ తన పాంచజన్యం గ్రంథంలో ఇలా చెబుతాడు. 'సంఘం అనుసరిస్తున్న ప్రాచీన గురుదక్షిణ సంప్రదాయం కూడా ఈ భావానికి అనుగుణమైనదే. సంవత్సరానికి ఒకసారి గురుపూర్ణిమ పర్వదినాన ప్రతి

స్వయంసేవకుడు పవిత్ర భగవ ధ్వజాన్ని పూజించి దక్షిణ (సొమ్ము) సమర్పిస్తాడు. సమర్పణలన్నీ ఆరాధన భావనతోనే జరుగుతాయి. తమ పేర్లు, తామిచ్చిన ధనం పది మందిలోనూ ప్రచారం కావాలని స్వయం సేవకులు కోరనైనా కోరరు. 'శాఖలలో పని చేసేవారు తలకు ఒక రూపాయి చొప్పున ఇచ్చినా సంవత్సరానికి 60 లక్షల రూపాయలు వసూలు అవుతాయి. అందరూ ఒక్కొక్క రూపాయి మాత్రమే ఇవ్వరు వందలు, లక్షలు రూపాయలు ఇచ్చేవారు ఉంటారు. అనేకమంది పారిశ్రమాధిపతులు ఈ శాఖలతో తమ బంధం పెనవేసుకొని ఉన్నారు. వాళ్ళు ఇచ్చే కోట్లాది రూపాయలతో వీరి ఆదాయం ద్విగుణీకృతంగా పెరిగిపోతూ ఉంటుంది.

ఈ సంఘ పరివార్ కుటుంబంలో వందకుపైగా సంస్థలు పనిచేస్తున్నాయి. అందులో హింసాత్మక చర్యలు చేపట్టడానికి ఉండే సంస్థలు ఉన్నాయి. తీవ్రవాద చర్యలు చేపట్టేవి ఉన్నాయి. బయటకు సాధు, సాంస్కృతిక స్వభావం గల సంస్థలుగా కనపడతాయి. కానీ దానికి భిన్నంగా త్రిశూలాలు, కత్తులు పట్టుకొని, అలాగే పిస్టల్స్, రివాల్వర్లు, తుపాకులు ఎలా పేల్చాలో, ఎలా వాడాలో శిక్షణ ఇచ్చే సంస్థలను ఏర్పాటు చేశారు. ఈ విషయం మాలేగావ్ పేలుళ్లలో, అల్లర్లలో బయటపడింది. సైన్యంలో చేరకముందే ఆర్ఎస్ఎస్ భావాలు కలిగి సైన్యంలో చేరిన వాళ్లు, అలాగే సైన్యం నుంచి పదవి విరమణ పొంది బయటకు వచ్చిన వాళ్లతో 'పూర్వ సైనిక్ సేవా పరిషత్' అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ పూణేలో, మాలేగావ్‌లో, బెల్గాంలో, ముంబైలో, నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ శాఖలో పనిచేసే వారికి సైనిక శిక్షణ కోసం ఈ సంస్థలను ఉపయోగిస్తున్నారు. ఇటీవల కాలంలో మంగుళూరులో 'శ్రీరామసేన', మాలేగావ్‌లో 'అభినవ భారత్' అనే పేరుతో హత్యాకాండలు జరిగాయి. ఈ సంస్థల్లో పనిచేసే వాళ్లు పూర్తిగా సైనిక శిక్షణ ఇవ్వబడినవాళ్లు. ఈ సంస్థలే ముస్లింలను చంపటం, ముస్లిం కాలనీల మీద దాడి చేసి ఇళ్లను తగలబెట్టడం, ఈ సంస్థలే గౌరీ లంకేష్‌ను, కల్బుర్గిని, గోవింద పన్సారేను, దబోల్కర్ హత్యలలో వీరి పాత్ర వున్నది అన్నది రుజువైనది. భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసిన వారిని భౌతికంగా అంతం చేయడం ఈ సంస్థల యొక్క లక్ష్యం. వీరందరూ ఆర్ఎస్ఎస్ శాఖల నుంచి వచ్చిన వారే. వీళ్లు పట్టుబడినప్పుడు ఆర్ఎస్ఎస్ వెంటనే వీళ్లకు మాకు సంబంధం ఏమీ లేదు అని బుకాయిస్తుంది.

గాంధీజీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేను హత్య జరిగిన తరువాత గాడ్సేకు ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని అని చాలా కాలం బకాయించారు. నాథూరామ్ గాడ్సే తమ్ముడు గోపాలకృష్ణ గాడ్సే తర్వాత కొన్నేళ్లకు మేమందరం ఆర్ఎస్ఎస్ కుటుంబంలో సభ్యులమే అని స్పష్టంగా ప్రకటించాడు. హత్యలు వీళ్లే చేస్తారు. రకరకాల సంస్థల పేరుతో చేస్తారు. ఆ సంస్థలతో మాకు ఏమీ సంబంధం లేదని సమాజాన్ని నమ్మింపచూస్తారు. ఇది ఆర్ఎస్ఎస్ యొక్క డూప్లికసికి, అబద్ధాలకు అద్దం పడుతూ ఉంటుంది. తాత్కాలికంగా తప్పించుకోవటానికి వీళ్లు ఎన్ని అబద్ధాలనయినా ఆశ్రయిస్తారు. వీళ్ళ ఫ్యాక్టరీలో అబద్ధాలు అవసరానికి మించి ఉత్పత్తి అవుతూ ఉంటాయి. వీళ్ళది అబద్ధాల వాట్సాప్ యూనివర్సిటీ అని దేశ ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నది. దైవ భక్తులం అని చెప్పుకునే వీళ్లు, రాముడే మాకు ఆరాధ్యం అని చెప్పుకుంటే వీళ్ళు తెల్లవారితే అబద్ధాలు చెప్పటం, ప్రచారం చేయటం ద్వారా రాముడికే కళంకం తెచ్చారు.

ఇలాంటివన్నీ ఆర్ఎస్ఎస్ శాఖలో జరిగేటువంటి క్రియలు. ఈ రియాక్షనరీ శక్తులు బయట ఇంకా ఎన్ని రంగాలలో చొచ్చుకునిపోయారో ఒకసారి పరిశీలిద్దాం. ఈ శాఖలకు బయట విద్యాలయాలను ప్రారంభించారు. అవి 1940వ సంవత్సరం నుండే మొదలయ్యాయి. విద్యా భారతి అనే సంస్థ దాని కింద సరస్వతి శిశుమందిర్ అనే విద్యాలయాలు ప్రారంభించారు. అలాంటివి దేశంలో 13 వేల పాఠశాలలు ఉన్నట్టు అంచనా. అందులో 17 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. అంటే ఆర్ఎస్ఎస్ వాళ్లు రాబోయే తరాలకు ఎసరు పెడుతున్నారన్నమాట. ఇప్పటికే అలా రెండు తరాలకు విష బీజాలు నాటిన వీరు, రాబోయే తరాలను అలానే తయారు చేయాలని ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థి రంగంలో 1940లోనే ఏబీవీపీని ప్రారంభించారు. విశ్వ హిందూ పరిషత్ అనే సాధుసంతుల సంస్థను ప్రారంభించారు. అది ఇవాళ అంతర్జాతీయంగా అనేక దేశాలలో శాఖలుగా వ్యాపించి ఉంది. బజరంగ్‌దళ్ అనే మరొక సంస్థను స్థాపించారు. అలానే కార్మిక రంగంలో బిఎంఎస్ అనే సంస్థ కార్మికుల పోరాటాలు నీరు గార్చటం కోసం దీనిని ఏర్పాటు చేశారు. ఈబిఎంఎస్ సంస్థ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అయిన మే డేను వ్యతిరేకిస్తుంది. అది మన భావన కాదని దాని స్థానంలో విశ్వ కర్మ జయంతిని పాటిస్తుంది. ఈ విశ్వకర్మ దేవతలకు ఆయుధాలను తయారుచేసి సరఫరా చేసేవాడట. ఆయుధాలు అనగానే ఒక హింసాత్మక ధోరణిని సూచిస్తుంది. యాజమాన్యంతో కుమ్మక్కు అవుతూ కార్మికులు చేసే సమ్మెకు వెన్నుపోట్లను పొడిచే దానికోసమే దీనిని స్థాపించారు. యాజమాన్యాలతో సామరస్యంగా ఉండాలి కానీ ఎలాంటి సమ్మెలు చేయకూడదు అని ప్రబోధిస్తుంది ఈ సంస్థ. కార్మికుల హక్కుల కోసం పోరాడదు. పైగా కార్మిక రంగంలోనే ఉంటూ కార్మికుల హక్కులకు తూట్లు పొడుస్తూ యాజమాన్యాల కొమ్ము కాస్తుంది.

ఆర్ఎస్ఎస్ వాళ్లు ఆదివాసీలలో 'కళ్యాణ ఆశ్రం' పేరుతో ఒక

సంస్థను ఏర్పాటుచేశారు. సాహిత్య రంగంలో 'అఖిల భారతీయ సాహిత్య పరిషత్', 'ప్రజ్ఞ భారతి' పేరుతో, దీన్ దయాళ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పేరుతో మేధావుల రంగంలో, సైంటిస్టుల్లో 'విజ్ఞాన భారత్', 'ఆదివాసీలు దళితులలో పనిచేయటానికి' సామాజిక్ సమరసితామంచ్' ఇంకా 'వివేకానంద కేంద్ర', 'హిందూ జాగరణ మంచ్', పంజాబు, ఢిల్లీల్లో సిక్కుల కోసం 'రాష్ట్రీయ సిక్కు సంఘ్', భారత్ వికాస్ పరిషత్', భారతీయ ఇతిహాస్ సంకలన్ సమితి' పేరుతో చరిత్ర రంగంలో, 'భారతీయ శిక్షణ మండల్', 'అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్' పేరుతో ఉపాధ్యాయుల రంగంలో వివిధ శాఖలను ఏర్పాటు చేశారు. పాఠ్య పుస్తకాలను రచించడం కోసం, అలానే పాఠ్యపుస్తకాలు సమీక్ష కోసం 'సంస్కృత భారతి', 'సంస్కార భారతి"లాంటి సంస్థలను నిర్మించుకున్నారు. అంతేకాకుండా 'హిందూ సేవా ప్రతిష్టాన్ సేవా భారతి', 'స్వామి వివేకానంద మెడికల్ మిషన్', 'సహకార భారతి', 'అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్' ఇలా ఎన్నో మనకు తెలియని అనేక సంస్థలను స్థాపించారు. అంతేకాదు సాహిత్య ప్రచురణల కోసం 'భారత్ ప్రకాశం', 'లోక్‌హిత్ ప్రకాశం', 'సురుచి ప్రకాశం', 'జ్ఞాన్ గంగా ప్రకాశం', 'అర్చన ప్రకాశం', 'భారతీయ విచార్ సాధన', మాధవ్ ప్రకాశం ఇలాంటివన్నీ వాళ్ల ప్రచురణ సంస్థలు వీటి ద్వారా అబద్ధాలతో, అభూత కల్పనలతో కూడిన పత్రికలు పుస్తకాలు, గ్రంథాలు , రకరకాల అబద్ధాల కరపత్రాలు కొన్ని వందలు, వేలు ప్రచురించబడుతున్నాయి. ఇలా అనేక సంస్థలను స్థాపించింది ఆర్ఎస్ఎస్ ఇవి కాక అనేక రహస్య సంస్థలు కూడా ఎన్నో పని చేస్తున్నాయి. ఇవి కూడా పరిశోధకులు శోధించి మనకు చెప్తున్న సమాచారం. అమెరికాలో, యూకేలో, యూరప్‌లో కూడా వీరి సంస్థలు ఉన్నాయి. అవి 'భారతీయ స్వయం సేవక్ సంఘ్', 'హిందూ స్వయంసేవక్ సంఘ్', 'హిందూ సేవా సంఘ్', 'సనాతన ధర్మ స్వయంసేవక్ సంఘ్', 'ఫ్రెండ్స్ ఆఫ్ ఇండియా సొసైటీ' ఇలా అనేక సంస్థలు భారతదేశం బయట పని చేస్తున్నాయి. ఇవి కాక విశ్వహిందూ పరిషత్ శాఖలు ఉండనే ఉన్నాయి. ఈ సంస్థల నుంచి వందల కోట్ల నిధులు మన దేశంలోని ఆర్ఎస్ఎస్‌కు అందుతున్నాయి. వాటికి లెక్కలు లేవు.

ఇన్ని రంగాలలో ఈ ఫాసిస్ట్ శక్తులు తమ యొక్క ఆలోచనలను, భావజాలాలను, నాటుతూ, సమాజానికి చేటు తెస్తూ, వినాశనానికి గురిచేస్తున్న విషయాన్ని గ్రహించాలి. వాస్తవానికి విప్లవ శక్తులు, కమ్యూనిస్టులు, ప్రగతిశీల ప్రజాస్వామ్యవాదులు ఈ రంగాలలో చొచ్చుకుని పోయి ఉండాలి. కానీ అలా జరుగుతూ ఉన్నదా? సమాజాన్ని మార్చి అభివృద్ధికరమైన సమాజాన్ని నిర్మించుకోవాలంటే ఈ రంగాలలో కృషి తప్పనిసరిగా జరగాలి. కానీ అలాంటి కృషి జరగవలసిన మోతాదులో ఏ మాత్రం జరగటం లేదు. ఇన్ని రంగాలు ఉన్నాయి అన్న విషయం కనీసం తెలుసునో లేదో కూడా ప్రశ్నార్థకమే. కమ్యూనిస్టులు, ప్రగతిశీల ప్రజాస్వామ్య వాదులు పునస్సమీక్షించుకోవాలి. ఆత్మ పరిశీలన, ఆత్మ విమర్శ చేసుకోవాలి. ప్రగతిశీల శక్తులు ఉదాసీనంగా ఉంటే, ఇలాంటి విప్లవ ప్రతీ ఘాత శక్తులదే పైచేయి అవుతుంది. సమాజాన్ని మతాల పేరు మీద, కులాల పేరు మీద విభజించి ఈ దేశాన్ని ఒక మత రాజ్యాంగా మార్చే కుట్రలు పన్నుతున్నారు. మాది కేవలం సాంస్కృతిక సంస్థ మాత్రమేనని, రాజకీయాలతో మాకు ఎలాంటి సంబంధం లేదని ఎప్పుడూ బొంకుతూ ఉంటారు. 1951లోనే ఆర్ఎస్ఎస్ 'జనసంఘ్' పేరుతో పార్టీని స్థాపించారు. దానిని స్థాపించిన వాడు శ్యాంప్రసాద్ ముఖర్జీ. ఆర్ఎస్ఎస్ నాయకుడైన గోల్వాల్కర్ ప్రోత్సాహం మీద, ఆయన కనుసన్నలలోనే ఈ 'భారతీయ జన సంఘం' ఏర్పాటు అయింది. 1977 ఎన్నికలలో ఈ జనసంఘ 91 పార్లమెంటు స్థానాలను గెలుచుకున్నది.అలాగే కొన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చింది. ఈ జన సంఘ్ 1980లో భారతీయ జనతా పార్టీ అని కొత్త అవతారం ఎత్తింది. ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామ్యానికి సోషలి జానికి బద్ధ వ్యతిరేకి. సోషలిజానికి బద్ధ వ్యతిరేకులైన వీరే, ఈ దేశానికి అది పనికిరాదన్న వీరే గాంధేయ సోషలిజం మా లక్ష్యం అని ప్రకటించారు. వీళ్లు ఒకటి చెబుతారు, మరొకటి వాళ్లు అనుకున్నది చేయడం గురించి రకరకాల పేర్లు రకరకాల అవతారాలు ఎత్తుతూ అలా చేయడం వీరికి వెన్నతో పెట్టిన గోల్వాల్కర్ నేర్పిన పాఠాలు. ఓ పక్క గాంధీని హత్య చేసిన హంతకుడైన నాథూరామ్ గాడ్సేను దేశభక్తుడు అని ఆకాశానికి ఎత్తుతూనే, మరోపక్క గాంధీయ సోషలిజం అంటూ జపం. ఇది వారి డబుల్ స్టాండర్డ్‌కు, డూప్లికేసికి నిదర్శనం. 1977 జనతా పార్టీలో వున్న వీరు ఎన్నికైన తర్వాత ఆయా రాష్ట్రాలలో పాఠ్య పుస్తకాలను మార్చటం మొదలు పెట్టారు. అసలు ఈ భారతీయ జనసంఘ్ పార్లమెంటు ప్రతినిధులు 1977లో ఎన్నికలలో గెలవగానే విద్యా శాఖ మాకు ఇవ్వాలని, అలానే సమాచార పౌర సంబంధాల శాఖ మాకు ఇవ్వాలని పట్టుబట్టు మరీ తీసుకున్నారు. అంటే పాఠ్యాంశాల్ని మార్చడం ద్వారా ప్రజల మెదడులను, వారి భావజాలంతో నింపవచ్చు. ప్రభావితం చేయవచ్చనే ఆలోచనతోనే ఆ శాఖలను పట్టుబట్టి తీసుకున్నారు. ఎన్సీఈఆర్టీలో అనేకమంది గొప్ప గొప్ప మేధావులు పాఠ్య పుస్తకాలను రాశారు. అవన్నీ విద్యార్థులకు సిలబస్‌గా ఎన్నో దశాబ్దాల నుంచి కొనసాగుతున్నది. అలానే అనేక చరిత్ర పుస్తకాలు కూడా. కానీ వీటిని మార్చటానికి ఈ ప్రతి ఘాత శక్తులు కంకణం కట్టుకుని ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి. ఎన్సీఈఆర్టీ ప్రవేశపెట్టిన రచనలలో హిందూ వ్యతిరేక ఆలోచనలు ఉన్నాయని, ముస్లింలను సంతుష్ట పరిచే భావాలు

ఉన్నాయని, ఆ సంస్థ చరిత్ర రచనలు భారతదేశ చరిత్రను భారతదేశ చరిత్రగా చెప్పేవిగా ఉన్నాయి. కానీ, హిందూ జాతి చరిత్రను చెప్పేవుగా లేవు కాబట్టి వాటిని మార్చాలి. అనే ఆలోచన 1977 నాడే ప్రారంభమైంది. ఈనాడు చరిత్ర పాఠాలలో జాతిపిత గాంధీకి సంబంధించిన అంశాలను తొలగించారు. మొఘలాయిల పరిపాలన సంగతులను తొలగించారు. విప్లవవీరుడు, స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వాళ్ళని ఎదిరించి ఉరికంబాన్ని ముద్దాడిన, భగత్‌సింగ్ పాఠాన్ని తొలగించి, మత ఛాందసుడు, మతోన్మాది అయిన, గోల్వాల్కర్ పాఠాన్ని చేర్చారు. సైన్స్‌కు గుండెకాయ అయిన చార్లెస్ డార్విన్ యొక్క క్రమ వికాస పరిణామ క్రమం (ఎవల్యూషనరీ థీరి) అనే అంశాన్ని సహితం తొలగించారు. మ్యాథమెటిక్స్‌లో అనేక చాప్టర్లను ఎత్తివేశారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలలో మత గ్రంథమైన భగవద్గీతను ప్రవేశపెడుతున్నారు. అలాగ స్వాతంత్రోద్యమంలో దేశద్రోహ పాత్ర వహించిన సావర్కర్‌ను గొప్పవీరుడుగా చెప్పే కథలను పాఠ్యాంశాలుగా పెడుతున్నారు. అంతేకాదు పురాణాలను చరిత్రగా చిత్రీకరించే దౌర్భాగ్యపు పరిస్థితిని తీసుకువచ్చారు. వినాయకుడికి ఏనుగు తలను అమర్చే ప్లాస్టిక్ సర్జరీ ఆనాడే ఉన్నదని, కౌరవులు నూరుగురు స్టెమ్ సెల్స్ అంటే కణ వైద్యం ద్వారా పుట్టిన వాళ్లేనని, అలాంటి వైద్యం అనాడే ఉందని, చివరికి యూనివర్సిటీలలో జ్యోతిష్యము, భూత వైద్యము లాంటి ఎలాంటి శాస్త్రీయత లేని, రుజువు కాని నిరర్థకమైన అంశాలను పిల్లలకు చెప్పడం ద్వారా వారి మానసిక పురోభివృద్ధి జరగకుండా, అభ్యుదయంగా ఆలోచించకుండా నిర్వీర్యులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. సైన్సు, సోషల్ సైన్సు, మ్యాథమెటిక్స్ లాంటివి సమాజం వైజ్ఞానికంగా పురోగమించటానికి ఎంతగానో దోహదపడతాయి. ప్రపంచంలో అనేక దేశాలు ఆయా రంగాల్లో గణనీయమైన కృషి సాగిస్తూ గొప్ప అభివృద్ధిని సాధిస్తూ, సమాజాన్ని ముందుకు నడిపిస్తూ ఉంటే, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ఇలాంటి పాఠ్యాంశాల మూలంగా సమాజం మధ్యయుగాలకు నడుస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు. సమాజం ఎలా మార్పులు చెందుతూ పురోగమిస్తున్నదో చరిత్ర పాఠాలు చెప్తే, మానవ పరిణామ క్రమాన్ని సైన్స్ వివరిస్తుంది. వీటిని మార్చేసి సృష్టి కథలను చెబితే, పుక్కిటి పురాణాలను చెబితే మానవ సమాజాభివృద్ధికి దాని మేధస్సుకు మేకులు కొట్టినట్లే. భావజాల రంగంలో వీళ్లు చేస్తున్న నష్టం అంతా ఇంతా కాదు. చరిత్ర పాఠ్య పుస్తకాలను వక్రీకరించడం, తప్పుడు చరిత్రను తిరగరాసి చెప్పటం ద్వారా సమాజ తిరోగమనానికి బాటలు వేస్తున్నారు. ఇలాంటి పనికిమాలిన చెత్తను అమలు పరచడానికి అన్ని ముఖ్యమైన రంగాలలో తమ భావజాలాన్ని అమలు జరిపే వాళ్ళతో నింపి వేస్తున్నారు. ఉదాహరణకు ఉద్యోగ రంగంలో, సైనిక రంగంలో, కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రీసెర్చ్‌లో, ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లో, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్‌లో, ఇంకా ఐపీఎస్‌లో ఐఏఎస్‌లలో కూడా వివిధస్థాయిలో తమ భావజాల అనుకూలురతో నింపివేయబడుతున్నవి. ఆయా సంస్థలలో నిర్ణయాధికారం వహించే వారందరూ తమ వారే. ఆయా సంస్థలు 2014 ముందు పనిచేసిన తీరుకు, 2014 తర్వాత పనిచేస్తున్న తీరుకు ఒక్కసారి తైపారు వేసి చూసుకుంటే ఇట్టే అర్థమవుతుంది. చైర్మన్లు మేనేజింగ్ డైరెక్టర్ పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు తమ మనుషులు ఎక్కువ మంది ఉంటారు. వారితోనే నిండి ఉంటుంది. వీరి పని విద్యను కాషాయీకరణ చేయడం, కార్పొరేటీకరించటం, ప్రైవేటీకరించడం.

ఆర్ఎస్ఎస్ యొక్క ఎజెండాలో అనేక ప్రధాన సమస్యలతో పాటు అగ్ర తాంబూలం తీసుకునేది మతాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టడం. ఆ విధంగా వేరే మతాలకు వ్యతిరేకంగా పోలరైజేషన్ చేయటం. అలానే కులాల మధ్య చిచ్చు పెట్టడం. సోషల్ ఇన్ ఇంజనీరింగ్ చేయటం దాని యొక్క లక్ష్యం. మతాల మధ్య హింసను రెచ్చగొట్టడం కాదు దాన్ని వ్యాపింప చేయటం కూడా ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. అలానే సమాజంలో పుకార్లు సృష్టించడంలో ఆర్ఎస్ఎస్ వాట్సాప్ యూనివర్సిటీకి మించింది బహుశా లేదు. ఇలాంటి పాఠాలన్ని, హిట్లర్, ముసోలిని, గౌబెల్స్ నుంచి వీళ్లు బాగా నేర్చుకున్నారు. స్వాతంత్ర్య అనంతరం దేశంలో మత కల్లోలాలు జరిగాయి. వాటి తర్వాత చెప్పుకో తగినంత మత కల్లోలాలు ఘర్షణలు 1969లో అహ్మదాబాద్‌లో అద్వానీ పార్లమెంటుకు పోటీ చేసినప్పుడు జరిగిన మతకల్లోలాలు. అక్కడ నుంచి ప్రారంభమైన మతకల్లోలాలు, మారణ హోమాలు ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. మీరట్, లక్నో, పాట్నా, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో ప్రతి నగరం రాజస్థాన్, గుజరాత్‌లో ప్రతి నగరంలోనూ ఇలాంటి మత కలహాలే జరిగాయి. గుజరాత్‌ను, కర్ణాటకను ఆర్ఎస్ఎస్ ఒక ప్రయోగశాలగా వాడుకున్నది.

1989లో గుజరాత్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ముస్లింల మీద క్రైస్తవుల మీద ఎక్కుపెట్టిన దాడులు చివరకు 2002లో గుజరాత్ ఊచకోతకు దారితీశాయి. అలాగే కర్ణాటకలో కూడా 1990 నుంచి ఈద్గా మైదాన్ అనే చోట ఉన్న వివాదాస్పద స్థలాన్ని అడ్డుపెట్టుకొని గొడవలను సృష్టించింది. ఇలా ఉన్న సమస్యను పైకి తీసుకురావడం, సమస్య లేని చోట సమస్యను సృష్టించి మతకల్లోలాలకు ఆజ్యం పోస్తున్నది ఆర్ఎస్ఎస్. వీళ్ళ పాలసీ దేశమంతటా మత కల్లోలాలను సృష్టించటం హిందువులను హిందువులు కానీ వారిని వేరు చేసి విభజించడం వీరి యొక్క ప్రధాన లక్ష్యం. ❑

# హిందూత్వ వాదం - సైన్సుకు ప్రమాదం



- ఎస్.వెంకట్రావు

### 2015 అక్టోబర్‌లో..


నరేంద్రమోడీ నాయకత్వంలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ప్రభుత్వం నుంచి సైన్సుకు ఎదురవుతున్న దాడిపై భారతదేశానికి చెందిన 100 మంది ప్రముఖ శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వ విధానాలు దేశంలో హేతువు(రీజన్), సైన్సును నాశనం చేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రభుత్వంలోని ముఖ్యనేతలే అహేతుక, ఛాందసవాద భావజాలాన్ని ప్రోత్సహిస్తున్న వైనాన్ని ఈ రోజు మనం చూస్తున్నాం' అని వారు పేర్కొంటూ ఈ వైఖరి దేశ భవిష్యత్తుకు ప్రమాదరకమని హెచ్చిరించారు. ఈ ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో అనేకమంది పద్మ అవార్డు గ్రహీతలు, ఇతర అవార్డులు పొందిన వారు, అనేక ఉన్నత శాస్త్ర-సాంకేతిక సంస్థల అధిపతులు ఉన్నారు.

### 2018 ఏప్రిల్ 14

బీజేపీ ప్రభుత్వ సైన్సు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీతో సహా దేశంలోని అనేక నగరాలు, పట్టణాల్లో వేలాది మంది సైంటిస్టులు, మేధావులు, విద్యార్థులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అఖిలభారత పీపుల్స్ సైన్సు నెట్వర్క్ బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ ఇతర సంస్థల ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనల్లో 'శాస్త్రీయ ఆధారాలు లేకుండా, శాస్త్రవేత్తలతో సంప్రదించకుండా నరేంద్రమోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాల'ను తూర్పారబట్టారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొట్ట మొదటిసారిగా ప్రభుత్వం శాస్త్రవేత్తలతో సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం, సైన్సు-టెక్నాలజీకి నిధులు తగ్గించేయడమే కాకుండా 'ప్రభుత్వంలోని ముఖ్య నేతలే పరిణామవాదాన్ని ఖండించడం, బోగస్ సిద్ధాంతాలనూ, బోగస్ చరిత్రనూ ప్రవేశపెట్టడం, ప్రాచీన భారతదేశంలోనే సైన్సు అంతా దాగి ఉందనే అశాస్త్రీయ ప్రకటనలు చేయడం, పురాణాలను చారిత్రక వాస్తవాలుగా ప్రచారం చేయడం మొదలైన వాటి ద్వారా సైన్సు, శాస్త్రీయ దృక్పథాల మీద ఒక పద్ధతి ప్రకారం దాడి చేస్తున్నారు' అని శాస్త్రవేత్తలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### 2021 మే..

మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వం ఇద్దరు వ్యక్తులను జాతీయ




భద్రతా చట్టం కింద అరెస్టు చేసింది. వారిలో ఒకరు పాత్రికేయుడు కిషోర్‌చంద్ర వాంగ్ ఖెమ్, రెండో వ్యక్తి సైన్సు ప్రచారకుడు ఎరెంద్రో లీచోంచామ్. వారు జాతీయ భద్రతకు చేసిన హాని ఏమంటే కోవిడ్-19 తగ్గడానికి ఆవు పేడ, ఆవు మూత్రం గొప్ప ఔషధంగా పనిచేస్తాయి అని జరుగుతున్న ప్రచారానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టడమే. ఎంత విచిత్రం !

శాస్త్రీయ భావాలు అలవరచుకోవడం ప్రజల ప్రాథమిక విధి అని మన రాజ్యాంగం చెబుతుండగా ఆ విధిని నిర్వహించే పాత్రికేయులను ప్రభుత్వమే అరెస్టు చేస్తోంది.

'శాస్త్రీయ ఆలోచనలు, హేతువాద దృక్పథాలను ప్రచారం చేయడమే జీవిత ధ్యేయంగా ఎంచుకున్న నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే, ఎంఎం కుల్బుర్గి, గౌరీ లంకేశ్‌లను మూఢ శక్తులు ఏకంగా హత్య గావించిన సంగతి మనకు తెలుసు.

భారతదేశంలో సైన్సుకూ, సైన్సు అనుసరించే హేతుబద్ద ఆలోచనా విధానానికీ ఎంతటి ప్రమాదం ఏర్పడిందో తెలుసుకోడానికి పైన చెప్పిన ఉదాహరణలు కొన్ని మచ్చుతునకలు మాత్రమే.

రాజ్యాంగంలోని 51 ఎ(హెచ్) అధికరణం 'శాస్త్రీయ దృక్పథాన్ని, మానవత్వాన్ని, పరిశీలనా దృష్టి, సంస్కరణలను పెంపొందించడం' ప్రతి పౌరుని ప్రాథమిక విధి అని చెబుతోంది. బీజేపీ ప్రభుత్వం సైన్సు మీదనే కాదు శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా రాయబడిన భారతదేశ చరిత్ర మీద దాడిచేస్తోంది. దీని గురించి ప్రఖ్యాత సైన్సు కార్యకర్త ప్రబీర్

పుర్కాయస్థ 'విజ్ఞానం ఉమ్మడి సంపద' అనే పుస్తకంలో యిలా పేర్కొన్నారు : 'సైన్సు మీద జరుగుతున్న ఈ దాడి చరిత్ర మీద కూడా దాడే. ప్రాచీన భారతదేశంలో గణితం, ఖగోళ శాస్త్రం, వైద్య శాస్త్రాల్లో జరిగిన వాస్తవ విజయాల స్థానంలో పుక్కిటి పురాణాలు ప్రచారం చేస్తున్నారు. పురాణాలను చరిత్రగా చూపించడం ద్వారా వాళ్లు హేతువు, విజ్ఞాన శాస్త్ర పరికరాలతో చరిత్రను అధ్యయనం చేయడానికి ఉన్న ప్రాతిపదికను నాశనం చేస్తున్నారు. వారి వికృతమైన జాతీయవాదానికి సైన్సు, చరిత్ర ఆట స్థలాలుగా మారిపోయాయి. భారతదేశం వాస్తవంగా సాధించిన విజయాలను వమ్ము చేసి, వాటి స్థానంలో పురాణ గాథలను ప్రవేశపెట్టిడం ద్వారా వాళ్లు భవిష్యత్తులో హేతుబద్ధ తర్కం, శాస్త్రీయ దృక్పథంతో పురోగమించడానికి కావలసిన ప్రాతిపదికను కూడా నాశనం చేస్తున్నారు'.

సైన్సు, హేతు దృక్పథంపై ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రధానంగా ఏ మార్గాల్లో దాడి చేస్తున్నదో పరిశీలిద్దాం.

1. హేతువుకు, శాస్త్రీయ దృక్పథానికి విరుద్ధమైన వాదనలు.

2. ఆధునిక విజ్ఞాన శాస్త్రమంతా ప్రాచీన భారత గ్రంథాల్లో ఉన్నాయని వాదించడం.

3. తమ వాదనలకు అడ్డు వచ్చే ఆధునిక విజ్ఞాన శాస్త్రాన్ని తిరస్కరించడం.

4. లౌకిక తత్వాన్ని వ్యతిరేకించడం.

## హేతువుకు, శాస్త్రీయ దృక్పథానికి విరుద్ధ వాదనలు

మానవజాతి చరిత్ర మొత్తంలోనూ మత ఛాందసత్వాన్ని, పిడివాదాన్ని ప్రశ్నించడం ద్వారానే సైన్సు అభివృద్ధి చెందింది. కానీ ఆర్ఎస్ఎస్ సైన్సుకన్నా మతం అధికమైనదని ప్రకటిస్తోంది. 2017 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయబడిన జాతీయ గో కమిషన్ (రాష్ట్రీయ కామధేను ఆయోగ్) చైర్మన్ డాక్టర్ వల్లభ్ భాయ్ కథిరియా సైన్సునూ, ఆధ్యాత్మికతనూ కలగలిపితే 'సామాజిక పరివర్తనకు, దారిద్ర్య నిర్మూలనకు, పర్యావరణ పరిరక్షణకు' ఆవు ఒక అవసరమైన సాధనమవుతుందని సెలవిచ్చారు. ప్రతి యూనివర్శిటీలోనూ కళాశాలలోనూ 'కామధేను చైర్' ప్రారంభించాలని ఆయన సూచించారు. ఆవు పేడతో తయారుచేసే చిప్స్ మొబైల్ ఫోన్లలో రేడియేషన్ తగ్గిస్తాయని చెప్పారు. ఆవు మూత్రం, కండెన్స్‌డ్ ఆవు మూత్రం తీసుకుంటే సర్వ రోగ నివారణ జరుగుతుందని చెప్పారు.

ఆవు మూత్రం ఆరోగ్యానికి మంచిదనీ, అది సర్వరోగ నివారిణి అనీ బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఒకటే ఊదరగొడుతుంది. ఆవు మూత్రంతో కరోనాను నయం చేయవచ్చునని మహమ్మారి కాలంలో టీవీల్లోనూ, వాట్సాప్ గ్రూపుల్లోనూ వీళ్లు విపరీతంగా ప్రచారం చేశారు. కరోనాను నయం చేయడానికి వాళ్లు ఆవు మూత్రం తాగే కార్యక్రమాలు నిర్వహించారు. కానీ ఎక్కడా ఆవు మూత్రం తాగిన వారికి కరోనా తగ్గినట్లు దాఖలా లేదు.

2021లో కామధేను గో విజ్ఞాన ప్రచార పరిషత్ వాళ్లు జాతీయ గో విజ్ఞానశాస్త్రంపై ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొనాలని భారత ప్రభుత్వ నిధులతో నడిచే యూనియన్ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) దేశంలోని 900 విశ్వ విద్యాలయాలకు ఉత్తరాలు రాసింది. రాష్ట్రీయ కామధేను ఆయోగ్ రూపొందించిన సిలబస్ ప్రకారం ఐదు లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి రిజిస్టర్ చేయించుకున్నారు. పరీక్ష కోసం ఈ సంస్థ రూపొందించిన స్టడీ మెటీరియల్ చదివితే సైన్సును కాషాయ మూకలు ఎంతటి దుర్గతిలోకి తీసుకుపోయారో అర్థమవుతుంది. అణు ధార్మికత (న్యూక్లియర్ రేడియేషన్) నుంచి కాపాడుకోడానికి ఆవు పేడ ఉపయోగపడుతుందని, రష్యాలోనూ, భారత్‌లోనూ దీన్ని ఉపయోగించారని రాశారు. ఆవు మూపురంలో సౌర ఫలకాలు ఉంటాయని, ఇవి సూర్యకిరణాలను బంగారంగా మారుస్తాయని, అది ఆవు పాలల్లోకి చేరుతుందని, అందువల్లనే ఆవు పాలు పసుపు రంగులో ఉంటాయని ఇందులో రాశారు. అయితే స్టడీ మెటీరియల్లోని ఈ అశాస్త్రీయ వాదనలపై తీవ్రమైన విమర్శలు రావడంతో పరీక్షలు వాయిదా వేశారు.

**జంతువులన్నీ ఆక్సిజన్ పీల్చుకుని, కార్బన్ డై-ఆక్సైడ్ విడుదల చేస్తాయన్న విషయం మనకు తెలుసు. కానీ, రాజస్థాన్ బీజేపీ విద్యామంత్రి వాసుదేవ్ దేవ్నాని "ఆవు మాత్రమే ఆక్సిజన్ పీల్చుకుని మళ్లీ ఆక్సిజన్ విడుదల చేస్తుంది" అని ప్రకటించారు. గోవు గురించి ఆర్ఎస్ఎస్ చేసే ఈ అశాస్త్రీయ ప్రచారం వెనుక మతతత్వ ఎజెండా ఉంది. గో మూత్రం గురించి ఆర్ఎస్ఎస్ పరివారం చేస్తున్న ప్రచారాన్ని నమ్మి దేశంలోని అనేకమంది దాన్ని తాగి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. గో మూత్రంలో 14 రకాల ప్రమాదకర బాక్టీరియాలు వుంటాయని భారత పశు పరిశోధన సంస్థ ఇటీవల వెల్లడించింది. గో మూత్రాన్ని నేరుగా తాగితే కడుపులో అనేక రకాల సమస్యలు తలెత్తుతాయని నివేదిక వెల్లడించింది.**

ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తల్లో ఒకరు, ఆ సంస్థ రెండవ సర్ సంఘ్ చాలక్ అయిన ఎంఎస్ గోల్వాల్కర్ 1966లో ఇలా చెప్పారు : "నేటి యుగం సైన్సు యుగం అని ప్రజలు పదేపదే

చెబుతుంటారు. అందువల్ల ఈ సైన్సు యుగానికి అనుగుణంగా మతంలో మార్పులు చేయాలని వారు తరచూ వాదిస్తుంటారు. కాని నేను దానికి కచ్చితంగా విరుద్ధమైన విషయాన్ని చెబుతాను. సైన్సులో వచ్చే ప్రతి పరిశోధనకు అనుగుణంగా మతాన్ని మార్చుకుంటూ పోతే మతమనేదే మిగలదు. అప్పుడు మానవ జాతి అంతా నిస్పృహకు గురవుతుంది. అందువల్ల ప్రతి సైన్సు పరిశోధనకు అనుగుణంగా మతాన్ని మార్పు చేసుకుంటూ పోవడం సరైంది కాదని నా అభిప్రాయం'. సైన్సును ఇస్లామీకరించాలని ఇస్లాం ఛాందసవాదులు ఎలా చెబుతారో సైన్సును కాషాయీకరించాలని ఆర్‌ఎస్‌ఎస్ పరివారం అలానే చెబుతోంది.

సంతానాభివృద్ధి గురించిన సంఘ్ పరివార్ జాత్యాహంకార విశ్వాసాలను గర్భ శాస్త్ర/గృహ శంకర 'సైన్సు'గా ప్రచారం చేస్తున్నారు. తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు హిందూ మత గ్రంథాలను పఠిస్తే, భక్తి గీతాలను ఆలపిస్తే, మాంసాహారం ముట్టకుండా ఉంటే తెల్లటి రంగుతో, తెలివైన పిల్లలు పుడతారని వీరు చెబుతారు. వాస్తవానికి గర్భిణులు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని, తగినంత వ్యాయామం చేయాలని వైద్య శాస్త్రం చెబుతుంది. బిడ్డ ఎదుగుదలకు తగినన్ని మాంసకృత్తులు కావాలి. అన్ని రకాల పోషకాలు ఉండే సమ్మిళిత ఆహారాన్ని తీసుకోవాలి. కానీ మాంసాహారానికీ తెలుపు వర్ణం, తెలివి తేటలకూ లింకు పెట్టడం వెనుక హిందూత్వ అగ్రవర్ణ అహంకారం దాగి ఉంది.

బీజేపీ ప్రభుత్వం విద్యా సంస్థల్లోనూ, శాస్త్ర సంస్థల్లోనూ కీలక స్థానాల్లో కాషాయీకరణ చెందిన వ్యక్తులను నియమించడం ద్వారా విద్యారంగాన్ని, పరిశోధనలను అహేతుక పంథాలో నడిపేందుకు ప్రయత్నిస్తున్నది. నూతన తరాల పిల్లల మనసుల్లో అశాస్త్రీయమైన, అహేతుకమైన, చారిత్రకంగా తప్పుడు విజ్ఞానాన్ని నింపేందుకు పాఠ్య పుస్తకాలను తిరగరాస్తున్నది. విశ్వ విద్యాలయాల్లో జ్యోతిష్యం, పౌరోహిత్యం, లాంటి అశాస్త్రీయమైన కోర్సులను ప్రవేశపెడుతున్నది.

బీజేపీ ప్రభుత్వ హయాంలో శాస్త్ర పరిశోధన, అభివృద్ధి తిరోగామి దిశలోకి మళ్లింది. పూర్తిగా హిందూత్వ వ్యూహాలపై ఆధారపడిన అంశాలపై పరిశోధనలను ప్రోత్సహిస్తున్నది. అలాంటి పరిశోధనలకే అధిక నిధులు సమకూరుస్తున్నది. పాంచజన్య, రామసేతు, రామాయణ మహాభారతాల చారిత్రకత కు సంబంధించిన పరిశోధనల పేరుతో భారీగా నిధులు కేటాయిస్తున్నది. యోగా వ్యవసాయం, గో మూత్ర వ్యవసాయం వంటి అశాస్త్రీయ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నది.

సైన్సు హేతువుకు వాహకంగా పనిచేస్తుంది. వివేకాన్ని వ్యక్తీకరిస్తుంది. అలాంటి సైన్సును హిందూత్వ బలంగా వ్యతిరేకిస్తుంది. ఒకవైపు తన పురాణాలకు చట్టబద్ధత కల్పించడం కోసం అది సైన్సు-టెక్నాలజీని ఉపయోగించుకుంటూనే మరోవైపు సైన్సునూ, శాస్త్రీయ దృక్పథాన్ని వ్యతిరేకిస్తుంది. హేతుబద్ధత, విమర్శనా దృష్టి ఆధునిక ప్రపంచ దృక్పథంలో కీలకాంశాలు. ఈ రెంటినీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రవచించే 'హిందూత్వ సిద్ధాంతం' విస్మరిస్తుంది, తిరస్కరిస్తుంది. శాస్త్ర విజ్ఞాన ఫలితాలైన సాంకేతిక ఉత్పత్తులను అంటే టెక్నాలజీని ఆరాధిస్తుంది. సముపార్జించుకోడానికి ఆరాటపడుతుంది. అదే సమయంలో ప్రతి భావాన్నీ, ప్రతి విశ్వాసాన్నీ విమర్శనాయుతంగా ప్రశ్నించే అవకాశాన్ని పూర్తిగా మూసేస్తుంది. ప్రశ్నించే తత్వాన్ని చంపేయడమంటే సైన్సు అభివృద్ధికి దారులు మూసేయడమే.

### ఆధునిక విజ్ఞాన శాస్త్రమంతా ప్రాచీన భారత గ్రంధాల్లో ఉన్నాయని వాదించడం

2014లో నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మోడీతో సహా ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు చేసిన కొన్ని ప్రకటనలు చూద్దాం!

- ప్రధాని 2015లో ముంబయిలో జరిగిన వైద్య నిపుణుల సదస్సులో మాట్లాడుతూ మన దేశంలో ప్రాచీన కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ తెలుసుననీ, వినాయకుడు ప్లాస్టిక్ సర్జరీ చేయడం వల్ల అలా ఏర్పడ్డాడని, మహాభారతంలో కర్ణుడు జనిటిక్ ఇంజనీరింగ్ వల్ల పుట్టాడని చెప్పారు.
- హర్ద్వార్‌కు చెందిన బీజేపీ ఎంపీ లోక్‌సభలో మాట్లాడుతూ "లక్షల సంవత్సరాల క్రితమే రుషి కణాదుడు అణ్వస్త్ర పరీక్ష జరిపాడు" అని చెప్పుకొచ్చారు.
- కేంద్ర మంత్రి ('ఆయుష్' శాఖ) శ్రీపాద్ నాయక్ 2016లో బెంగళూరులోని స్వామి వివేకానంద యోగా అనుసంధన సంస్థాన్లో ఒక రకమైన యోగా చేస్తే క్యాన్సర్ తగ్గిపోతుందని చెబుతూ దాన్ని తాను నిరూపిస్తానన్నారు.
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలో హిందీ దివస్ సభలో మాట్లాడుతూ క్వాంటమ్ ఫిజిక్స్ వార్నర్ హీసెన్ బర్గ్ రూపొందించిన అస్థిరతా సిద్ధాంతం (థియరీ ఆఫ్ అన్సర్టెనిటీ) వేదాల నుంచి తస్కరించిందేనన్నారు. రవీంద్రనాథ్ ఠాగోర్‌తో హీసెన్‌బర్గ్ వేదాల గురించి జరిపిన చర్చల సందర్భంగా ఆయన ఈ సూత్రం పసిగట్టేశాడని మంత్రి 'వెల్లడించారు'.
- 2015 జనవరిలో జరిగిన 102వ భారత సైన్సు కాంగ్రెస్‌లో ఏకంగా 'ప్రాచీన భారత సైన్సు' అనే ఒక ప్రత్యేక సభ ఏర్పాటు చేశారు. వేలాది ఏళ్ల క్రితమే భారతదేశంలో విమానాలు తయారు చేసేవారని బీజేపీ నాయకులు ఆ సభలో పేర్కొన్నారు. ఈ విమానాలు ఏ కొలతల్లో ఉండేవో

చెబుతూ కాషాయ సిద్ధాంతవేత్తలు పత్రం ప్రవేశపెట్టారు. ఇవి భూమ్మీద ఒక చోటి నుంచి మరోచోటికి వెళ్లడమే కాదు అంతరిక్షంలో కూడా ఒక గ్రహం నుంచి మరో గ్రహానికి విహరించేవని 'వెల్లడించారు'. ఆ విధంగా సైన్సు మహాసభను వాళ్లు ఒక తమాషాగా మార్చేశారు.

- ఈ సైన్సు కాంగ్రెస్‌లో ఒక వక్త మాట్లాడుతూ రెండు నిమిషాలు శంఖాన్ని పూరిస్తే ఆ శబ్దం అనేక మానవ రుగ్మతలను నయం చేస్తుందని చెప్పాడు.
- మరో వక్త 'శివుడు ప్రపంచంలోనే అతి గొప్ప పర్యావరణ వాది' అని చెబితే.. ఇంకో వక్త అయస్కాంత క్షేత్ర పరిజ్ఞానం న్యూటన్‌కన్నా 1500 సంవత్సరాల ముందే మన శాస్త్రాల్లో ఉందని సెలవిచ్చాడు. సైన్సు కాంగ్రెస్‌లో ఇలా జరిగింది. కాబట్టే భారత సంతతి అమెరికన్ నోబెల్ బహుమతి గ్రహీత వి.రామకృష్ణన్ ఈ సభను ఒక సర్కస్‌గా వర్ణిస్తూ, తాను భవిష్యత్తులో ఇటువంటి సభలకు రానని చెప్పి అమెరికా వెళ్లిపోయారు.

గుజరాత్‌లో ఏకంగా పురాణాలనే సైన్సుగా మార్చేసి బోధిస్తున్నారు. భారతీయ సంస్కృతిలోని 'వాస్తవాలు' అనే పేరుతో ప్రతి విద్యార్థి చదవాల్సిన అనుబంధ పాఠ్య పుస్తకాలను అక్కడి ప్రభుత్వం అచ్చొత్తించింది. అందులో చెప్పిన ఒక 'సైన్సు' సంగతి చూడండి!

"స్టెమ్‌సెల్ పరిశోధన తామే చేశామని అమెరికా చెప్పుకుంటోంది. కానీ శరీర భాగాలు పునఃసృష్టి చేసే పేటెంట్‌ను డాక్టర్ బాలకృష్ణ గన్‌పత్ మతపుర్కార్ ఇప్పటికే పొంది వున్నారు. నిజానికి ఈ పరిశోధన ఇప్పటిది కాదనీ, దీన్ని మహాభారతం నుంచి డాక్టర్ మతపుర్కార్ గ్రహించారని వింటే మీరు ఆశ్చర్యపోతారు. కుంతికి సూర్యునిలాంటి వెలుగునిచ్చే కొడుకుండేవాడు. రెండేళ్ల నుంచి గర్భం దాల్చని గాంధారికి ఈ విషయం తెలిసింది. ఆమె గర్భవతి అయింది కానీ అబార్షన్ అయింది. ఆమె కడుపు నుండి పెద్ద మాంసపు ముద్ద బయట కొచ్చింది. ఇది తెలిసి మహర్షి ద్వైపాయన సహాయం కోరారు. ఆయన ఈ మాంసానికి కొన్ని ఔషధాలు కలిపి చల్లని కుండలో పెట్టాడు. తరువాత ఆ మాంసం ముద్దను తీసి నూరు భాగాలు చేసి, ఒక్కో భాగాన్ని నేతితో నిండిన ఒక్కో కుండలో పెట్టాడు. రెండేళ్ల తరువాత అందులో నూరుగురు కౌరవులు తయార య్యారు. ఇది చదివిన తరువాత స్టెమ్సెల్స్ తన పరిశోధన కాదని మహాభారత సమయంలోనే వున్నదనీ మతపుర్కార్ తెలుసుకు న్నాడు'. గుజరాత్‌లోని బడిపిల్లలచేత బలవంతంగా చదివిస్తున్న తేజోమయ భారత్ పుస్తకం 92-93 పేజీల్లో ఈ విషయం రాశారు.

ఆర్ఎస్ఎస్ దేశవ్యాపితంగా నడుపుతున్న పాఠశాలల నెట్వర్క్ 'విద్యాభారతి' ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన దీనానాథ్ బత్ర ఈ పుస్తకాన్ని ఇంకా ఇటువంటి అనేక పుస్తకాలను రాశారు. కానీ శరీరభాగాల పేటెంట్ పొందినట్లు ఆయన చెబుతున్న డాక్టర్ గన్పత్ మతపుర్కార్ ఎంతటి శాస్త్రవేత్తో తెలుసుకుందామంటే ఆయన గురించిన సమాచారం ఏదీ ఎక్కడా దొరకడం లేదు.

> **బత్రా గారు పాఠ్య పుస్తకాల్లో ఆటోమొబైల్ పుట్టుక గురించి మరో పురాణగాథ రాశారు. మోటార్ కారు వేదకాలంలోనే ఉందని, దాన్ని అనశ్వరథం అని రుగ్వేదంలో పిలిచారని రాశారు. "సాధారణంగా రథాన్ని గుర్రాలు లాగుతాయి. కానీ అనశ్వరథం అంటే గుర్రాలు లేకుండా యంత్రంతో నడిచే రథం అన్నమాట. దాన్నే మనం ఈనాడు మోటారు కారు అంటున్నాం. దాన్ని రుగ్వేదం అనాడే పేర్కొంది" అని ఆయన చెప్పారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్ 'యోగా వ్యవసాయం' గురించి 'కనిపెట్ట'గా, కాషాయ 'వ్యవసాయ శాస్త్రవేత్త' సుభాష్ పాలేకర్ ఆవు మూత్రంతో వ్యవసాయం 'కనిపెట్టా'రు.**

ప్రధానమంత్రి, మంత్రులతో సహా అధికార పార్టీ నాయకులు, వారి అంతేవాసులు ప్రచారం చేస్తున్న ఈ విషయాలన్నీ పూర్తిగా అశాస్త్రీయమైనవి. ఎందుకంటే అవి శాస్త్రీయ పరిశోధన పద్ధతికి నిలవవు. వాటిని ఎక్కడా, ఎవరూ పరిశోధించలేదు. పేరెన్నిక గన్న ఏ శాస్త్ర పరిశోధన గ్రంథంలోనూ ప్రచురించబడలేదు. శాస్త్రీయ సమీక్ష (పీర్ రివ్యూ)కు నిలవలేదు. కేవలం మన పురా ణాల్లోనూ, ప్రాచీన గ్రంథాల్లోనూ పేర్కొన్న పదాలను తీసుకు వచ్చి, వాటి చుట్టూ కథలు అల్లి సైన్సుగా ప్రచారం చేస్తున్నారు. మత చిహ్నాలకు, మత నమ్మకాలకు విలువ కల్పించడం కోసం అశాస్త్రీయమైన వాటికి శాస్త్రీయత ముద్ర వేస్తున్నారు. హిందూ నాగరికత అధిపత్యాన్ని నిరూపించే ఆరాటంలో వారు పురాణాలకూ, శాస్త్ర విజ్ఞానానికీ మధ్య ఉన్న తేడాను చెరిపి వేస్తున్నారు. మనం దేశంలో గతంలో జరిగిన శాస్త్ర పురోగతిని వారు కల్పితాలు, మూఢాచారాలతో కలగలిపేస్తున్నారు. ప్రాచీన పౌరాణిక కల్పితాలను, ఆధునిక పరిశోధనల ద్వారా అభివృద్ధి చెందిన శాస్త్ర విజ్ఞానాన్ని సమానం చేయడం ద్వారా వారు ప్రజలలో తీవ్రమైన గందరగోళం సృష్టిస్తున్నారు. వేదాల్లోనే గణితం ఎంతగానో అభివృద్ధి చెందిపోయిందన్న తప్పుడు ప్రచారంతో నేడు "వేద గణితశాస్త్రాన్ని" విశ్వ విద్యాలయాల్లో కూడా ప్రవేశ పెడుతున్న కాషాయ పరివారం నిజానికి ఆ తరువాతి కాలంలో భారతదేశంలో అభివృద్ధి చెందిన గణిత శాస్త్రాన్ని, సైన్సు గురించి పట్టించుకోవడం లేదు. ❑


# 'మార్వాడీ గోబ్యాక్' జాతి సమస్య కాదు, దోపిడీ సమస్య !



- ఎన్.వేణుగోపాల్

రాష్ట్రం పదిహేను రోజులుగా 'మార్వాడీ గో బ్యాక్' నినాదంతో అట్టుడుకుతున్నది. ఇందులో 'మార్వాడీ' అనేమాట రాజస్థాన్ లోని మార్వార్ ప్రాంతం నుంచి వచ్చిన వారు అని మాత్రమే కాదు. రాజస్థాన్‌లోని ఇతర ప్రాంతాల నుంచి, గుజరాత్ నుంచి మొత్తంగా ఉత్తరాది నుంచి తెలంగాణకు చేరి, ప్రధానంగా వ్యాపార రంగంలో వున్న అనేకమంది ఈ నినాదానికి లక్ష్యం. ఆ రకంగా 'మార్వాడీ' అనేది సర్వనామం. కొంత కాలంగా ఇటువంటి వ్యాపార వర్గాలు తెలంగాణలో కేవలం ఆర్థిక, వ్యాపార రంగాలకు మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలను ఆక్రమిస్తుండడం ప్రస్తుత ఆగ్రహానికి కారణం. వారి వల్ల తమ వ్యాపార, ఆర్థిక ప్రయోజనాలు దెబ్బ తింటున్నాయని మొదట తెలంగాణ వ్యాపార వర్గాలలో మొదలైన ఆందోళన, క్రమంగా వారి సామాజిక, సాంస్కృతిక, రాజకీయ విస్తరణ వల్ల అన్ని వర్గాలలోకి ప్రవహించింది. ముఖ్యంగా తెలంగాణ అస్తిత్వ పోరాటంలో పాల్గొన్న అనేక సమూహాలు ఈ ఆగ్రహంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. ఉత్తరాది ఆధిపత్యం గురించి, ద్రావిడ అస్తిత్వ ఆత్మాభిమానం గురించి ఎప్పటి నుంచో మాట్లాడుతున్న విడుతలై చిరుతైగల్ కచ్చి (వీసీకే) కూడా ఈ ఉద్యమంలో ఉన్నది. క్రమంగా ఈ ఉద్యమం విస్తరిస్తున్నది.

ఈ నినాదం తెలంగాణలో రాజకీయ విభజనను పైకి తెచ్చి, తెలంగాణ బిడ్డలలోనే కొందరు, ముఖ్యంగా సంఘ్ పరివార్ భావజాలంలో ఉన్నవారు, ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు ఈ నినాదాన్ని వ్యతిరేకిస్తూ 'మార్వాడీల' తరఫున వకాల్తా తీసుకోవడం మొదలయింది. మార్వాడీ సంఘాల పెద్దలు రంగంలోకి దిగి తెలంగాణ ప్రజలకు తమలా కష్టపడేతత్వం లేదని, వెయ్యి, రెండు వేలు సంపాదించినా తాగి పడుకుంటారని అవమానకరంగా మాట్లాడుతున్నారు. కొందరు మరింత ముందుకు వెళ్లి మార్వాడీ గో బ్యాక్ ఉద్యమ నాయకుల మీద బూతుల ప్రయోగం చేస్తున్నారు. తెలంగాణ గౌపుత్ర సంఘం అనే విచిత్రమైన పేరు గల ఒక మార్వాడీ వ్యాపారి, ఇటువంటి బూతులతోపాటు, 'అందరికీ మేం ఫండ్ ఇస్తాం' అని డబ్బు పొగరు వినిపించాడు. మార్వాడీలు మాత్రమే దోపిడీ చేస్తున్నారా, బహుళజాతి సంస్థల దోపిడీ కనబడడం లేదా అని మరికొందరు పోటీ పెట్టి అసలు సమస్యను తక్కువ చేస్తున్నారు. దేశ పౌరులు ఎవరైనా ఎక్కడికైనా వెళ్లి ఉండవచ్చునని చెప్పే రాజ్యాంగం




అమలయ్యే చోట అటువంటి 'విభజన నినాదాలు' ఇవ్వవచ్చునా అని ప్రశ్నిస్తున్నారు. ఎవరో ఒకరిద్దరు చేసిన తప్పుకు జాతినంతటిని బాధ్యురాలిని చేసి ఆ జాతికి వ్యతిరేకంగా తెలంగాణ జాతిని రెచ్చగొట్టవచ్చునా అని కొందరు అడుగుతున్నారు. మొన్నటిదాకా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఉండి, భాష ఒకటే అయినప్పటికీ 'ఆంధ్రా గోబ్యాక్' అని నినాదం ఇచ్చిన వాళ్లలో కొందరు ఈ 'మార్వాడీ గోబ్యాక్' నినాదాన్ని తప్పు పడుతున్నారు.

మొత్తం మీద ఈ గందరగోళపు సమస్య చినికి చినికి గాలి వాన అవుతున్నది. ఎప్పుడైనా ఒక పరిణామం ఒక దశకు వచ్చినప్పుడు అదేదో హఠాత్తుగా జరిగిందని చాలా మంది భావిస్తారు. కాని, ప్రకృతిలో, సమాజంలో ఇటువంటి దశలు హఠాత్తుగా ఏమీ రావు. ఎంతో కాలంగా ఆ పరిణామం నిశ్శబ్దంగా, పైకి కనబడకుండా జరుగుతూ జరుగుతూ ఏదో ఒక ఘటన దగ్గర విస్ఫోటనం జరుగుతుంది.

తత్వశాస్త్ర పరిభాషలో పరిమాణాత్మక మార్పు గుణాత్మక మార్పుగా మారే ఘటనగా, బిందువుగా దాన్ని గుర్తిస్తారు. నిశితంగా పరిశీలిస్తే ఆ బిందువు మిగిలిన అన్ని బిందువుల లాంటిదే అయినా, హఠాత్తుగా ఆ బిందువు దగ్గరే విస్ఫోటనం జరిగినట్టు అనిపిస్తుంది. ఉదాహరణకు నీటిని వేడి చేస్తున్నప్పుడు ఒక్కొక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుతూ పోతుంది. తొంభై ఎనిమిది డిగ్రీల నుంచి తొంభై తొమ్మిది డిగ్రీలకు

ఉష్ణోగ్రత మారినప్పుడు నీరు యథాతథంగానే ఉన్నట్టు అనిపిస్తుంది. తొంబై తొమ్మిది డిగ్రీల నుంచి వంద డిగ్రీలకు మారడం అటువంటి మార్పే. అంతకుముందు జరిగినలాంటి ఒక్క డిగ్రీ పెరుగుదలే. కాని, ఆ ఒక్క డిగ్రీ పెరుగుదలే ఇప్పుడు మాత్రం నీటిని ద్రవ స్థితి నుంచి వాయు స్థితికి మార్చి, ఆవిరికి కారణమవుతుంది.

సరిగ్గా అట్లాగే మోండా మార్కెట్ సంఘటన, ఆమనగల్లు పరిణామాలు, తెలంగాణ గాయకుల మీద దాడులు తెలంగాణలో 'మార్వాడీల' పట్ల ఎంతో కాలంగా పేరుకుంటూ వస్తున్న వ్యతిరేకత పెటిల్లున ఉద్యమ రూపం తీసుకునే గుణాత్మక మార్పుకు లోను చేశాయి. రోడ్డు మధ్యలో, ట్రాఫిక్‌ను అడ్డగిస్తూ ఎవరైనా కారు ఆపితే, దారిన పోయేవాళ్లు కారును పక్కకు తీయమని మర్యాదగానో, విసుగుగానో చెప్పడం నగరంలో రోజుకు వెయ్యిసార్లయినా జరుగుతుండవచ్చు. కాని మోండా మార్కెట్‌లో అటువంటి సాధారణమైన హెచ్చరిక చేసిన వారి మీద దాడి చేసినా మార్వాడీ, జైన్ వ్యాపారులు పిడిగుద్దులు గుద్దారు, 'కమ్ జాత్ వాలే' అని తిట్టారు. ఆ ఘటన తెలంగాణ దళిత, బహుజనులకూ మార్వాడీలకూ మధ్య వైరుధ్యాన్ని బైటికి తీసుకువచ్చింది.

దాదాపుగా అదే సమయంలో రాష్ట్రంలో అనేక చిన్న పట్టణాలలో జరుగుతున్నట్టుగానే, ఆమనగల్లులో 'మార్వాడీ' వ్యాపారులకు, స్థానిక వ్యాపారులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఒకరితో ప్రారంభమై ఆరుగురు కావడం, నాణ్యత లేని సరుకులు తక్కువ ధరలకు అమ్ముతూ, స్థానిక వ్యాపారుల వ్యాపారాలు దెబ్బ తీయడం, దుకాణాలలో పని చేయడానికి తమ వాళ్లనే తెచ్చుకుని స్థానికుల ఉపాధి అవకాశాలు కొల్లగొట్టడం వంటి అనేక సమస్యలను ఆమనగల్లు వ్యాపారస్తులు ఎత్తిచూపారు. నిజానికి ఇవి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి చిన్నా పెద్ద పట్టణాలలో ఉన్నవే. ఆమనగల్లు వ్యాపారస్తులు ఆగస్ట్ 18న బంద్ పిలుపు కూడా ఇవ్వగా, పోలీసులు, సంఘ్ పరివార్ నాయకులు ఒత్తిడి తెచ్చి ఆ బంద్‌ను వాయిదా వేయించారు.

ఈ ఉద్యమం కళారూపాల్లో, ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో పాటల్లో వ్యక్తం కావడంతో గాయకులు గోరేటి రమేష్, తెలంగాణ శ్యామల మీద మార్వాడీ వ్యాపారస్తుల నుంచి, పోలీసుల నుంచి దాడులు జరిగాయి.

ఈ విస్తృత, సంక్లిష్ట నేపథ్యంలో 'మార్వాడీ' సమస్య గురించి ఆలోచించవలసిన లోతైన కోణాలు ఎన్నో ఉన్నాయి. ఉద్యమ నినాదం వల్ల ఇది 'మార్వాడీలందరినీ' వెళ్లిపొమ్మంటున్నట్టు అపార్థాలు వచ్చే అవకాశం ఉంది గనుక వివరించాలి. ఈ సమస్య కేవలం స్థానిక వ్యాపారులది మాత్రమేననే అపోహ వల్ల, స్థానిక వ్యాపారులతో మాత్రం తెలంగాణకేమి ఒరిగింది అనే ప్రశ్నతో ఉద్యమాన్ని సందేహించే అవకాశం ఉంది గనుక, ఈ సమస్య ఆర్థిక, వ్యాపార పరిధిని దాటి ఎట్లా సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలకు, తెలంగాణ అస్తిత్వానికి వ్యాపిస్తున్నదో వివరించాలి. ఈ 'మార్వాడీ' సమస్యలో తెలంగాణ వనరుల దోపిడీ, ఉత్తరాది మతోన్మాద సంస్కృతిని, ఆచారాలనూ తెలంగాణ మీద రుద్ది తెలంగాణ ప్రత్యేక అస్తిత్వాన్ని రద్దు చేసే ప్రయత్నం, తెలంగాణ ప్రజల అవకాశాలు కొల్లగొట్టే ప్రయత్నం, చివరికి దశాబ్దాలపాటు పోరాడి సాధించుకున్న స్వీయ రాజకీయ ఆత్మగౌరవ ప్రకటనను చెరిపేసే ప్రయత్నం ఉన్నాయి.


మొట్టమొదట గుర్తించవలసిన అంశం ఇది పేద, మధ్యతరగతి మార్వాడీలకు వ్యతిరేకం కాదు. అటువంటి పేద, మధ్య తరగతి మార్వాడీలు, తమ ఎడారి ప్రాంతంలో బతుకుదెరువు లేక ఒక రకంగా పొట్ట చేత పట్టుకుని దశాబ్దాల కింద తెలంగాణ వచ్చి చిన్న పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో, నగరంలో చాట్ భండార్ ల నుంచి స్వీట్ షాపుల దాకా, కిరాణా, బట్టలు, బంగారం, ఆభరణాల దుకాణాల నుంచి తాకట్టు దుకాణాల దాకా పెట్టుకుని స్థిరపడ్డారు. వారివల్ల స్థానిక వ్యాపారులు, చేతి వృత్తులు దెబ్బ తిన్నాయి గాని వారు ఒకరకంగా తెలంగాణ జన జీవనంలో, సంస్కృతిలో భాగమయ్యారు. అటువంటి వేలాది మందికీ, గత మూడు దశాబ్దాలలో, మరీ ముఖ్యంగా 2014 తర్వాత వచ్చినవారికీ కచ్చితమైన తేడా ఉంది. ఈ రెండో తరహా వారిలో మార్వార్ ప్రాంతం వారు మాత్రమే లేరు. రాజస్తాన్‌లోని మిగిలిన ప్రాంతాల వారు, గుజరాతీలు, సింధీలు, తదితరులు కూడా ఉన్నారు. వీరు ప్రతి సరుకు టోకు వ్యాపారంలో పాతుకుపోయారు. తమ ప్రాంతం నుంచి బంధు మిత్రులను పిలిపించి, పెట్టుబడులు పెట్టి, పరపతి మీద సరుకులు ఇచ్చి చిల్లర వర్తకాన్ని దురాక్రమించడం ప్రారంభిం చారు. ఉత్పత్తిదారులలో ఎక్కువ మంది 'మార్వాడీలే' గనుక సరఫరా గొలుసులో అన్నీ స్థానాలలోనూ తమవారినే నింపుకు న్నారు. అలా వ్యాపారాల విస్తరణతో పోగుబడిన విపరీతమైన సంపదను రియల్ ఎస్టేట్‌లోకి తరలించారు. తెలంగాణలో, ప్రత్యేకించి హైదరాబాద్‌లో చెప్పుకోదగిన ఆస్తులు సమకూర్చు కున్నారు.

అప్పటివరకూ వ్యాపారస్తులందరి లాగే అన్ని రాజకీయ పార్టీలకూ విరాళాలు ఇస్తుండిన వీరి లోపలి సంఘ్ పరివార్ భావజాలం 2014 తర్వాత వెయ్యి పడగలు విప్పడం మొదలైంది. ఆ తర్వాత అక్కడి నుంచి వలసలు పెరిగాయి. తమ రాజ్యం వచ్చిందన్నట్టుగా ఉత్తరాది పండుగలకూ, మతోన్మాద సందర్భాలకూ ఉత్సవాలు జరపడం, ఏడాదికి కనీసం ఆరు ఏడు బహిరంగ ప్రదర్శనలకు కోట్లాది రూపాయలు వెచ్చించి తమ ప్రభావ పరిధి పెంచుకోవడం, తెలంగాణ సాంస్కృతిక ఉత్సవాలలో కూడా చొరబడడం మొదలుపెట్టారు. ఈ ఉత్సవాల సందర్భంలోనూ, ఇతర పద్ధతులలోనూ మార్వాడీ, ఉత్తరాది, సంఘ్ పరివార్ సంస్కృతి **(మిగతా 31వ పేజీలో..)**

# లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతి-సాహిత్యం


('సమూహ' తొలి రాష్ట్ర మహాసభ, మహబూబ్‌నగర్
14-12-2024లో చేసిన కీలకోపన్యాసం పాఠం)

- కల్లూరి భాస్కరం



**అందరికీ నమస్కారం..**

'లౌకిక ప్రజాస్వామిక సంస్కృతి-సాహిత్యం' అనే ఈ ప్రసంగాంశమే ఓ మహా సముద్రం. లౌకికవాదం-ప్రజాస్వామ్యం-సాహిత్యం అనే మూడింటిలో వేటికి వాటికే విస్తారమైన పరిణామచరిత్ర ఉంది. కనుక ఆ సముద్రంలో కాస్తంత జాగాను ఎంచుకుని నాకిచ్చిన సమయంలో ఎంతో కొంత ఈదడానికి ప్రయత్నిస్తా. ఎంత వరకు న్యాయం చేస్తానో చెప్పలేను. విషయాన్ని మూడు శీర్షికల కింద విభజించుకుని మాట్లాడాలని అనుకుంటున్నా. మొదటిది వర్తమానం. రెండోది గతం. మూడోది భవిష్యత్తు.



## వర్తమానం

వర్తమానం నుంచి మొదలు పెడతాను. వెనకటి నూటపదేళ్ళ అనుభవంతో పోలిస్తే ఇప్పుడు మనం భిన్నమైన అనుభవాన్ని ఎదుర్కొంటున్నాం. భిన్నమైన ఫేజ్‌లో గడుపుతున్నాం. ఈ ఫేజ్ గురించిన స్పష్టమైన స్పృహలో మనం జీవించడం ప్రారంభించి పదేళ్ళు అయింది. మీరంతా ఏమనుకుంటున్నారో నాకు తెలియదు. నేను ఎగ్జాగరేట్ చేస్తున్నానేమో కూడా నాకు తెలియదు. ఇది మన దేశాన్ని, మన సమాజాన్ని, మన జీవితాన్ని మౌలికంగానే కొత్త మలుపు తిప్పిన ఫేజ్‌గా నాకనిపిస్తోంది.

అయితే ఇక్కడొక వివరణ ఇచ్చుకోవాలి. గత నూటపాతికేళ్ళ చరిత్ర నుంచి, అనుభవం నుంచి చూసి దీనిని కొత్త ఫేజ్ అంటున్నాను కానీ, ఇది కొత్త ఫేజ్ ఏమీ కాదు. ఈ ఫేజ్‌లో, లేదా ఇలాంటి ఫేజ్‌లో వందలు, బహుశా వేల సంవత్సరాలు జీవించిన అనుభవం మన దేశానికి ఉంది. అలా చూసినప్పుడు గత నూట పదేళ్ళ అనుభవాన్నే ఒక కొత్త ఫేజ్‌గా చెప్పుకోవాలి.

ఇదెలాంటిదంటే మహా భారతంలోని ఓ ఉదంతం అస్పష్టంగా గుర్తొస్తోంది. పాండవులు మహాప్రస్థానం చేసిన తర్వాత ధర్మరాజును దేవదూతలు స్వర్గానికి తీసుకెళ్లారు. అక్కడ అతనికి దుర్యోధనుడు కనిపించాడు తప్ప కర్ణుడు, భీమార్జున నకుల సహదేవులు కనిపించలేదు. దీంతో ధర్మరాజు బాధపడి వాళ్ళను చూడాలనుకున్నాడు. ఇంద్రుడు నారదుని వెంట అతన్ని నరకానికి పంపించాడు. ధర్మరాజు నరకంలో ఉన్న ఆ కాస్త సేపూ అక్కడ రకరకాల శిక్షలు అనుభవిస్తున్న వారికి మండు వేసవిలో మలయమారుతంలా హాయి గొలిపిందట. మరికొంత సేపు అక్కడే ఉండమని వారు ధర్మరాజును ప్రార్థించారట.

అలాగని, గత పదేళ్ల వెనకటి, నూటపదేళ్ల అనుభవాన్నీ పూర్తిగా మలయమారుత మనడంలేదు. అప్పుడు చూడాల్సిన నరకాలను అప్పుడూ చూశాం. అలాగే, అంతకుముందు వందలు, వేల సంవత్సరాలపాటు మన దేశ జీవనానుభవాన్ని పూర్తిగా నరకప్రాయమనీ అనడంలేదు. గత పదేళ్ళ అనుభవాన్నీ ఒక ప్రత్యేకమైన ఫేజ్‌గా చెప్పి హైలెట్ చేయడమే ఇక్కడ నా ఉద్దేశం.

సమూహా-సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ అనే పేరే చూడండి. ఆశ్చర్యంగా ఆ పేరే గత పదేళ్ల అనుభవాన్ని చెబుతుంది. పదేళ్ళకు ముందు సెక్యులర్ పేరుతో ఒక రచయితల వేదికను ఏర్పాటు చేయాలనే ఆలోచనైనా మనకు వచ్చిందా? రావడానికి అవకాశముందా? సాహిత్యం వైపు నుంచే చెప్పుకుంటే, 19వ శతాబ్దిలో గురజాడతో మొదలైన సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యమనుకున్నాం. 1930 దశకంలో మొదలైన ఒక సాహిత్య పరిణామాన్ని అభ్యుదయ సాహిత్యమనీ, ప్రగతిశీల సాహిత్యమనీ అనుకున్నాం. ఆ తర్వాత 60 దశకంలో మొదలైన మరొక సాహిత్య పరిణామాన్ని విప్లవ సాహిత్యంగా గుర్తించాం. ఆ తర్వాతి దశకాలలో పుంజుకున్న మరికొన్ని పాయలను స్త్రీవాద సాహిత్యంగా, దళిత సాహిత్యంగా, బహు జనవాద సాహిత్యంగా చెప్పుకున్నాం.

వందేళ్లను మించిన ఇలాంటి సాహిత్య వర్గీకరణలలో సెక్యులర్ లేదా లౌకికవాద దృక్కోణం నుంచి సాహిత్యం గురించి మాట్లాడుకునే మరో వేదికను సృష్టించాలనే ఆలోచన ఈ పదేళ్లలోనే ఎందుకు రావలసివచ్చింది ?

చెప్పుకోడానికి కొంత ఇబ్బందిగానూ, సిగ్గుగానూ ఉంటుంది

కానీ, ఇందులో మన నూరేళ్ళ వైఫల్యం ఉంది. మనం అన్నప్పుడు అందులో లౌకిక, ప్రగతి శీల వాదాల వైపు మొగ్గు చూపే సాహిత్యకారులు, రాజకీయవాదులు, వివిధ రంగాలకు చెందిన మేధావులతో సహా అందరూ వస్తారు.

మనం ఈ పరిణామాన్ని ఊహించలేకపోయాం. ఆధునికతతో మొదలైన మన ప్రయాణం పైన చెప్పుకున్న వివిధ మజిలీల మీదుగా సరళరేఖలా ముందుకే సాగుతోందని భ్రమించాం. దానికి మతతత్వం రూపంలో పెద్ద అడ్డుకట్ట ఎదురవుతుందని ఊహించలేకపోయాం. సాంప్రదాయిక శక్తులు ఓడిపోయి పక్కకు తప్పుకున్నాయని అనుకున్నాం కానీ, అవి గత నూరేళ్ళకు పైబడిన కాలంలో రహస్యంగా ఉద్యమస్థాయిలో అంగబలాన్ని, అర్థబలాన్ని సమీకరించుకుంటూ బలపడుతూ వస్తున్న సంగతిని గమనించలేకపోయాం. మన మధ్యలోనే, మన చుట్టూనే, మన పక్కనే, ఇంకా చెప్పాలంటే మన ఇంట్లోనే ఉన్న మనుషుల్లో అంతవరకూ నిద్రాణంగా ఉన్న మతభావన మేలుకొని ఉగ్రరూపం ధరిస్తుందని పసిగట్టలేకపోయాం. ఇది సమష్టి వైఫల్యం.

**గతం**

ప్రసంగ విషయంలో లౌకికం–ప్రజాస్వామ్యం–సాహిత్యం అనే మూడు అంశాలున్నాయి. వీటిలో లౌకికవాదం, ప్రజాస్వామ్యమనే భావనలు ఆధునికతతోనే వచ్చాయనుకుంటాం కానీ, రూపభేదంతో ఇవి ప్రాచీనకాలం నుంచీ ఉన్నాయి. రాజూ, చక్రవర్తి రూపంలోని వ్యక్తిపాలనకు ముందు గణదశలో సమష్టి పాలన ఉండేదని మనకు తెలుసు. గణతంత్రమనే మాట ఇప్పుడూ ప్రచారంలోనే ఉంది. గణదశలో ప్రజాస్వామ్యం ప్రాథమిక రూపంలో కనిపిస్తుంది. అలాంటి ఒకానొక పరివర్తన చరిత్రే లౌకికవాదానికీ ఉంది. ఎగువరాతి యుగం నుంచీ చూస్తే, వేట–ఆహారసేకరణ దశలో ఉన్న మనిషి దృష్టిలో లౌకికం, పారలౌకికం అనేవి విడివిడిగా లేవు. ప్రతి లౌకికచర్యా అలౌకికరూపం తీసుకుని అలౌకికంగానే వ్యక్తమవుతుంది. విలియం ఇర్విన్ థామ్సన్ అనే రచయిత The Time Falling Bodies Take to Light: Mythology, Sexuality & the Origins of Culture పుస్తకంలో దీని గురించి రాస్తాడు. "వేట ఆహారసేకరణ జనాల సంస్కృతిలో మతం అవసరమే లేదు. వారి సంస్కృతే ఆధ్యాత్మికత మూర్తీభవించినది. అందులో ప్రతి ఘటనా ఒక కథగా మారుతుంది. ప్రతి ఒక్క భాగమూ అఖండం(whole)తో అనుసంధానమై ఉంటుంది. ప్రతి ఒక్క చర్యలోనూ అలౌకికత నిండి ఉంటుంది. మొత్తం జీవనవిధానమే అలౌకికమైనప్పుడు ప్రత్యేకించి ప్రార్థనామందిరాలను నిర్మించుకోవలసిన అవసరం కానీ, ఆదివారాలలో ప్రార్థనలు జరపాల్సిన అవసరం కానీ వారి ఉండ"వంటాడు ఆయన.

అప్పటికి ప్రకృతిశక్తులకు దైవత్వాన్ని, మహిమలను ఆపాదించుకోవడమే తప్ప మనిషి రూపంలోని దేవుళ్ళను సృష్టించుకోవడం కానీ, దైవభావనను ఒకానొక మతరూపంలో, విస్తృతమైన ఆయా తంతులతో వ్యవస్థీకరించడం కానీ జరగలేదు. మన దగ్గర ఋగ్వేదంలోని తొలి మండలాలలో ఈ ఛాయలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. రామాయణ, మహాభారతాలకు వచ్చేసరికి మనిషి రూపంలోని దైవాన్ని ప్రతిష్ఠించడం కనిపిస్తుంది. పురాణాల దగ్గరికి వచ్చే సరికి మనిషి రూపంలోని దైవాన్ని ప్రతిష్ఠించడం మరింత స్పష్టరూపం ధరించింది. ఆ దేవుళ్ళ పేరుతోనే పురాణాలు వెలిశాయి. కాకపోతే, లౌకికం, అలౌకికమనే తేడా లేకుండా లౌకికాన్ని కూడా అలౌకికంగా వ్యక్తం చేసే శైలి మాత్రం కొనసాగింది.

మహాభారతం నుంచే మరో ఉదాహరణ చూడండి. పాండవులు అరణ్యవాసాన్ని ప్రారంభించినప్పుడు కొంత మంది బ్రాహ్మణులు వారితో వెడతారు. వారికి భోజనం ఎలా పెట్టాలని ధర్మరాజు తన పురోహితుని అడుగుతాడు. సూర్యుణ్ణి ప్రార్థించమనీ, అతని అనుగ్రహంతో ద్రౌపది పండించే ఆహారంతో వారికి భోజనం పెట్టమనీ పురోహితుడు చెబుతాడు. అంటే, పంట పండించి అన్నం పెట్టడమనే లౌకికచర్యకు సూర్యుని ప్రార్థించి అనుగ్రహం పొందడమనే అలౌకికచర్యను జోడించి చెప్పాడన్నమాట.

Bronislaw Malinowski అనే పురా మానవ శాస్త్రవేత్త తన 'ఆర్గొనాట్స్ ఆఫ్ వెస్టర్న్ పసిఫిక్' అనే పుస్తకంలో పసిఫిక్ దీవుల్లో ఒకటైన ట్రోబ్రియాండ్ దీవిలోని జనం గురించి రాస్తాడు. వాళ్ళు వెయ్యి మైళ్ళు దూరంలో ఉన్నా సరే, రెండేళ్ళకోసారి తమ బంధువుల్ని కలిసి కానుకలు ఇవ్వడానికి నౌకలో వెడతారు. ఒక మతపరమైన తంతులా జరుగుతుంది. ఇప్పటికీ మనలో చాలామంది నిత్యజీవనంలో లౌకికం–అలౌకికం కలిసిపోయే వ్యక్తమవుతూ ఉంటాయి.

మొదట్లో లౌకికానికీ, అలౌకానికీ తేడా పాటించకపోయినా, రెండూ గుర్తుపట్టడానికి వీలుగానే ఉంటాయి. సాహిత్యం విషయానికి వస్తే, అది మానవ సమాజాన్ని, మానవ జీవితాన్ని, మానవ సంబంధాలను, మనుషుల మధ్య వైరాలను, ప్రేమలను, వారి లౌకిక జీవితానికి సంబంధించిన అన్ని విషయాలనూ వస్తువుగా చేసుకుంటుంది. కనుక ప్రాథమికంగా అది లౌకికం కిందికే వస్తుంది. ఒకవేళ అది అలౌకికం గురించో, ఆధ్యాత్మికం గురించో చెప్పినప్పటికీ అది మనిషి లౌకిక జీవితాన్నే ఆధారం చేసుకుంటుంది.

ఉదాహరణకు, రామాయణాన్నే తీసుకోండి. రాజ్యాధికారం రాముడిదా, భరతుడిదా అన్న వివాదం తలెత్తడం, రాముడు తండ్రి ఆదేశాన్ని పాటించి భార్యతోనూ తమ్ముడితోనూ కలసి అడవికి వెళ్ళడం, రావణుడు రాముని భార్యను ఎత్తుకుపోవడం,

రాముడు అతన్ని చంపి భార్యతో కలసి తిరిగి తన రాజ్యానికి రావడం గురించి రామాయణం చెబుతుంది. ఈ మూలకథలో లౌకికమే తప్ప మన అవగాహనకు అతీతమైన అలౌకికం ఏదీ లేదు. రామాయణ కథాగమనాన్ని కనుక మనం పరిశీలిస్తే, రాముడు పుట్టడం దగ్గరి నుంచి రావణునిపై యుద్ధానికి వెళ్ళే వరకూ కథంతా లౌకిక తలంలోనే జరుగుతుంది. కాకపోతే, ఇంతకు ముందు చెప్పినట్టు లౌకికానికీ, అలౌకికానికీ తేడా పాటించని ఇతిహాస, పౌరాణిక శైలిలోనే ఆ కథను నడిపి ఉండవచ్చు. యుద్ధకాండలోకి వచ్చేసరికి ఒక ఘట్టంలో రాముణ్ణి దేవుడిగా పెంచి చూపడం కనిపిస్తుంది. దాంతో లౌకికమైన రామాయణ కథ కాస్తా అలౌకికంగా మారిపోయి మతరూపాన్ని తెచ్చుకుంది.

సరిగ్గా ఇదే పరివర్తనక్రమం మహాభారతానికీ వర్తిస్తుంది. కథ రీత్యా అది కూడా లౌకిక తలంలోకే వస్తుంది. కృష్ణుని విష్ణువు అవతారంగా చేయడం, భగవద్గీతను, విష్ణు సహస్రనామాలను చేర్చడం ద్వారా దానిని కూడా అలౌకిక తలంలోకి తీసుకెళ్లి మతరూపాన్ని ఇచ్చారు. ఇదే క్రమం హోమర్ చెప్పిన ఇలియడ్ కూ వర్తిస్తుంది.

ఇలాగే ఋగ్వేదంలోనూ లౌకిక, అలౌకిక తలాలు కలిసిపోయి కనిపిస్తూ ఉంటాయి. క్రమంగా లౌకిక తలాన్ని మరుగుపరుస్తూ అలౌకిక తలాన్ని స్థాపించి మతరూపాన్ని తెచ్చారు.

యూరప్ ప్రయోగశాలగా లౌకిక, అలౌకికాల వేర్పాటు, సెక్యులర్ అనే మాట ఆధునికతా నిఘంటువులో చేరడం మన రాజకీయ చింతనలో కూడా భాగం కావడం ప్రత్యేకించి గత పదేళ్ళలో సెక్యులర్ అనే మాటను తిట్టుపదంగా మార్చడమే కాకుండా దాని అర్థాన్ని, వివరణను సంక్లిష్టం చేయడం సెక్యులర్ అనే మాటకు బయటి నిర్వచనం మనకు వర్తించదనీ, మనది భారతీయ తరహా సెక్యులరిజం అనే కొత్త మాటను ప్రచారంలోకి తేవడం జరిగాయి.

ప్రజాస్వామ్యం గురించి ! చారిత్రకంగా చూస్తే, సమానత్వ భావన అడుగంటి అసమానత అడుగుపెట్టడం స్త్రీపై పురుషాధిపత్యాన్ని స్థాపించడంతో మొదలైంది. ఎగువ రాతి యుగం నుంచి నాగరిక యుగంలోకి వచ్చేసరికి జరిగిన పరివర్తన ఇది. యుద్ధాలు, వాటి దరిమిలా దాసదాసీ వ్యవస్థ అందులోనే పుట్టాయి. వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు వగైరాలు ఈ పరిణామం తర్వాతి కాలానికి వస్తాయి. ఋగ్వేదంలో దీని ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. పురుషాధిపత్యంతోపాటు స్వజనులు, పరజనులు అనే తేడా కనిపిస్తుంది. పరజనులను దాసులని, దస్యులని, రాక్షసులనీ అది చెబుతుంది. కొత్తరాతి యుగంలో మొదలైన యుద్ధాలను, హెచ్చుతగ్గుల సామాజిక వ్యవస్థనూ, సంచారజీవనాన్నీ అందిపుచ్చుకుని రష్యన్ స్టెప్పీల నుంచి అటు యూరప్ వైపూ, ఇటు ఆసియా వైపు సాగిన వలసలు స్థానికులపై ఆధిపత్యాన్ని, ఆక్రమణను విధించడం, ఆ ప్రక్రియకు మన దగ్గర వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు సమర్థన కూర్చడం, లౌకిక తలంలో జరిగిన ఈ మొత్తం ప్రక్రియకు మతాన్ని, ఉపనిషత్తులు, భగవద్గీత రూపంలో తాత్వికతను ఆపాదించడం జరిగింది.

ఇందులో మళ్ళీ యూరప్ అనుభవంలోనూ, మన అనుభవంలోనూ తేడాలున్నాయి. మొదటే చెప్పినట్టు ఆధునికతా దిశగా జరిగిన పరిణామంలో యూరప్ ప్రయోగశాల కావడమే కాకుండా దిక్సూచి కూడా అయింది. రెలిజియన్ అనే మాట ద్వారా మతాన్ని విస్పష్టంగా నిర్వచించడం యూరప్‌లోనే జరిగింది. ఇప్పుడు ఆ నిర్వచనం వెలుగులోనే హిందుత్వ శ్రేణులు పనిచేస్తున్నాయి తప్ప మన దగ్గర మొదటినుంచీ మతానికి స్పష్టమైన నిర్వచనం కనిపించదు. మతం అంటే అభిప్రాయం, అభిమతం, సమ్మతి, శాస్త్రం వగైరా అర్థాలు కనిపిస్తాయి. అలాగే, మతానికి ధర్మాన్ని పర్యాయపదంగా వాడడం కూడా మన దగ్గర ఉంది. ధర్మమనే మాటకు కూడా వేర్వేరు అర్థాలున్నాయి.

మనదైన స్వతంత్ర చరిత్ర ఇటీవలి కాలంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతే మొదలైంది. అంతకు ముందు బ్రిటిష్ పాలనలో, ఇంకా అంతకు ముందు ముస్లిం ఆధిపత్యంలోనూ, వాళ్ళతో పోరాటాల్లోనూ మునిగి ఉన్నాం. దాదాపు పదిహేను వందల సంవత్సరాలపాటు మనదైన అస్తిత్వానికి దూరంగా ఉండిపోయాం. మత రంగంలోనే చూస్తే, మనం క్రీస్తు పూర్వ సమాజంలోనే ఉన్నాం. అంటే, మనం పాత ప్రపంచంలోనే ఉండిపోయాం తప్ప కొత్త ప్రపంచంలోకి రానేలేదు. వచ్చే ప్రయత్నాన్ని మొదలుపెట్టి పూర్తిగా 80 ఏళ్ళు కూడా కాలేదు. కుటుంబస్థాయితో మొదలుపెట్టి దేశస్థాయి వరకూ మన మింకా ప్రజాస్వామికీకరణ కానీ, లౌకికీకరణ కానీ చెందలేదు. దేశంలోని అన్ని ప్రాంతాలూ ఇంకా ఒక టైమ్ జోన్‌లోకి రాలేదు. ఒక నేషన్ స్టేట్‌గా ఏర్పడే ప్రక్రియ పూర్తికాలేదు. సాహిత్యం సహా అన్ని మేధోరంగాలూ మానవ సంబంధాలను ప్రజాస్వామికమూ, లౌకికమూ చేసే ప్రయత్నంలోనే ఉన్నాయి.

ఇంతలోనే అజెండా మారిపోయింది. మతం అన్నింటి స్థానాన్ని ఆక్రమించుకుంది. వ్యవస్థీకృత మతాల మోడల్‌ను ఇక్కడి మెజారిటీ మతానికి పూర్తిస్థాయిలో వర్తింపజేయడం మొదలైంది. అలాగే, స్టెప్పీల నుంచి సంక్రమించిన ఆధిపత్య, ఆక్రమణల కొనసాగింపునకూ రంగం సిద్ధమవుతూ వచ్చింది. ఆధునికత ద్వారా సంక్రమించిన లౌకికవాదం, ప్రజాస్వామ్యం, వాటిని ప్రతిబింబించే రాజ్యాంగం వగైరాలను పునః పరిశీలించి సాంప్రదాయికత వెలుగులో పునర్నిర్వచించుకునే ప్రయత్నమూ

మొదలైంది. సింపుల్‌గా చెప్పాలంటే వందల వేల సంవత్సరాలకు విస్తరించిన మన గతం 15 వందల సంవత్సరాల విరామం తర్వాత ఇప్పుడు పునరుద్ఘాటించుకుంటోంది. స్టేట్ ఒక పక్షం, ఒక వాదం వైపు పూర్తిగా ఒరిగిపోవడం ఆ ఉద్ఘాటనకు శక్తినీ, అధికారాన్నీ జోడిస్తోంది.

**భవిష్యత్తు**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మనం అమలు చేసుకుంటూ వస్తున్న లౌకిక, ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని, ఈ దేశ వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అది చేసిన నిర్దేశాలను కాపాడుకోవడం ఒక్కటే ఇప్పుడు మన లక్ష్యంగా మారింది. ఈ దేశ వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగానికి రూపకల్పన చేసిన సంగతి మనకు తెలుసు. నిజానికి మనలో చాలా మందికి పదేళ్ళ క్రితం వరకూ ఈ రాజ్యాంగాన్ని, అది చెప్పే లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్నీ గట్టిగా గుర్తించి పట్టించుకోవలసిన అవసరం కనిపించలేదు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని ప్రమాణ స్వీకారం చేసే దృశ్యాలను మనం ఎప్పుడూ ఊహించుకోలేదు. రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని పెద్దగా చర్చకు తేలేదు. ఇప్పుడే తేవడంలో అవసరం అలా ఉంచి మన వైఫల్యం కూడా ఉంది. దానిని ఆమోదించక తప్పదు.

వైవిధ్యవంతమైన ఈ దేశ స్వభావం రీత్యా ఇక్కడి స్టేట్ అన్ని మతాలు, వాదాలు, ప్రాంతాలు, భాషలు, జ్ఞానాలు వగైరాలన్నిటికీ సమదూరం పాటిస్తూ తటస్థతను పాటించినప్పుడే ఇక్కడి జనజీవనంలో శాంతి, సామరస్యం ఉంటాయి. స్టేట్ ఏదో ఒక్కవైపే ఒరిగిపోయినప్పుడు వాటికి భంగం కలగడమే కాకుండా దేశం ఎప్పటిలా స్తంభించిన కాలంలో చక్రభ్రమణం సాగిస్తూ ఉంటుంది. ఈ స్థితిలో చాలాకాలం గడిపిన అనుభవం మనకు ఉంది. ఇప్పుడు అదే పునరావృతమవుతుంది. మనం ఊహించని ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలన్నది అంతిమ ప్రశ్న. గత డెబ్బై ఏళ్ల నుంచి మనం అనుసరిస్తున్న వ్యూహాలు, కార్యాచరణ, వాడుతున్న పరిభాష ఈ కొత్త పరిస్థితిని ఎదుర్కోడానికి సరిపోవని నేను అనుకుంటున్నాను. ఆ గుర్తింపు మనలో పూర్తిగా ఇంకిందా అని కూడా ప్రశ్నించుకోవాలి. సెక్యులర్ రైటర్స్ ఫోరమ్‌ను ఏర్పాటు చేయడంలో ఆ గుర్తింపు స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. దానిని మరింత విస్తృతం, బలోపేతం చేయడానికి ఏం చేయాలి, మన పరిభాష దగ్గరి నుంచీ ఎలా మార్చుకోవాలనే ఆలోచన చేయాలి. అన్ని మతాలు, ప్రాంతాలు, భాషల వారు ఒక ఉమ్మడి అజెండాతో లౌకిక, ప్రజాస్వామిక ప్రాతిపదిక మీద కలిసి పనిచేయడం తప్ప మరో పరిష్కారం లేదు. ❑ **(కొలిమి సౌజన్యంతో)**

# 'మార్వాడీ గోబ్యాక్' జాతి సమస్య కాదు

**(27వ పేజీ తరువాయి)**

తెలంగాణ సంస్కృతిని ఆక్రమించడం, తోసివేయడం, మింగివేయడం ప్రారంభమయింది. తెలంగాణకు తెలియని ఎన్నో ఆచార వ్యవహారాలు, ఆహార్యం, మూఢ నమ్మకాలు, ఆడంబరాలు తెలంగాణలో ప్రవేశించాయి. ఇప్పటికే

ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రవేశించి, విస్తరిస్తున్న ఈ 'మార్వాడీ' ఆధిపత్యం రాజకీయాల్లో ప్రవేశించడానికి ఇంకా ఒకటి రెండు అడుగులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే అన్ని పార్టీలకూ, ఉత్సవాలు జరిపే స్థానిక సంఘాలకూ విరాళాలు ఇస్తున్న ఈ మార్వాడీలు రేపు రాజకీయాధికారం చేపట్టినా కాదనలేని స్థితి మెల్లమెల్లగా పెరుగుతున్నది.

ఇవాళ్టి 'మార్వాడీ' వ్యతిరేకత ఈ చొరబాటునూ, దురాక్రమణనూ వ్యతిరేకించేది మాత్రమే గాని, బతుకుదెరువు కోసం వచ్చి, స్థానిక సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ప్రత్యేకతలను గౌరవించి, వాటిలో జోక్యం చేసుకోకుండా ఉంటున్న వారి పట్ల కాదు. 'మార్వాడీ' అనే పదం ఎందుకు వాడాలనే ప్రశ్న వస్తుంది. 'మార్వాడీ' అనే మాటలో కొంత అస్పష్టత ఉన్నమాట నిజమే. మార్వాడీ, గుజరాతీ, సింధీ, ఉత్తరాది, సంఘ్ పరివార్ దోపిడీదారులు, దురాక్రమణదారులు అని వివరంగా అనవలసిన చోట, క్లుప్తత కోసం 'మార్వాడీ అంటున్నారు. ఒకప్పుడు రాజకీయ, సామాజిక పరిభాషలోకి వచ్చి చేరిన కాబూలీవాలా, తెల్లవాడు, ఆంధ్ర మొదలైన మాటల వంటిదే ఈ మాట కూడా. కాబూల్ నుంచి వచ్చిన వారందరూ వడ్డీ వ్యాపారులూ కాదు, వడ్డీ వ్యాపారులందరూ కాబూలీవాలాలూ కాదు, కాని ఆ మాట వడ్డీ వ్యాపారులకు ప్రతీకగా మారింది. అలాగే తెల్లవాళ్లందరూ మనమీద దోపిడీకి రాలేదు, చివరికి బ్రిటన్‌లో కూడా భారతీయులకు మద్దతు ఇచ్చినవాళ్లు ఎందరో ఉన్నారు. మనను దోపిడీ చేసింది ఈస్టిండియా కంపెనీ అనే చిన్న వ్యాపారుల బృందం. తర్వాత కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం. కాని మనం బ్రిటిష్, తెల్లవాళ్లు అని సంబంధం లేని వారిని కూడా కలిపే విశాలమైన మాటలనే ఉపయోగించాం. ఆంధ్ర అనే పదం సరిగ్గా అట్లాగే తెలంగాణ నీళ్లను, నిధులను, ఉద్యోగాలను, వనరులను, చరిత్రను, భాషను కొల్లగొట్టిన వారికి వర్తించే పదమే తప్ప, ఆ జాతిలో ప్రతి ఒక్కరికీ వర్తించేది కాదు.

ఈ వివరణ ఎందుకంటే, మన కళ్ల ముందు జాతి పేరు మీద జరిగిన నెల్లీ, మణిపూర్ వంటి శతృత్వాల, మారణకాండల చరిత్ర ఉంది. ఆ చారిత్రక నేపథ్యంలో "మార్వాడీ" సమస్య జాతి సమస్య కాదు, దోపిడీ పీడనల, వనరుల దురాక్రమణల, సంస్కృతి విధ్వంసాల సమస్య అని స్పష్టంగా అర్థం చేసుకోవలసి ఉంది. ❑

# తెలుగుజాతి సారస్వత మహాయాత్ర !
# కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర!!



- గౌరవ్


ముహూర్తాల మీదా జాతకాల మీదా నాకు చిన్నతనంలోనే నమ్మకం పోయింది. నేను స్వతంత్రుడిని అయ్యాక నా జాతక చక్రాన్ని చూడటానికి ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. నాకు మొదట జ్యోతిశ్శాస్త్రం మీద చాలా విశ్వాసం ఉండేది. కానీ, జాతక చక్రాలను బట్టీ దీర్ఘాయుష్మంతులు అవుతారని చెప్పినవారు అల్పాయుష్కులవటం, గొప్ప ధనవంతులవుతారని చెప్పినవారు దరిద్రులుగా మిగిలిపోవడం, సంతాన వంతులు అవుతారని చెప్పిన వారు గొడ్రాళ్లుగా మిగలడం, నిత్య సుమంగళిగా జీవిస్తారని చెప్పిన వారు బాల వితంతువులు అవడం, ముహూర్తాలు పెట్టుకుని చేసే కార్యాలు విఫలమవడం చూసేకొద్దీ నాకు జ్యోతిష్యం మీద నమ్మకం తగ్గింది. లోకానుభవం పెరిగే కొద్దీ పూర్తిగా నశించింది.

- పేజీ 14, 15

ఆ కాలంలో అందరికీ దయ్యాల మీద నమ్మకం జాస్తి. దెయ్యం పట్టని ఆడవాళ్ళు ఎక్కడో కానీ ఉండేవాళ్ళు కాదు. ఎవరికి ఏ వ్యాధి వచ్చినా వైద్యుడి దగ్గరకు వెళ్ళే బదులు ముందుగా భూత వైద్యుడి దగ్గరకో సోది చెప్పే వారి దగ్గరకో పరిగెత్తేవారు. చనిపోయిన వారు దయ్యాలయి తిరుగుతారని అందరూ నమ్మేవారు. అందులోనూ మా అమ్మకు దయ్యాలపై నమ్మకం చాలా ఎక్కువ. తరచుగా ఆమె తనను ఏదో దెయ్యం ఆవహించి పీడిస్తోందని నిద్రాహారాలు లేకుండా బాధ పడేదట. మా తాతగారు ఎందరినో భూత వైద్యులను, మంత్రగాళ్లనూ రప్పించి ఎన్ని చికిత్సలు, మారణ హోమాలు చేయించినా పాత దెయ్యం విడిచి పెట్టగానే కొత్త దెయ్యం ఆమెని ఆవహించేది. ఆమె నానాటికి చిక్కిపోతుండేది. కానీ భూతం మాత్రం ఆమెను విడిచిపోలేదట.

- పేజీ 17

"ఈ కాలంలో నాకు పురాణాలు చదివే పిచ్చి అంతకంతకూ ఎక్కువైంది. విశ్వామిత్రుడు బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి చేసినట్టు, అగస్త్య మహర్షి సముద్రాన్ని ఔపోసన పట్టినట్టు, కపిలుడు చూపుతోనే సగర పుత్రులైన పది వేల మందిని బూడిద చేసినట్టు చదువుతుంటే, నేనెప్పుడు వాటికి మించిన మహిమలను పొందు తానా అని తహతహలాడేవాడిని. నా వెర్రి ఊహలను కొన్నింటిని ఇతర బాలుర బుర్రల్లోకి కూడా ఎక్కించగలిగాను. ఈ తపో మహిమలన్నీ పగటి కలలని అనుకోకుండా, నేను నమ్మడమే కాకుండా, ఇతరులను కూడా ఆ భ్రమల్లో తేలేలా చేసేవాణ్ణి.




- పేజీ 24

ఏంటి ! స్వయంవరం భాగ్యమా ? ఆ అదృష్టం హిందూ దేశంలోని బ్రాహ్మణులకు కలలో కూడా లభించదు. భవిష్యత్తులో ఎప్పుడైనా కలగ వచ్చినేమో కాని ఇప్పటికి మాత్రం లేదు. మాలోని విద్యావంతులైన మహానుభావులు విజ్ఞానకాంతులు చూడకుండా కళ్ళు మూసుకుని పూర్వాచార మహాభూతానికి సేవ చేసినంత కాలం మనదేశంలో అటువంటి పుణ్యం ఇకపై కూడా కలుగదు. పండితులు పామరులు అనే భేదం లేకుండా మావాళ్ళంతా ఆచారానికి దాసులు. ఆచార పిశాచి ఆవహిస్తే వారికి దయ, ధర్మం, సత్యం, సత్కార్యం వంటివేవీ కనిపించవు.

- పేజీ 25

దయ్యాలు పట్టాయన్న వారి ఇళ్లకు వెళ్ళి భూతవైద్యులు చేసే మంత్రతంత్రాలను చూసేవాడిని. ఒక్క భూతాన్నైనా చూపించమని వాళ్ళని ఎన్నో విధాల బ్రతిమాలాను. ఒక్కరు కూడా నాకు

చూపించలేదు. ఒక భూత వైద్యుడు మాత్రం నాకు దయ్యాన్ని చూపిస్తానని ఒక రాత్రి ఊరవతలున్న మర్రిచెట్టు దగ్గరికి తీసుకెళ్ళి 'దెయ్యాన్ని చూపిస్తే నువ్వు జడుసుకుంటావు' అని తప్పించు కోవాలనుకున్నాడు. 'నేను జడుసుకోను. దయచేసి చూపించు.' అని ధైర్యంతో నిలబడ్డాను. అతను, 'నువ్వు భయపడకపోయినా ప్రభుత్వం వల్ల నాకు చిక్కులు వస్తాయి, నేను చూపించను.' అని నాకు ఆశాభంగం కలిగించి వెళ్ళిపోయాడు. దయ్యాలు స్మశానాలలో అర్ధరాత్రి సమయాల్లో సంచరిస్తాయని అందరూ చెప్పడం వల్ల వాటిని చూడాలని ఉత్సాహంతో చాలా సార్లు అర్ధరాత్రి ఎవరితోనూ చెప్పకుండా స్మశానానికి వెళ్ళాను. పాము కరుస్తుందని, తేలు కుడుతుందని, దొంగలు కొడతారనే భయం తప్ప పిశాచి భయం లేకుండా ఇంటికి తిరిగి వచ్చేవాడిని.

– పేజీ 36, 37

పగబట్టిన ప్రతిపక్షం వాళ్లు నన్ను క్షుద్ర విద్యలతో అంతం చేయాలని పయత్నించారు. పిండి బొమ్మలకు కీళ్లలో ముళ్ళు గుచ్చి మా గుమ్మం ముందు పసుపుతోను, పిండితోను ముగ్గులు పెట్టేవారు. దానివల్ల ఫలితం లేకపోయిందని రాత్రిళ్ళు మా దొడ్లో పిండి బొమ్మలనూ కొబ్బరికాయ ముక్కలను కట్టేవారు. తెల్లవారాక మా ప్రింటింగ్ ప్రెస్ పనివాళ్ళు ఆ ముక్కలను తినేసేవాళ్ళు.

– పేజీ 91

"ప్రజల ఉపయోగం కోసం నేను టౌన్ హాల్ కట్టించినందుకు పట్టణ ప్రజలంతా నాకు సాయం చేసి ఉంటారని మీరు అనుకోవచ్చు. మా పట్టణ ప్రజలు అలాంటి 'పాపపు ' పనులకు పూనుకోరు. నేను మందిరం కట్టించడానికి ముందే ఆ స్తలం గురించి నలుగురు కోర్టుకెళ్ళారు. ఆ పిర్యాదులు వీగిపోయాయి. అలాగే ఒక పెద్దమనిషి మద్దతుతో ఒక పేద తురకవాడు టౌన్ హాల్ నిర్మాణం కోసం తన తాత సమాధిని తవ్వేశారని నా పై కోర్టులో కేసు వేశాడు. సమాధి తవ్విన స్తలం నుంచి అస్థికలను బుట్టలో వేసి తెచ్చాడు. అవి తన తాత ఎముకలని వాదించాడు. పోలీసులు మెడికల్ ఆఫీసర్ తో పరీక్ష చేయించారు. పరీక్షలో అవన్నీ మేక ఎముకలని రుజువైంది.

– పేజీ. 110, 111

నేను రచనా వ్యాసంగాన్ని ప్రారంభించే టప్పటికీ వచన రూపంలో ఎలాంటి పుస్తకాలు లేవు. అన్నీ కొత్తగా రాయవలసి వొచ్చింది. తెలుగులో మొదటి వచన ప్రబంధాన్ని ( నవలను) నేనే రాశాను. మొదటి నాటకాన్ని నేనే అనువదించాను. ప్రకృతి శాస్త్రాన్ని, ప్రహసనాన్ని, చరిత్రను నేనే ముందుగా రాశాను. స్త్రీల కోసం మొదటి వచన రచన చేసింది కూడా నేనే. ఇలా పుస్తకాలు రాస్తూనే అందుబాటులో లేని ఎన్నో పాత పుస్తకాలను కూడా సంపాదించి ప్రచురించాను".

– పేజీ 134

మత, నీతి, కులాచారాలను సంస్కరించకుండా కేవలం రాజ్యాంగ సంస్కరణ జరిగినంత మాత్రాన దేశం అభివృద్ధి చెందుతుందని నేనెప్పుడూ భావించలేదు. అన్ని రంగాలలోనూ దేశం సమానంగా అభివృద్ధి చెందాలని నా ప్రగాఢ విశ్వాసం. మన శరీరంలో ఉన్న అవయవాలన్నీ వాటి పరిమాణానికి

# అభినందన




**వకుళాభరణం రామకృష్ణ**
**హైదరాబాద్.**


తెలుగు వారు చిరకాలం మననం చేసుకోవాల్సిన మహానుభావుడు కందుకూరి వీరేశలింగం. తెలుగు జాతిని ఆధునిక యుగంలో మేల్కొల్పిన ద్రష్ట. సంప్రదాయ సామాజిక నేపథ్యం నుండి వచ్చి, ఆధునిక భావాలను సంతరించుకుని, ఆంధ్రదేశాన్ని సాహిత్య, సామాజిక రంగాల్లో ఉద్దీపించి, పురోగమనం వైపు నడిపిన వైతాళికుడు. సాహిత్యం ఆధునిక, సంస్కరణ భావాలతో కూడిన – మాధ్యమం ద్వారానే కాక ఆచరణ లోనూ దారి చూపిన మార్గదర్శకుడు.

– సంస్కరణలను అమలు చేయడంలో ఎదుర్కొన్న అనేకానేక విషయాలను, భావితరాలకు తన స్వీయచరిత్ర ద్వారా తెలియపరచిన మహానుభావుడు. బహుగ్రంథకర్త. ఆయన చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. వాటన్నింటి లోనూ వారి స్వీయచరిత్ర తలమానికం. స్వీయ జీవిత విశేషాలతో పాటు నాటి సమాజాన్ని తన 'పోరాటాలను' గుదిగుచ్చి దిశా నిర్దేశం చేసిన వైతాళికుడు. వీరేశలింగం స్వీయచరిత్ర బహుళమైనది. చదువరులకు, సామాన్య, సగటు ప్రజలకు అందుబాటులో లేనిదీ, సాధ్యం కాని దీను. ఆ బృహద్గ్రంథంలోని ముఖ్య విశేషాలను, సంఘటనలను తొలగించకుండా సంక్షిప్తీకరించి, ఎంతో శక్తి సామర్థ్యాలతో రాసిన ఈ గ్రంథ రచయిత శ్రీయుతులు శ్రీ పి.ఎస్.ప్రకాశరావు అభినందనీయులు. ఈ గ్రంథాన్ని ప్రచురిస్తున్న డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీకి, ఆ కమిటీ సారథి కామ్రేడ్ చెలికాని స్టాలిన్ గారికి ప్రశంసనలు.

తగ్గట్టుగా పెరగడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అలా కాకుండా కేవలం తల కానీ కడుపు కానీ కాలు కానీ పెరిగితే ఎలా ఉంటుందో చెప్పడం ఎందుకు? క్రూరమైన కులాచారాలకు బానిసలమై ఉన్నాము. మన ఇంట్లో ఉండే స్త్రీల కష్టాలను నివారించలేకపోతున్నాం. మతకలహాలతో ఐకమత్యం లేకుండా ఒకరినొకరు ద్వేషిస్తూ జీవనం సాగిస్తున్నాం. అలాంటప్పుడు స్వాతంత్ర్యం సంపాదించి దేశం ఎదుర్కుంటున్న కష్టాలను ఎలా అరికట్టగలం ?"

– పేజీ 142, 143

తెలుగు సాహిత్యంలో సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక జీవనంలో పునరుజ్జీవనానికి అంకితం అయిన మహాపురుషుడు కందుకూరి. కేవల ఆదర్శాల వల్లెవేత వల్ల కాదు. క్రియాశీల ఆచరణ వల్ల మాత్రమే తిరుగు లేని సంస్కర్తగా రూపొందిన యోధుడు. మూఢ నమ్మకాల నిర్మూలన మొదలుకుని, బాల్య వివాహాల నివారణ వరకూ, స్త్రీవిద్య నుండిపునర్వివాహాల దాకా, స్త్రీ పురుష సమానత, సాహితీ సృజన, రచనా వ్యాసంగం,కళలు, నాటకాలు, పత్రికలు, ఉద్యమాలు, పలు సంస్థలు, నిరవధిక దీక్షలు, అవిశ్రాంత పయనాలు.. ఇలా ఎన్నో రంగాల్లో మహోన్నతంగా భాసించిన ధీరుడు కందుకూరి వీరేశలింగం. అందుకే ఆయన యుగకర్త.

భిన్నాభిప్రాయాలు ఎన్నైనా ఉండనివ్వండి కానీ, అలాంటి మహానుభావుడి స్వీయచరిత్ర, నిజానికి అది తెలుగుజాతి సారస్వత యాత్ర. సుమారు వందేళ్ల నాటి వ్యవస్థ పరిణామాన్ని ఆసక్తి కరంగా చిత్రించిన అపూర్వ వీచిక. ఒక అర్భకుడు, బలహీనుడైన సామాన్య వ్యక్తి, మహా శక్తిమంతుడిగా రూపొందిన క్రమం. నాటి సమాజంలో ఉన్న అనేక సాంఘిక సమస్యల పై సగటు మనిషి ప్రకటించిన యుద్ధం. రాజకీయ వ్యవస్థ మొదలు, సదాచార సంప్రదాయాల పైనా, కుహన మేధావులు పైనా, చివరికి న్యాయ వ్యవస్థ పైనా కూడా సామాజిక స్పృహతో,హేతు జిజ్ఞాసతో, కార్యదీక్షతో చివరి క్షణం వరకూ ఒక వ్యక్తి , ఏకవ్యక్తి సైన్యంగా చేసిన విశిష్టమైన విప్లవ పోరాటం కందుకూరి స్వీయచరిత్ర.

మొత్తం వందకి పైగా అన్ని ప్రక్రియల్లో రచనలు చేసి, సంఘాన్ని సంస్కరించడానికి నాడున్న మార్గాలన్నింటినీ తోడి, సాంప్రదాయ ఛాందస సమూహాలతో ఒకవైపు, స్వార్థపర కుటిల శక్తులతో మరోవైపు అలుపెరుగని పోరాటం చేస్తూనే అనన్య సామాన్యమైన సామాజిక ప్రగతికి సారథ్యం వహించిన అసాధారణ ఉద్యమకారుడు కందుకూరి. తెలుగు ప్రాంతం సరే సరి. అటు చెన్నై మొదలు ఇటు బరంపురం వరకూ, బెంగుళూరు నుంచి బొంబాయి దాకా, కాకినాడ నుంచి కలకత్తా వరకూ దేశంలో ఎక్కడెక్కడి దాకా తన సంస్కరణా విస్తృతిని పెంచుకుంటూ పోయారో ఎన్నటికీ అదొక ఆశ్చర్యకరమైన విషయంగానే మిగిలిపోతుంది.

ఆయన చేసిన రచనలు స్థాపించిన సంస్థలతో రాశిలోను, వాశిలోనూ పోటీపడతాయి. ఆయన ప్రసంగించిన మహాసభలు ప్రయాణించిన మహాదూరాలతో పోల్చుకుంటాయి. స్వాతంత్రం సరే కానీ, దానికిముందు దేశంలో పరిష్కరించాల్సిన సమస్యల సంగతి ఏంటని అడిగిన ఆ స్థాయి మేధావి, బుద్ధిజీవి తెలుగు సాహిత్యంలో, సాంస్కృతిక రంగంలో కూడా అరుదే. అనేక పరిమితుల్లోనే అయినప్పటికీ ఆనాడు కందుకూరి వీరేశలింగం సాధించిన విజయాలు తెలుగుజాతిని భవిష్యత్తులో సైతం దిగ్భ్రాంతి కలిగిస్తూనే ఉంటాయి. చరిత్ర మరిచిన జాతికి పురోగతి శూన్యం. కందుకూరి తెలుగు జాతి సాంస్కృతిక వికాస చరిత్రకొక ప్రతీక. ఆయన స్వీయచరిత్ర తెలుగుజాతి వెలుగు దీపిక. ప్రతి తెలుగు బిడ్డ దిక్సూచిక.

అటువంటి మహా గ్రంథం 800 పుటల్లో కాస్త క్లిష్టమైన భాషలో ఉండటం వల్ల చాలా కాలంగా నేటి తరాలకి అందుబాటులో లేకపోయింది. గతంలో కూడా ఆ మహాగ్రంథం చదివిన వారు బహుకొద్దిమంది మాత్రమే. అలాంటి విలువైన పుస్తకాన్ని నేటితరాలకు, ముఖ్యంగా యువతకు అందుబాటులోకి తీసుకొచ్చే కార్యక్రమం ఇది. డా. పి.ఎస్. ప్రకాశరావుగారు ఎంతో హృద్యంగా 180 పుటల్లో అందరికి అర్థమయ్యే తేలికపాటి భాషలో సరళమూ, సంక్షిప్తమూ చేసిన కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్రను, పెద్దలు వకుళాభరణం రామకృష్ణ గారి అభినందన వాక్కులతో, అందమైన ఫొటోలతో, సేకరించిన కందుకూరి ఉల్లేఖనలతో కలిపి ' డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ ' ప్రచురించి, ఉచితంగా అందిస్తోంది.

అంతేకాదు, ఎక్కడికక్కడ పద సూచికలతో పాటుగా క్లిష్టమైన పదాలకి అర్థాల్ని కూడా చివర్లో ఇవ్వడం జరిగింది. ఇంతటి విలువైన గ్రంథాన్ని ఇంత కాలానికి ఇలా, నేటి తరాలకి అర్థమయ్యేలా మలిచిన రచయిత మిత్రులు ప్రకాశరావు గారు, మంచి మానవీయ విలువలు కలిగిన సాహిత్యం తెలుగు వారికి అందించాలనే ఉద్దేశంతో తన 21 వ ప్రచురణగా ప్రచురించిన మిత్రులు, పెద్దలు డా. చెలికాని స్టాలిన్ గారి మానస పుత్రిక, "డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ" కి ప్రత్యేక అభినందనలు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవాల్సిన అద్భుతమైన జీవితకథ ఇది. ఆసక్తి ఉన్న వారికి సాఫ్ట్ కాపీ పంపుతున్నాను. పుస్తకమే కావాలని అంటే 99637 43021 నెంబర్‌కి 50 రూపాయలు పంపితే పోస్టులో పంపడం జరుగుతుంది. ❑


# భౌతికవాదుల చేతిలో బ్రహ్మాస్త్రం 'భారతీయ నాస్తికవాదం'



- వి.బాల సుబ్రహ్మణ్యం

ప్రపంచం ఉనికిలోకి ఎలా వచ్చింది ? ఈ ప్రశ్నే తత్వ శాస్త్రానికి మూలం. 'ఒక మానవాతీత శక్తి దీనికి కారణం' అనేది ఒక భావన. దీని చుట్టూ శతాబ్దాల తరబడి చర్చోపచర్చలు చేశారు. సిద్ధాంతాలు సృష్టించారు. మన వేదాలనుంచి సూత్ర గ్రంధాల దాకా దీని సమర్ధన అవిచ్ఛిన్నంగా కొనసాగింది. తర్వాత వచ్చిన పురాణాలు కూడా ఇదే ఒరవడిని కొనసాగించాయి. దీన్ని ప్రాచీనం, సనాతనం అంటే అనొచ్చు కూడా. సమాజాన్ని నియంత్రించగల, నడిపించగల శక్తుల మద్దతు దీనికి దక్కడంతో దీర్ఘకాలికంగా దీనికి విస్తృతమైన ఆమోద యోగ్యత చరిత్ర పొడవునా లభించింది. ఇదే ఆస్తికవాదం.

దీనికి భిన్నంగా ప్రపంచానికి ఏ సృష్టికర్తా లేడనీ, అది తనకంత తనే ఆవిర్భవించిందనే లౌకిక భౌతిక భావన కూడా చరిత్ర పొడవునా సాగింది. దీని చుట్టూ సైతం కావలసినన్ని వాదాలు, చర్చలు జరిగాయి. సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. పుంఖానుపుంఖాలుగా గ్రంథాలు వెలిశాయి. ఇలా చూస్తే ఈ తాత్వికవాదం కూడా అంతే ప్రాచీనం, అంతే సనాతనం. అంతే బలీయం. ఇదే నాస్తిక వాదం. రెండూ సమాంతర స్రవంతులు. సుదీర్ఘ స్రవంతులు.




### తాత్వక రంగంలోనూ వర్గఘర్షణ

సహజంగానే ఈ రెండూ ఒక వొరలో ఒదిగే కత్తులు కాకపోవడంతో వీటి మధ్య తలలు పగలగొట్టుకునే ఘర్షణలు జరిగాయి. ఒక్కోసారి హద్దులు దాటి భావపరమైన ఘర్షణల స్థాయి నుంచి భౌతికమైనవిగానూ మారాయి. చరిత్ర నిండా ఈ ఘర్షణ సైతం ఒక స్రవంతిగా సాగింది. సాగుతూనే వుంది. అయితే మొదటి దానికి మద్దతు దారులుగా పాలకులు, వారికి వత్తాసుదారులైన పండితులూ వున్నారు. దాన్ని వాళ్ళు ఆకాశానికి ఎత్తారు. రక్షణ కవచంగా దాని చుట్టూ నిలబడ్డారు. అధికారిక భావనగా దానికి ఒక రాజముద్ర కూడా వుంది. కారణం రాజ్యం ప్రయోజనాలు దానితో ముడివడి వున్నాయి. ఫలితంగా దానిది నల్లేరుపై నడక.

భౌతిక వాదానికీ మద్దతు లేదు. అది సత్యం పక్షాన, ప్రజల పక్షాన నిలబడేది. అందువల్ల అది అడుగడుగునా ఘర్షణ పడుతూ ఎదురీదాల్సి వుంటుంది. ఈ ఘర్షణలో భౌతికవాదం కొన్ని సందర్భాల్లో వెనకబడుతుంది. ఒక్కోసారి పలుచబడుతుంది. సారాన్ని కోల్పోతుంది. మూలాధారాలన్నీ 'మాయమై', దానికి దాని శత్రువులు చేసిన నిర్వచనాలూ, వ్యాఖ్యనాలే మిగులుతాయి. గడ్డు పరిస్థితిలో కాలం కలిసి రాక రాజీపడ్డమూ జరుగుతుంటుంది. అంతిమంగా విజ్ఞాన శాస్త్రం ఎదిగొచ్చి తోడొచ్చే దాకా ఇది ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటూనే వుంటుంది. అయినా అసిధారా వ్రతంగా భౌతికవాదాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఎంత ప్రతిఘటనకైనా సిద్ధపడే వారికి చరిత్రలో కొదవేమీ లేదు. కారణం సత్యానికున్న బలం! వాస్తవానికిదే తాత్విక రంగ చరిత్ర సారం. ఇదో వర్గ పోరాటం. అంతిమంగా వీటిలో ఏది శాస్త్రీయమో ఏది రుజువుకు, నిర్ధారణకు నిలబడుతుందో, దేనితో మానవాళి ప్రయోజనాలు ముడివడి వున్నాయో అదే నిలబడుతుంది. విజ్ఞాన శాస్త్రం వికసించే కొద్దీ దీనికి గొప్ప తోడు లభిస్తుంది. దీంతో మానవుడి భౌతిక ప్రపంచమంతటనీ ఇది అల్లుకుంటుంది. అంతిమంగా కాదనలేని స్థాయికి చేరుకొని ఎక్కువ మందికి అంగీకార యోగ్యంగా మారుతుంది.

మన బాధ్యత ఏమంటే చరిత్రలోని ఈ సజీవాంశాలన్నిటిని

ఓపిగ్గా వెతికి ఒక చోటికి చేర్చడం. వాటిని పునర్నిర్మించడం. ఒక్కొక్కప్పుడు ఇది కష్టతరంగా మారొచ్చు. ఎక్కడో ఒకచోట మొత్తం లింకు తెగిపోవచ్చు. మనల్ని గందరగోళంలోకి నెట్టవచ్చు. అందుకే దీనికి పట్టుదలా, నిబద్ధతలతో పాటు పరిశోధనా ప్రతిభా పాండిత్యాలు వుండాలి. దీన్ని మించిన తాత్విక స్పష్టతా, ఆధునిక వైజ్ఞానిక పరికరాలు కూడా వుండాలి.

**అసాధారణ పాండిత్యం, నిబద్ధతా !**

ఈ గ్రంథంలో దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ కృషి, ముందుకు తెచ్చిన వాదాలూ, సాక్ష్యాలు చూస్తే దిగ్భ్రమ కలుగుతుంది. ఆయన శ్వేతాశ్వతరోపనిషత్తులో బౌద్ధానికి ముందే స్వభావ వాద (Naturalism) ఛాయల్ని పట్టుకొంటాడు. భగవంతుడి విషయంలో బుద్ధుడిది ఉపేక్షాధోరణి అంటూ ప్రతీతి సముత్పాదాన్ని బౌద్ధ భౌతిక తాత్వికంగా వర్ణిస్తాడు. వైభాషికులు మూలక ధర్మాల సిద్ధాంతకర్తలంటూ వారిది ప్రతివాదం అనీ, అది భగవత్ వ్యతిరేకమని నిరూపించే ప్రయత్నం చేస్తాడు. శ్వేతాశ్వతర ఉపనిషత్తు నుంచి ఖగోళ విజ్ఞానం దాకా కాలానికి గల ప్రాధాన్యతను ముందుకు తెస్తాడు. ఉద్దాలకఅరుణిని మానవాళి మేధో చరిత్రలోనే మొదటి ప్రకృతి శాస్త్రవేత్త అంటూ, ప్రకృతికి మనిషికి గల సంబంధాల్ని ప్రయోగాత్మకంగా అర్థం చేసుకోవడం అతనికే మొదటి చెల్లిందంటాడు. వజ్రకోపనిషత్తును శంకరుడు ఎందుకు వ్యాఖ్యానించలేదని ప్రశ్నిస్తాడు. పండితులు కపిలుడిని మహా విద్వాంసుడని ఒక పక్క కీర్తిస్తూనే చరిత్ర పొడవునా కించపరచడాన్ని ఎత్తిచూపుతాడు.

మొదట వైద్యశాస్త్రమే ప్రకృతి శాస్త్రమనీ, తొలి భౌతికవాదం కావడంతో బ్రాహ్మణులు దీనికి దూరమై తీవ్ర నష్టం తెచ్చారనీ అంటాడు. చివరికి భగవత్ సమర్ధకులైన న్యాయవిశేషకుల్ని కూడా ప్రపంచానికి అంతిమ భౌతిక కారణంగా అణువుల (పదార్థాల) సమ్మేళనాన్ని ప్రతిపాదించినందు వల్ల భౌతిక శాస్త్రవేత్తలే అంటూ కొత్త నిర్ధారణ చేస్తాడు. యోగమూ అంతే. అది వ్యాయామంగా వున్నంత కాలం భౌతికమే. మోక్షం ప్రవేశించాకే అలౌకికం అయిందంటాడు. చిట్ట చివరకు శంకరుడి మాయావాదంలో కూడా నాగార్జునుడి శూన్యవాద ప్రభావాన్ని చూపుతూ, "ప్రపంచమే మాయ అయినపుడు సృష్టికర్తా లేదు గదా" అని అందులోనూ భౌతికవాద ఛాయల్ని అన్వేషిస్తాడు.

**భౌతికవాదుల బలహీనత**

అయితే ఇంత శక్తీ ఇంత నిబద్ధత గల భౌతిక (నాస్తిక) వాదం అలౌకిక భావవాదం ముందు సమాజంలో ఎందుకు ప్రాచుర్యం పొందలేకపోయింది. అలౌకిక (ఆస్తిక) వాదనదే పైచేయిగా ఎందుకు మారింది? అనే ప్రశ్నను కూడా ఆయన ముందుకు తెచ్చి దీనికి రెండు కారణాలను, పరిష్కారాలను చూపుతాడు. విజ్ఞానశాస్త్రం తగినంత అభివృద్ధి కాకపోవడం వల్ల స్వభావాదులూ, అణువాదులూ లాంటి వారు తమ వాదాన్ని తాత్విక రంగానికి పరిమితం చేసుకోవలసి వచ్చింది. వారి భావనలు ఒక తార్కిక చర్చగానే సాగాల్సి వచ్చింది. ఇది ఆ కాలపు పరిమితి.

రెండోది మరీ ముఖ్యమైనది అప్పటి భౌతికవాదుల అవగాహనా పరిమితి. వారికి ప్రాపంచిక దృక్పథం లేకపోవడం. ఆస్తిక భావవాదులకున్న సామాజిక మూలాలను గుర్తించలేకపోవడం. ఒకానొక భౌతిక స్థితిలో భగవంతుడు స్థిరపడ్డ ఊహగా అవతరించాడని అర్థం చేసుకోలేకపోవడం. ఒక మాటలో చెప్పాలంటే దీనికున్న సాంఘిక మూలాలను విస్మరించి తాత్విక రంగంలో మాత్రమే దర్శించడం. మార్క్సిజం రంగం మీదికి వచ్చేదాకా ఈ ముడి వీడలేదు.

**మన కర్తవ్యం**

చివరగా రచయిత మన బాధ్యతను స్పష్టంగా, ఒకింత కఠినంగా నిర్దేశిస్తాడు. శ్రామిక ప్రజలంతా తమకు తామే చైతన్యవంతులై ఏమీ వున్నట్టుండి మార్క్సిస్టులుగా మారిపోరు. వారికి ఓపిగ్గా అవగాహన కల్పించాలి. వర్గ స్పృహ కల్గించాలి. సంఘటితపరచాలి. వారి పోరాటంతోనే దీనికి అంతిమ పరిష్కారం లభిస్తుందని సుస్పష్టం చేస్తాడు. అయితే దీనికి ఎంత పట్టుదల వుండాలో అంత మెలకువ వుండాలి. భౌతికవాదులేమీ ఒంటరివాళ్ళు కాదు. వాళ్లకూ సుదీర్ఘ సుసంపన్న వారసత్వం వుంది. అద్భుతమైన వాదనా రూపాలున్నాయి. అనుభవాలున్నాయి. వాళ్లెన్నో డక్కా మొక్కీలు తిన్నవాళ్ళు. అలాగే ఇప్పటి మాటల్లో చెప్పాలంటే వాళ్ళూ సనాతనుల్లోకెల్లా సనాతనులు. ప్రాచీనులోకెల్లా ప్రాచీనులు. ఇప్పుడు వారందరి జ్ఞాన సామగ్రికి ఆధునిక వైజ్ఞానిక పరికరాలను జతపరచుకోవాలి. ఓపిగ్గా తలపడాలి. జనంలో నుంచి వేరుపడకుండా జాగ్రత్త పడాలి.

దేవిప్రసాద్ చటోపాధ్యాయ తాత్విక రంగంలో పనిచేసే వారందరికీ వైజ్ఞానిక దృక్పథం కూడా వుండాలంటాడు. వైజ్ఞానిక శాస్త్రాలకు తాత్విక శాస్త్రాలకు ఒక సయోధ్య కుద ర్చాలంటాడు. దేనికోసం భారతదేశపు ప్రోటోసైన్స్ రూపాలను సైతం వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తాడు. ఈ గ్రంథం చదువుతున్నంత సేపు మన ప్రపంచం మొత్తాన్ని కొత్త దృష్టితో తిరగజూస్తున్నట్టనిపిస్తుంది. ఇలా దీన్ని దర్శించిన వారెవరూ లేరనిపిస్తుంది.

ఈ గ్రంథం ఎంత విలువైందో అంత లోతైంది. కాకుంటే ఓపిగ్గా చదవాలి. అవసరమైతే ఒకటికి రెండుసార్లు చదవాలి. ఇలాంటి గ్రంథాల అనువాదం ఏమీ ఆషామాషీ వ్యవహారం కాదు. నల్లేరు మీద నడకలా సాగిందనలేము గానీ అనువాదం మూలాన్ని అక్షరం అటూ ఇటూ పొల్లు పోకుండా మన ముందు

**(మిగతా 42వ పేజీలో)**

# ఆదర్శ కమ్యూనిస్టు డా.చెలికాని రామారావు



\- పి.యస్.ప్రకాశరావు

**అధములు, మధ్యములు, ఉత్తములు అని మనుషుల్లో మూడు రకాలుంటారట. ఆటంకాలకు భయపడి ఏ కార్యాన్నీ తలపెట్టని వాళ్ళు అధములు. ఒక పనికి పూనుకుని అడ్డంకులొచ్చాయని మధ్యలోనే ఆ పని నుంచి తప్పుకునే వాళ్ళు మధ్యములు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఉక్కు సంకల్పంతో సాగిపోయేవాళ్ళు ఉత్తములు. ఇది భర్తృహరి శ్లోకానికి ఏనుగు లక్ష్మణకవి 'ఆరంభింపరు నీచమానవులు..' అనే పద్యంలో చెప్పిన భావం. అలాంటి ఉత్తములలో చేర్చదగిన మహోన్నత వ్యక్తి డా. చెలికాని వెంకటరామారావు గారు.**

రామారావుగారు 1901, జూలై 15వ తేదీన కాకినాడ దగ్గరున్న తిమ్మాపురంలో వారి మాతామహులు రావు తిరుపతి రావుగారు, వెంకాయమ్మ గార్ల ఇంటివద్ద నారాయణస్వామి, సూరమ్మ దంపతులకు పుట్టారు. పిఠాపురం పక్కనున్న కొండెవరంలో పెరిగారు. 1918లో పిఠాపురంలోని RRBHR హైస్కూల్లో (రాజారావు భావయమ్మారావు ఉన్నత పాఠశాలలో) SSLC చదివి ఫస్టు క్లాస్‌లో పాసయ్యారు. 'ఈ కుర్రాడు భవిష్యత్తులో గొప్ప ఉద్యోగంలో స్థిరపడి మంచి పలుకుబడీ హోదా సంపాదించుకుంటాడు' అని కుటుంబ సభ్యులు భావించారు. తెలివైన విద్యార్థులను ప్రోత్సహించే పిఠాపురం రాజా రామారావు గారు కాకినాడలో F.A (నేటి ఇంటర్‌కి సమానం) చదువుకు ఆర్థికంగా తోడ్పడ్డారు. కానీ కాకినాడలో చదువు ప్రారంభించాక జాతీయ భావాలు, జాతీయ కార్యక్రమాలతో పరిచయం కలిగింది. ఆంధ్రలో గాంధీ గారి ప్రభావం ఎక్కువైంది. ఉద్యోగం వచ్చే చదువుకంటే ఉద్యమమే ముఖ్యమనే భావం రామారావు గారిలో బలపడిపోయింది. ఫలితంగా పరీక్ష ఫెయిలయ్యారు. తిరిగి పరీక్ష రాయమని తండ్రి, అన్న గారు చేసిన బోధలు ఆయన మనో సంకల్పాన్ని కదల్చలేకపోయాయి.

నూనూగు మీసాల నవ యవ్వనం, నిండా 20 ఏళ్ళ వయసు లేదు. విలు విద్యలో అర్జునుడికి పక్షి కన్ను తప్ప ఏదీ కన్పించనట్టు రామారావు గారికి స్వతంత్ర సంగ్రామం తప్ప ఇంకేదీ కన్పించలేదు. ఉద్యమంలో తానూ ఒక సమిధను కావాలనుకున్నారు. 1921 జనవరి 26 తెల్లవారుఝామున




ఉన్న ఇంటినీ, కన్నవాళ్ళనూ, ఉన్న వూరినీ, పైచదువులకు పిఠాపురం రాజా ఇచ్చే సాయాన్నీ వదిలి, కట్టుబట్టలతో కాలినడకన వెళ్ళిపోయి స్వతంత్ర సంగ్రామంలో ప్రవేశించారు. ఇంటి నుంచి వెళ్ళే ముందు తను అమితంగా ఇష్టపడే అన్న గారికి రాసిన ఉత్తరంలో తన చదువుకి తోడ్పాటునందించిన పిఠాపురం రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ లేఖలోని కొన్ని ముఖ్యాంశాలు.

- "సహాయ నిరాకరణ ఉద్యమంలో మనస్పూర్తిగా సర్వ శక్తులను ఉపయోగించి పనిచేసేదను"..
- "నేను ఎవరిదైనా ఉపన్యాసం విని గానీ, ఏదో వ్యాసం చదివి గానీ ఆలోచించకుండా ఇందులో ప్రవేశించినవాడను కాను."
- "ఇలాంటి ఉద్యమంలో పనిచేయకపోవడం నాకు మనో క్లేశమును, దుఃఖమును కలిగించుచున్నది."

- "గోడ మీది పిల్లి వలె ఉండుటకు నేనొప్పుకోను."
- "విద్యార్థులు పాడైపోతున్నారని మీరనుకోవచ్చు. దేశం కోసం గొప్ప ఆదర్శంతో పనిచేస్తే పాడైపోయినట్టు, B.Aలు, M.Aలు చదివి బహు స్వార్థంతో బ్రతికితే బాగైనట్టా ? ఈ ప్రయత్నం మానుకుని నేను పరీక్షకు కడితే దేశ ద్రోహిని, పాపిని అవుతాననే భావం కలుగుతోంది."
- "నష్టములు లేకుండా గొప్పకార్యములు సాధించలేము".
- "నాకే విధమైన ధన సహాయమూ అక్కర్లేదు".
- "నేను పిఠాపురం నుంచి రైలు మీద వెళ్ళుటకంటే నా శక్తి మీద ఆధారపడి నడిచిపోవుట మంచిదగుటచే తెల్లవారుజా మున బయలుదేరుచున్నాను" అని ఆ లేఖలో పేర్కొన్నారు.

తను వెళ్ళేది పూలబాట కాదని తెలిసే వెళ్లారు. కడుపు మాడ్చుకోవలసి వచ్చినా కర్తవ్యాన్ని వదల్లేదు. బుల్లెట్లు దిగే సందర్భం వచ్చినా కాళ్ళు బేరానికి దిగలేదు. ఉరకలెత్తే వయసులో ఉప్పెనలా పెల్లుబికిన భావజాలం కొంతవయ సొచ్చాక చప్పున చల్లారిపోవడం కొంత మందిలో మనం చూస్తుంటాం. కానీ ఆయనకు వయసు పెరిగే కొద్దీ ఉద్యమావేశం లావాలా ఉప్పొంగిందే కానీ చల్లారలేదు. గాంధీగారి ప్రభావంతో పిఠాపురం తాలూకాలో హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. మద్యపాన వ్యతిరేక కార్యక్రమంలో భాగంగా ఉప్పాడలో సారా దుకాణం ఎదుట జరిగిన పికెటింగ్ కి నాయకత్వం వహించారు. 1922లో అల్లూరి సీతారామరాజు గురించీ, అతని విప్లవ పంథా గురించీ, తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నాలు నర్సీపట్నం దాటి వెళ్ళలేదు. అదే సంవత్సరం అరెస్టయి జైలుకెళ్ళి మొదటిసారిగా నూతన సిద్ధాంతాల గురించి తెలుసుకున్నారు. అఖిల భారత మహాసభ కాకినాడలో జరిగినపుడు బులుసు సాంబమూర్తిగారు కొన్ని బాధ్యతలు తీసుకుంటే, రామారావు గారు వేలాది మందికి వసతులు, భోజనాలు, స్నానాలు, రవాణా వంటి సదుపాయాల బాధ్యత నిర్వర్తించారు. అల్లూరి సీతారామరాజు ఈ సభకు రహస్యంగా వచ్చినట్టు వినికిడి. 1922 నాటి జైలు జీవితం ఓ రకమైన ప్రభావం చూపితే, ఈ కాకినాడ సభ ఆయనలో మరో స్ఫూర్తిని కలిగించింది.

దేశానికి డొమినియన్ ప్రతిపత్తా? పూర్ణ స్వరాజ్యమా? సామ్రాజ్య వ్యతిరేక విధానం అవలంబించాలా? అనే భేదాభి ప్రాయాలు తలెత్తాయి. తిరుగులేని నాయకుడిగా ఉన్న గాంధీతో పాటు మరో నాయకుడు సుభాష్ చంద్రబోస్ తయారయ్యాడు. కాంగ్రెస్‌లో బయలుదేరిన స్వార్థపరత్వం, కులతత్వం వంటివి బ్రిటిష్ వారికి ఉపయోగపడ్డాయి. ఒక సంవత్సరంలో స్వరాజ్యం వస్తుందని నమ్మి సర్వస్వాన్ని త్యజించి వచ్చిన రామారావు గారిలో ఇవి ఆత్మ విమర్శకు దారితీశాయి. కానీ తిరిగి కొండెవరం వెళ్లి కడుపులో చల్ల కదలకుండా బ్రతికేయడం ఆయనకు ఇష్టం లేదు. సమాజానికి ఉపయోగకరమైన మనిషిగా మారి ఎంతో కొంత ప్రజాసేవ చేయాలనుకున్నారు. మధ్యలో వదిలేసిన ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. వైద్య వృత్తి చేపట్టి ప్రజాసేవ చేయాలనుకున్నారు. డబ్బు సమస్య వచ్చింది. మన సుంది కాబట్టి మార్గం కనిపించింది. వైద్య విద్య ఖర్చుల కోసం హైదరాబాద్‌లో ఇంగ్లిష్ ట్యూషన్స్ చెప్పారు. సరోజినీ నాయుడు భర్త గోవిందరాజులు నాయుడు గారే రామావుగారికి వైద్య కళాశాలలో గురువు. ఆ నాయుడు గారి ఇల్లు (గోల్డెన్ త్రెషోల్డ్) ఆ రోజుల్లో సంస్కరణవాదులకు, జాతీయవాదులకు నిలయంగా ఉండేది. రామారావు గారు తన ఖాళీ సమయాన్నంతా అక్కడే గడిపారు. ఆయన హైదరాబాద్‌లో ఉన్న సమయంలోనే ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, భాషోద్ధరణ, సాంస్కృతిక విద్యా సంస్కరణ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. భవిష్యత్తు తెలంగాణా సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి వారు అప్పుడు రెడ్డి హాస్టల్లో ఉంటూ కాలేజీల్లో చదువుకునే వారు. రామారావు గారి జాతీయోద్యమ భావాలు, సంఘసంస్కరణ భావాలతో ఈ భావి తెలంగాణా ఉద్యమ నాయకులు ఎంతో స్ఫూర్తి పొందారు. చివరకు రామారావు గారి ప్రోత్సాహంతో వీరు ఇరువురూ 1930–32 కాకినాడ ఉప్పు సత్యాగ్రహ శిబిరానికి వచ్చి 'మా కొద్దీ తెల్లదొరతనం..' వంటి పాటలు పాడి జాతీయోద్యమంలో అడుగుపెట్టారు. వైద్య పట్టా పరీక్షలు పదిహేను రోజుల్లో ప్రారంభమవుతాయనగా బులుసు సాంబమూర్తి గారి కోరిక మేరకు తూర్పు గోదావరి జిల్లాలో జరిగే ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనడానికి కాలేజీ వదిలి పెట్టారు.

రామారావు గారి ప్రేరణతో తెలంగాణా నుంచి వంద మంది యువకులు ఆయన్ను అనుసరించారు. గాంధీజీ పుట్టిన రోజున సభలలో ప్రసంగించకూడదని ప్రభుత్వం విధించిన 144 సెక్షన్ ని ధిక్కరించినందుకు ఆయన్ని అరెస్ట్ చేశారు. రాజమండ్రి జైలులో పరిచయమైన బెంగాల్ సోషలిస్టు నాయకుల ద్వారా సోషలిజం పట్ల ఆకర్షితులయ్యారు. పుచ్చలపల్లి సుందరయ్య గారితో పరిచయం ఇక్కడే జరిగింది. (ఈ పరిచయమే సుందరయ్య గారు కాకినాడలో ఉన్న రామారావు గారింట్లో కొన్నాళ్ళు ఉండటానికి పనికొచ్చింది). జైల్లోనే రష్యా విప్లవం గురించీ, మార్క్సిజం గురించీ తెలుసుకున్నారు. రాజమండ్రి జైలు నుంచి విడుదలయ్యాక ప్రభుత్వం మళ్లీ అరెస్ట్ చేసి బళ్ళారి జైలుకు పంపింది. లాకప్పులు, లాఠీలు, తూటాలు ఉక్కులాంటి ఆయన దృఢ సంకల్పాన్ని అణువంత కూడా కదల్చలేక పోయాయి. ఖద్దరు వస్త్రాలు రోడ్డు మీద కనిపించడమే

ప్రమాదకరంగా మారిన రోజుల్లో ఆయన పోలీసు వారి ఇళ్లకు వెళ్లి ఖద్దరు అమ్మడం విశేషం.

రామచంద్రపురంలో జోస్యుల రామచంద్రరావు గారు ఏర్పాటు చేసిన మహిళా సమావేశంలో పాల్గొన్నప్పుడు జరిగిన పోలీసుల లాఠీచార్జీలో రామారావు గారు స్పృహ కోల్పోయారు. అలాంటి సంఘటనలు ఆయన పట్టుదలను అణువంత కూడా సడలించలేకపోయాయి. సత్యాగ్రహోద్యమం కాలంలో రణదుందుభి, తిరుగుబాటు వంటి పత్రికలను రహస్యంగా పంచారు. కాకినాడలో కాంగ్రెస్ ఆఫీసుకు ఇల్లు ఎవరు అద్దెకిచ్చినా జైలు పాలవుతారని ప్రభుత్వం దండోరా వేయించినా రామారావు గారు పెద్దాడ కామేశ్వరమ్మగారితో కలిసి పిండాల చెరువు గట్టు మీద పట్టమర్తి మార్తాండ రామమూర్తి గారి ఇల్లుని ఆఫీసుకు ఇచ్చేలా చేశారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం తరువాత ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా అరెస్ట్ చేసి బళ్ళారి జైలులో పెడితే అక్కడ రామారావు గారికి టీబీ సోకింది. వైద్యం చేయించుకుని హైదరాబాద్‌లో వైద్య పరీక్ష రాసి పట్టాతో తిరిగొచ్చారు. తరువాత గాంధీ గారి హరిజనోద్యమంలో పాల్గొన్నందుకు మళ్ళీ అరెస్ట్ చేస్తే కోరాపుట్, కడలూరు జైళ్ళలో 18 నెలల జైలు శిక్ష అనుభవించారు. హరిజన సేవా కార్యక్రమాలకు డబ్బు అవసరమయ్యేది. దాని కోసం 1937లో బర్మా వెళ్లి రంగూన్‌లో వైద్య వృత్తి చేస్తూ జిల్లాలోని హరిజన సేవా కేంద్రాలకు ప్రతి నెలా డబ్బు పంపించేవారు.

**1952లో తొలి పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. రామారావు గారు కమ్యూనిస్టు పార్టీ తరుపున కాకినాడ నియోజకవర్గం నుంచి పోటీచేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండి ప్రచారానికి వెళ్లకుండానే ప్రజాపార్టీ నాయకుడైన బులుసు సాంబమూర్తి గారినీ, కాంగ్రెస్ అభ్యర్థి మొసలికంటి తిరుమల రావు గారినీ ఓడించి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. పార్లమెంటేరియన్‌గా నెహ్రూ వంటి వారి మెప్పును పొందారు. ప్రజా సమస్యలను చర్చించడమే పార్లమెంట్ సభ్యునిగా తన బాధ్యత అనుకోకుండా ఇతర సభ్యుల యోగక్షేమాలు ఆలోచించేవారు. అల్లూరి సీతారామరాజు సహచరుడైన గాము (గాం) మల్లుదొర పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పటికీ ఏ రకమైన అలవెన్సులూ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని తెలిసి ఆయన్ని నెహ్రూ దగ్గరకు స్వయంగా తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చేశారు.**

ఆయన జీవితపు ఆఖరు రోజుల్లో స్వాతంత్ర సమరయోధులకు పెన్షన్లు వచ్చేవి. ఆ సందర్భంలో కూడా ఆయన ఉద్యమకారుల యోగక్షేమాల గురించి ఆలోచించేవారు. ఉద్యమంలో పాల్గొని సాంకేతిక కారణాల వల్ల పెన్షన్ రాని కుటుంబాల వారికి, పోరాట యోధుల సంతతికి తన పెన్షన్‌ని నెలకింతని ఇచ్చేవారు తప్ప తన కోసం ఖర్చు చేసుకునేవారు కాదు. తనను కలవలేని వారికి మనియార్డర్ చేసేవారు. ఆయన నుంచి ఆ విధమైన ధన సహాయం పొందిన వారిలో పోలీస్ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన చింతం సత్యనారాయణ దాసు భార్య ఒకరు. రామారావు గారు నెల నెలా వచ్చే తన పెన్షన్ డబ్బు ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలో ముందుగా పేర్లు రాసి పెట్టుకున్నారు. దాని ప్రకారమే ఆయన చనిపోయిన నెలలో (సెప్టెంబర్ 1985) కూడా ఆ డబ్బు వారికి అందజేయడం జరిగింది.

ఆయన ఆదర్శప్రాయమైన దాంపత్య జీవితం గురించి కూడా చెప్పుకోవాలి. క్షయ వ్యాధిపై డిప్లొమా చేయడానికి 1934లో మైసూర్ వెళ్ళారు. అక్కడ అనుకోకుండా వైద్య విద్యార్థిగా ఉన్న కమలమ్మ గారిని కలిశారు. ఆమె తండ్రి రామస్వామినాయుడు బ్రహ్మ సామాజికులూ, పైగా వీరేశలింగం గారి అనుచరులు కావడం వల్ల తన కుమార్తెలను వీరేశలింగం గారి సంరక్షణలో పెంచి పెద్దజేశారు. చెలికాని రామారావు గారికి జాతీయోద్యమం లో చేరక ముందే బ్రహ్మ సమాజంపై అభిమానం ఉంది. ఆ విధంగా వృత్తీ ప్రవృత్తీ కలవడం వల్ల వివాహబంధానికి ఎక్కువ సమయం పట్టలేదు. 1940లో ఆయన సహచరి రామచంద్రపురం హాస్పిటల్‌కి మెడికల్ ఆఫీసర్ గా రావడంతో రామారావు గారి కార్యక్రమాలకు అదే కేంద్ర స్థానమైంది.

1948 నుంచి 1951 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టులను అతిదారుణంగా హింసకు గురిచేసింది. రామా రావు గారు ప్రత్యక్షంగా కార్యక్రమాల్లో లేకపోయినా ఆయన రామచంద్రపురంలో వైద్యం చేస్తూ ఉంటే ప్రజా ఉద్యమాన్ని ఆపడం కష్టమని ప్రభుత్వం ఆయన్ని అరెస్టు చేసి కడలూరు జైలులో పెట్టింది. స్వేచ్ఛగా ఎగిరే చిలుకను పంజరంలో పెడితే ఎగరడం మానకుండా ఆ పంజరం ఎత్తుకు ఎగురుతూనే ఉంటుంది. అలాగే జైల్లో కాల్పులు జరిగి అనుమర్లపూడి సీతా రామారావుగారనే రైతు నాయకుడు చనిపోవడం, కొందరు గాయాలపాలవడం జరిగినా, అందరూ వద్దన్నా వినకుండా తుపాకీ గుండ్ల మధ్య వెళ్లి రామారావుగారు తోటి ఖైదీలకు వైద్య సేవలందించారు.

రామారావు గారు బ్రహ్మ సమాజం ప్రభావంతో స్త్రీ విద్య అంతంతమాత్రంగా ఉన్న ఆ రోజుల్లో ఆయన సోదరి కుమార్తెను కుటుంబంలో మొదటి మహిళా డాక్టర్‌ని చేశారు. అంతే కాదు తన సోదరుడి చేతా సోదరి చేతా స్త్రీ విద్యను అంగీకరింపజేసి ఆ ఇద్దరికీ అంతర్వర్ణ, అంతర్రాష్ట్ర, వివాహాలు జరిపించడానికి

ఒప్పించారు. రామారావు గారు మాటల మనిషి కాదు చేతల మనిషి అని ఎన్నో సందర్భాల్లో రుజువు చేశారు.

స్త్రీకి ఆర్థిక స్వాతంత్రం ఉండాలని నమ్మిన రామారావు గారు పార్లమెంటులో వాదించడమే కాదు కమలమ్మ గారి ఆర్థిక స్వాతంత్రాన్ని ఎప్పుడూ గుర్తిస్తూ ఉండేవారు. ఇద్దరూ వైద్యులే అయినా రామారావు గారి పేషెంట్లు బీద ప్రజలు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలే కాబట్టి ఆయనకు సేవ ఎక్కువా సేవింగ్స్ తక్కువా అయింది. ఒకవేళ పదో పరకో వచ్చినా దాన్ని కూడా తిరిగి పేదల మందులకో ఆహారానికో ఖర్చు పెట్టేసే వారు. అందుకే ఎవరైనా చందాలు అడగడానికి వస్తే "నేనూ మీ బోటి వాడినే. కమలమ్మ గారిని అడుగుదాం!" అని కమలమ్మ గారి ఎదురుగానే అనేవారు. ఆయనది వేళాకోళం అనుకునే వారు కొంతమంది. కానీ తను నమ్మిన దాన్నే ఆయన చేప్పే వారు. ఆమె డబ్బు ఆమె దానం ఇవ్వాలి తప్ప తాను ఇవ్వకూడ దనే వారు.

తాను వద్దన్నా అన్న గారు తన ఆస్తిపై వచ్చే ఆదాయాన్ని ఇస్తుంటే దేశసేవలో భాగంగా దాన్ని అమ్మేశారు. తన సొంత ఖర్చులో ఎంత పొదుపరో ఇతరులకు పెట్టడంలో అంతదుబారా చేసేవారు. ఒక గృహస్థుగా వేల మందికి ఆతిథ్యమిచ్చారు. అనేకమంది విప్లవకారుల కుటుంబాలను తన ఇంట్లో ఉంచుకుని వారి పురుళ్ళూ, వైద్యాలు చేశారు.

ఆయన మానవతా దృక్పథానికి కొన్ని ఉదాహరణలు. ఒకసారి ఒక బీద ముస్లింకి చాలా వైద్యం చేసి తగ్గించారు. అతను వెళ్లేటప్పుడు తన దగ్గర ప్రస్తుతం డబ్బులేదని, తరువాత తెచ్చి ఇస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. రామారావుగారు ఆ సంగతే మర్చిపోయారు. ఒకరోజు అతను తన కొడుకుని తీసుకొచ్చాడు. ఆ అబ్బాయి దగ్గర సంచి ఉంది. ఇప్పుడు కూడా తన దగ్గర డబ్బు లేదని, ఒక స్నేహితుడు తన కొట్టులోని వెండి సామాను అరువు ఇచ్చాడని, వైద్యం బిల్లుకు బదులు ఆ సామాను తీసుకోమని ప్రాధేయపడుతూ ఆ సంచిలోని వెండి సామాను తీసి టేబుల్ మీద పెట్టాడు. రామారావు గారు చాలా వేదన చెందారు. వెండి సామాను సంచిలో పెట్టి, ఆయనకి ఇచ్చివేసి అలా ఎప్పుడూ చేయవద్దని నచ్చజెప్పారు. దూర గ్రామాల నుంచి బంధువులు (ఆడవారు)వస్తే వాళ్లకు సినిమా చూసే అవకాశం ఉండదని తప్పక సినిమాకు పంపేవారు. ఇంటికెవరైనా అతిథులొచ్చినపుడు వారితో సమానంగా వారి కారు డ్రైవరు, లేదా రిక్షా డ్రైవరుకు మంచినీళ్ళు, ఫలహారం, టీ వగైరా అందించేవారు. పలుమారు అతిథుల కంటి ముందు వారిని ఆదరించేవారు. రామారావు గారిల్లు ఓ చిన్నసైజు సత్రంలా ఉండేది. సెప్టిక్ టాంకులు తరచూ నిండిపోయేవి. సెప్టిక్ టాంకు తోడడానికి వచ్చే శానిటరీ వర్కర్ల పట్ల ఆయన చూపిన శ్రద్ధ ఆయన మానవత్వానికి మచ్చుతునక. ఇంటి ఆవరణలోనే ఓ గొయ్యి తవ్వించి తోడించి అందులో పోయించే వారు. అన్నీ దగ్గరుండి చేయించేవారు. పని పూర్తయిన తర్వాత సబ్బు ఇచ్చి దగ్గరుండి వాళ్ళను కాళ్ళు, చేతులు కడుక్కోమనే వారు. వాళ్ళు సబ్బు అక్కరలేదని చెప్పినా వినేవారు కాదు. సబ్బుతో కడిగిన తర్వాత యాంటీసెప్టిక్ లోషన్ ఇచ్చి కడగమనే వారు. వాళ్లు ఈయన్నో చాదస్తునిగా భావించి "అసలు పనికంటే ఈ పనెక్కువ అయిపోయింది" అని చెబుతూ నవ్వుకొనేవారు.

రామారావు గారు తొలి పార్లమెంటులో లేవనెత్తిన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఈ నాటికీ అలాగే ఉన్నాయి. అంతేకాదు అలా సమాజ శ్రేయస్సు గురించి మాట్లాడే నాయకులు ఈ నాడు మనకు పార్లమెంట్‌లో లేరంటే అతిశయోక్తి కాదు. ఆయన లేవనెత్తిన సమస్యలు కొన్ని ప్రస్తావించుకుందాం. ఎందుకంటే పరిష్కారం అయ్యేవరకూ ఇవి మనకు చర్చనీయాంశాలే.

ప్రజా ప్రతినిధులకు కనీస జీవనానికి జీతభత్యాలు అవసరమే! అయితే వారు ఏ ప్రజలకు ప్రతినిధులుగా ఉన్నారో వారి పేదరికం, నిరుద్యోగాన్ని దృష్టిలో ఉంచుకోవాలంటారు. ఆర్థిక సమస్యకు మూలకారణం సంపద కొందరి చేతిలో ఉండిపోవడం, మిగిలిన వారు దోపిడీకి గురవడం తప్ప జనాభా పెరుగుదల కాదన్నారు. మాంసకృత్తులు ఎక్కువగా తీసుకుంటే గర్భధారణ శక్తి తగ్గుతుందనీ, మన దేశంలో మాంసకృత్తుల వాడకం చాలా తక్కువనీ, ఈ పెట్టుబడి దారీ సమాజం ప్రజలను ఆకలితో మాడ్చి చంపుతోందని అనేవారు. ఈ దీనత్వానికి కారణం అధిక జనాభా అని, ఇది ఏ మాత్రం సహించలేని విషయం అని నిరసించారు. ఇక్కడో విషయం గమనించాలి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన డాక్టర్లలో రామారావు గారు అగ్రగణ్యులు. ఆ రోజుల్లో వాటిని ఉచితంగా చేసిన వ్యక్తీ రామారావు గారే.

- మన మతంలో ఎంతో మంచి ఉంటే ఉండొచ్చు కానీ భయానకమైన విషయాలు చాలా ఉన్నాయనీ మంచి ఆచారాలనుకుంటున్నవి కుళ్ళి హీన స్థితికి వచ్చాయనీ వాటిపై ఎవరితో చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు.
- 'పోలీసు స్టేషన్ల నుంచి ప్రజలను బయటకి తీసుకెళ్ళి, కాల్చి చంపి ఆ తరువాత, ఆత్మ రక్షణార్థం పోలీసుల ఎదురుకాల్పులు అంటూ కథలు ప్రచారం చేస్తున్నారు. ఇదంతా పచ్చి మోసం, దగా అని' ఆగ్రహం వెలిబుచ్చి ఒక సంఘటన ఉదాహరించారు. 1950లో ఒకరోజు సాయంత్రం పిఠాపురం దగ్గరలోని ఓ గ్రామంలో చింతం సత్యనారాయణ దాసు, పెన్మత్స అనంతవర్మ అనే ఇద్దరు కమ్యూనిస్టులను బహిరంగంగా అరెస్టు చేశారనీ, ఆ మర్నాడు ఉదయానికి ఆ ఇద్దరూ మరో గ్రామంలో

శవాలుగా కన్పించారనీ, ఇది అబద్ధమని రుజువైతే తాను రాజీనామా చేస్తానని చాలెంజ్ విసిరారు.

- దురదృష్టవశాత్తు మనదేశం వెనుకబడి, మూఢ నమ్మకాలకు నిలయంగా వున్న దేశం. అవినీతిపరులు ఈ మూఢ నమ్మకాలను సొమ్ము చేసుకుంటున్నారు. ఇంకా తాయెత్తులు, రక్షరేకులు, మాయా ఉంగరాలు, ప్రపంచంలోని ఏ వ్యాధినైనా నివారించగలిగే విద్దూరమైన ఉంగరాలను నమ్మే స్థితిలో ప్రజలుండటం విచారించాల్సిన విషయం అన్నారు.
- మద్యపాన నిషేధం గురించి మాట్లాడుతూ మనం ఎన్నో విషాలను అదుపుచేశాం. స్వల్పంగా ఉన్నా తీవ్రంగా ఉన్నా ఈ మత్తుపానీయాలను కూడా విషంగా పరిగణిస్తే సమాజ శ్రేయస్సు దృష్ట్యా వీటికి నిబంధనలు విధించి తీరాలని నొక్కి చెప్పారు.
- పాలు ప్రత్యేకించి శిశువులూ, బాలలూ, రోగులూ తీసుకుంటారు. స్వచ్ఛమైన పాలు సరఫరా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి అన్నారు.
- నాగరిక ప్రభుత్వం అని చెప్పుకునే ఏ దేశంలో అయినా సరే అన్నింటికంటే ముఖ్యమైనది నాణ్యమైన ఉచిత వైద్యం. కానీ మన వైద్యచికిత్స అంతంతమాత్రమూ, తాతలకాలం నాటిది' అని యద్దేవా చేశారు.

కమ్యూనిస్టులపై దురహంకారంతో విమర్శలు చేస్తున్నారనీ మన దేశ రక్షణకు ప్రమాదకరంగా మారుతున్న ఎన్నో అంశాలకు 'కమ్యూనిస్టు వ్యతిరేకత' అన్న ముసుగు వేస్తున్నారనీ ఈ కమ్యూనిస్టు వ్యతిరేకత సామ్రాజ్యవాదులకు చక్కటి సాకుగా పనిచేస్తుందనీ హెచ్చరించారు. వీధి బాలలు బాల యాచకుల గురించి మాట్లాడుతూ కంటికి రెప్పల్లా కాపాడుకోవాల్సిన చిన్నారుల పట్ల నిర్లక్ష్యం వహించడం క్షమించరాని నేరమని అన్నారు. విదేశీ పెట్టుబడి వల్ల అంటే విదేశీ పరిశ్రమల వల్ల ఇక్కడ విదేశీ దోపిడీ కొనసాగుతోందని గుర్తించాలన్నారు. యుద్ధ సమయంలో తీసేసిన కాకినాడ కోటిపల్లి రైలు మార్గ పునరుద్ధరణకు కావలసినంత స్థలం, గట్టు ఉన్నా దాన్ని ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. పన్నుల క్రమబద్ధీకరణ గురించి మాట్లాడుతూ ఇనుము, ఉక్కు, మోటార్ స్పిరిట్, పెట్రోలియం వంటివి పన్ను పరిధి నుంచి తప్పిస్తే అది కేవలం ధనవంతులకు, పెట్టుబడిదారులకే ఉపయోగపడుతుందని తెలుసుకోవాలన్నారు. భూ సంస్కరణలు అమలు చెయ్యలేకపోతే మన ప్రణాళికలు, మన కార్యక్రమాలు, మన ప్రచారం అన్నీ శుద్ధ దండగని వాదించారు.

సినిమాల విషయాన్నీ ప్రస్తావిస్తూ 'విదేశీ చిత్రాలకు సంబంధించి మనం చాలా విషయాలను నేర్చుకోవచ్చు. కానీ వాటిలో చాలా వరకు పూర్తిగా సెక్స్ సినిమాలు, పనికిమాలినవి. మన ప్రజలపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. విదేశీ చిత్రాలకు సంబంధించినంత వరకూ పరిమితులు విధించడానికీ, నియంత్రించడానికీ పార్లమెంటు నుంచి అదనంగా అధికారం పొందాలనుకుంటే తాను మద్దతిస్తానన్నారు. టెక్స్ట్ పుస్తకాల ప్రస్తావన వచ్చినపుడు పాఠశాల చివరి దశ తరువాత రాష్ట్ర ప్రభుత్వ అవసరమనుకుంటే కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యంలోకి రావాలన్నారు. అనాధలకు సంబంధించిన ఈ బిల్లు ప్రస్తావనలో అనాధల సంరక్షణని ఉపేక్షించడం కంటే క్షమించరానిదేమీ లేదన్నారు.

ప్రభుత్వ దుబారా గురించి చెబుతూ 'కొత్త ఢిల్లీ రైల్వే స్టేషన్‌కి ఆడంబరం కోసం సుమారు 25 లక్షల రూపాయలు, తపాలా బిల్లల ప్రదర్శన శాలకు పది లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. కానీ ఒక అనాథ శరణాలయానికి అయిదో పదో లక్షలు ఖర్చు పెట్టాలంటే మీ దగ్గర డబ్బు ఉండదు' అని ఘాటుగా విమర్శించారు. అలాగే శత్రువుల ఫిరంగుల కాల్పులను ఎదుర్కోవడం కంటే రైల్వే ప్లాట్ ఫామ్ మీద మూడో తరగతి మరుగుదొడ్లోకి అడుగు పెట్టడానికి ఎక్కువ ధైర్యం కావాలనీ ఒక మంత్రి చేయవలసిన అత్యంత వివేకవంతమైన పని ప్రజా మరుగుదొడ్డిని ప్రారంభించడమనీ హితవు పలికారు.

కార్మికుల సంక్షేమం గురించి చెబుతూ ఆరోగ్యంగా, శక్తివంతులుగా ఉన్నంత వరకూ మీరు వాళ్ళ శక్తిని ఉపయోగించుకుంటారు. వారు క్షయ వ్యాధితో బాధపడుతుంటే వారిని చెత్త కుప్పలోకి విసిరేస్తున్నారు. మీ రికార్డులు మాత్రం వారికి మంచి చికిత్స అందిస్తున్నట్టు తెలుపుతున్నాయి. వాళ్ళకు కావలసినది విశ్రాంతి, మంచి వైద్యంఅని సూచించారు. విదేశీ ఔషధాలపై మనం చెల్లించే ధనం మనలాంటి పేద దేశం భరించలేదు కాబట్టి మన ప్రజలకు చౌకగా ఔషధాలను సరఫరా చేసే పరిశ్రమ మనం అభివృద్ధి చేసుకోవాలన్నారు. చైనాలో లాగా ఆయుర్వేదం వంటి ఇతర మెడికల్ ప్రాక్టీషనర్లను ఉపయోగించుకోమని సలహా ఇచ్చారు.

మన ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సహాయం ఎంత నిరాశాజనకంగా ఉందో మనందరికీ తెలుసు. దీనికే మనం సిగ్గుపడాలి. అందుకనే ప్రజలు ఇటువంటి వింత చికిత్సలు, విద్దూరమైన మందులు కోసం పరుగులు తీయడం నాకు ఆశ్చర్యం కలిగించడం లేదు. మనదేశంలో ఎవరైనా నకిలీ వైద్యులు లేదా ఒక వ్యక్తి చెట్టు క్రింద కూర్చుని తన జీవనోపాధి ఏర్పరచుకోవచ్చు. మనది మూఢ నమ్మకాలను నిలయంగా వున్న దేశం. నిబద్ధత , నిజాయితీ లేనివారు, ఈ మూఢ నమ్మకాలను సొమ్ము చేసుకుంటున్నారు. మన దురదృష్టకర దేశంలో ఎటువంటి చెత్తను అయినా మందు పేరుతో అమ్మేయవచ్చు. అలాగే కొంత చెత్తను ఖరీదైన, స్పష్టమైన మందుల రూపంలో మార్కెట్లో అమ్ముతున్నారు' అన్నారు. ఒకటేమిటి, నదీ జలాలు, రాష్ట్రాల

పునర్విభజన, స్త్రీల వారసత్వ హక్కులు, ఆహార కల్తీ, ముందస్తు నిరబంధాలు, మందుల మాయాజాలం.. ఇలా పార్లమెంట్‌లో ఆయన లేవనెత్తిన సమస్యల గురించి చెప్పాలంటే ఒక ఉద్గ్రంథం తయారవుతుంది.

బ్రహ్మసమాజ ఉద్యమం, హరిజనసేవ, స్త్రీజనోద్ధరణ, స్వాతంత్ర్య పోరాటం, కమ్యూనిస్టు ఉద్యమం, జైలు జీవితం, పార్లమెంట్ సభ్యత్వం, వైద్యసేవ అన్నీ చెలికాని రామారావు గారి జీవిత చరిత్రలో భాగమే! అన్నింటికన్నా మానవీయత, నిజాయితీ, నిబద్ధత, వినమ్రత, స్పష్టత ఆయన విశిష్టలక్షణాలు. సంఘసంస్కరణ, విప్లవభావాల సమ్మేళనం అయిన రామారావు గారు భౌతికవాదిగా, కమ్యూనిస్టుగా పరిణామం చెందారు. ఆ జన్మాంతం ఆదర్శ జీవితాన్ని గడిపి భావితరాల వారికి ఆదర్శంగా నిలిచి తన 84వ యేట(25-09-1985) తుది శ్వాస విడిచారు.

ఆయన్ను అభిమానించే స్థానిక పెద్దలంతా కలిసి ఆయన స్మారకార్థం ఒక భవనం నిర్మించారు. 25-9-1988న శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసారు. 25-9-1990న కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు శ్రీ నీలం రాజశేఖరరెడ్డి భవనాన్ని ప్రారంభించారు. 1986 నుంచి ప్రతి సంవత్సరం రామారావు గారి వర్ధంతి రోజు (సెప్టెంబర్ 25)న సామాజికావగాహనకు తోడ్పడేలా ప్రముఖుల చే ఉపన్యాసాలిప్పిస్తున్నారు. వివిధ జాతీయ దినోత్సవాలకు, ఇతర సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆ భవనాన్ని ఉపయోగిస్తున్నారు. 1986 నుంచి క్రమం తప్పకుండా స్మారకోపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ కార్యకలాపాలు జరుగుతున్నాయి.

ప్రతి సంవత్సరము రామారావు గారి అభిమానులు, కుటుంబ సభ్యులు, పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, వర్ధంతి రోజున కమిటీ ద్వారా అందజేస్తున్నారు. భవనం ప్రారంభమయిన దగ్గర నుంచి వివిధ కార్మిక సంఘాలకు,' ప్రజా సంఘాలకు వారి సమావేశాలు జరుపుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంది. అన్ని సౌకర్యాలు లేకున్నా అనేక బీద కుటుంబాలవారీ భవనంలో పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. కీ॥శే॥ శ్రీపుత్సల సత్యనారాయణ గారు స్థాపించిన ఆర్.కె. ఐడియాలాజికల్ సొసైటీ వారు నిర్వహించే సభలకు, కార్యకలాపాలకూ ఈ భవనము కేంద్రంగా ఉంది. రిపబ్లిక్‌డే , స్వాతంత్ర్యదినోత్సవం, నెహ్రూ జయంతి మొదలైన అనేక జాతీయ పండగలను ఈ భవనంలో పలుమార్లు ఘనంగా రామారావుగారి స్మారక కమిటీ నిర్వహించింది.

శ్రీ బి.వి.వి. బాలకృష్ణ ఎం.ఫిల్. పట్టా కోసం ఆంధ్రా యూనివర్శిటీకి సమర్పించిన (డాక్టర్ చెలికాని రామారావుగారి జీవితం) సిద్ధాంత వ్యాసాన్ని 'విశాలాంధ్ర' పబ్లిషింగ్ హవుస్ వారు ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ ప్రచురిస్తున్న "ఆంధ్రుల సమగ్ర చరిత్ర, సంస్కృతి' మొదటి సంపుటి (తెలుగు) ప్రచురణకు రామారావుగారి కమిటీ ఆర్థిక సహకారం అందించింది.! గుంటూరు లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ వారు స్మారక కమిటీ సహకారంతో ప్రతి సంవత్సరం చెలికాని రామారావు గారి స్మారకార్థం ఒక కరపత్రం ప్రచురించాలని నిర్ణయించారు. ఆయన వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ప్రముఖులు ఇచ్చిన ఉపన్యాసాలను 'వీక్షణం' పేరుతో పుస్తక రూపంలో తీసుకొచ్చారు. నాటి పార్లమెంట్ సభలో ఆయన వ్యక్తం చేసిన భావాల ప్రాధాన్యాన్ని గుర్తించిన చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ వాటిని తెలుగులోకి అనువదింపజేసి 'తొలి పార్లమెంట్‌లో డాక్టర్ రామారావు' పేరుతో పుస్తక రూపంలో పాఠకులకు అందజేసింది. 2020, 2021 సంవత్సరాలలో డా.చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ తరుపున ప్రగతిశీల భావాలకు సంబంధించిన సుమారు పది పుస్తకాలను ప్రచురించారు. రామారావుగారి గురించి ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు చండ్ర రాజేశ్వరరావు గారు చెప్పినట్టు "వారు తమ జీవితాన్నంతా దేశ ఔన్నత్యానికి, ప్రజాసేవకు, సంఘ సంస్కరణకు, సాంఘిక న్యాయానికి అంకితం చేశారు. వారు ఆదర్శమైన జాతీయవాది. మానవతా వాది కమ్యూనిస్టు. నేడు మన జాతీయోద్యమ విలువలు వెనుకపట్టు పట్టినవి. డబ్బు, అధికారం అనేవి రాజకీయ జీవితాన్ని కలుషితం చేస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న ఇటువంటి కిష్టపరిస్థితులలో డాక్టర్ చెలికాని రామారావు వంటి ఆదర్శ జీవితమే మనకు వెలుగుబాట".

---

## భౌతికవాదుల చేతిలో బ్రహ్మాస్త్రం 'భారతీయ నాస్తికవాదం'


**(36వ పేజీ తరువాయి)**


ఆవిష్కరిస్తుంది. దేవీప్రసాద్ తెలుగువాళ్లకేమీ కొత్తవాడు గాదు. ఆయన గ్రంథాలు 'లోకాయత' లాంటివి ఎంతో కాలం ముందే తెలుగులోకి వచ్చి గొప్ప ప్రాచుర్యం పొందాయి. ఇప్పటి దాకా ఇది తెలుగులో వెలుగు చూడకపోవడం పెద్ద కొరతే. ఆలస్యంగానే అయినా ఎంతో బాధ్యతతో ఇందుకు పూనుకున్న రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు గారిని, ఇప్పటికీ ఇలాంటి గ్రంథాలపై మాదే పేటెంట్ అని నిరూపించుకున్న విశాలాంధ్ర వారినీ ఎంత ప్రశంసించినా తక్కువే అవుతుంది. సనాతనం పేర మన వారసత్వాన్నంతా ఏకశిలాసదృశ్యం చేసే దుర్మార్గం వికృతంగా జరుగుతున్న ప్రస్తుత సందర్భంలో దీని విలువ ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. ❑




ఇది కాదు.. అది చూడు

డిగ్రీ పట్టా





విశ్వ విస్ఫోటనం

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**
Vol : 3 - Issue No : 12 September 2025


# కొత్త పుస్తకాల స్వీకారం




ప్రతులకు..
నవ తెలంగాణ పబ్లికేషన్స్
హైదరాబాద్




ప్రతులకు..
నవ చేతన పబ్లికేషన్స్
హైదరాబాద్

if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post
To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.